శ్రీమతే రామానుజాయ నమః



పెరియాళ్వార్లు అనుగ్రహించిన

# తిరుప్పల్లాణ్డు

పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యాన సహితము,

అరుంబదము, వ్యాఖ్యానానువాదములతో


ఆంధ్రీకర్త

పండితరత్న, వేదాంత వాచస్పతి,

సత్‌సంప్రదాయ విద్వన్మణి

ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు


ఉ.వే. శ్రీమాన్. కందాళ వేంకటాచార్య స్వామివారి

82వ తిరునక్షత్రోత్సవ జ్ఞాపిక


2012


సమర్పణము

శ్రీమతి నాగులకొండ రాజమ్మ (తల్లెమ్మ),

శ్రీమాన్ నాగులకొండ శింగరయ్య దంపతులు


Scanned by CamScanner

# తిరుప్పల్లాణ్డు - పెరియాళ్వార్లు

## పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానము, అరుంబదములతో

వ్యాఖ్యానానువాదము - ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యస్వామి


ఆవిష్కరణము - 3, జూలై, 2012 - నందనం-ఆషాఢం-మూల

సందర్భము - ఆచార్య తిరునక్షత్రోత్సవ ప్రయుక్తముగా

వేదిక - త్రైవర్ణిక వైష్ణవ రామానుజకూటం, విజయనగరం

ప్రథమముద్రణము - జూలై, 2012

ముఖ చిత్రము - తిరుమలై అప్పన్ గరుడసేవ
పెరియాళ్వార్లు - శ్రీవిల్లిపుత్తూరు

ప్రతులు - 800

వెల - అమూల్యము.


అన్నిహక్కులు - వ్యాఖ్యాతవే.

**ఈ గ్రంథము శ్రీమతి నాగులకొండ రాజమ్మ (తల్లెమ్మ),**
**శ్రీమాన్ నాగులకొండ శింగరయ్య దంపతులు**
**భక్తితో సమర్పించిన పవిత్రద్రవ్యముతో ముద్రించబడినది.**

రాజమ్మాశింగరయ్యాఖ్యౌ దంపతీ భాగ్యశాలినౌ ।
స్వాచార్యతుష్టయే యాభ్యాం క్రియతేऽస్య ప్రకాశనమ్ ॥


**ప్రతులకు**

1. శ్రీమతి కె. జానకి
18-3-38(ఎ)
గుండాల వారి వీథి
విజయనగరం
☎ 08922 - 225070

2. శ్రీమాన్ ఎన్.వి. శింగరయ్య గారు
7-1-4,
మంచుకొండవారి వీథి
విజయనగరం - 535 001
☎ 90522 77563

అక్షరయోజనము : శ్రీమతి జయలక్ష్మి & శ్రీ చంద్రశేఖర్, తిరుపతి

ముద్రణ : సి.ఎస్. ప్రింటర్స్, తిరుపతి


Scanned by CamScanner

పండితరత్న, ఉభయవేదాంత వాచస్పతి
**ఉ.వే. శ్రీమాన్ కిడాంబి వేంకటాచార్య స్వామివారు**
స్థానాచార్యులు, శ్రీఆదికేశవ ఎమ్బెరుమానార్ స్వామివార్ల కోవెల
నరసాపురం, ప.గో. జిల్లా.

శ్రీమతే రామానుజాయ నమః

# తిరుప్పల్లాణ్డు - పెరియాళ్వార్లు

శ్లో॥ మిథునే స్వాతిజం విష్ణోః రథాశం ధన్వినః పురే ।
ప్రపద్యే శ్వశురం విష్ణోః విష్ణుచిత్తం పురశ్శిఖమ్ ॥

శ్రీమన్నారాయణుని నిర్హేతుకజ్ఞానలబ్దసర్వతోభద్రపూర్ణులైన ఆళ్వార్ల అవతారక్రమంలో పెరియాళ్వార్లది సప్తమమైన అవతారం.

ఆళ్వార్లలో మొదటివారు ముదలాళ్వార్లు, శ్రీనమ్మాళ్వార్లు అనుగ్రహించిన ద్రావిడవేదచతుష్టయానికి అంగములుగా నూఱు దివ్యప్రబన్ధాల్ని అనుగ్రహించిన వారు తిరుమంగైయాళ్వార్లు. అవతారక్రమంలో గాని, దివ్యప్రబంధబాహుళ్యంలో గాని పెరియాళ్వార్లకు ప్రథమస్థానం లేదు. అయినా, వీరిని పెరియాళ్వార్లు-పెద్ద ఆళ్వార్లు - అనుట ఎట్లు పొసగును? అను శంకకు సమాధానం ఈ క్రింది మణవాళమామునుల ఉపదేశరత్తినమాలైలోని దివ్యసూక్తి-

మఙ్గళాశాసనత్తిల్ మఱ్ఱుళ్ళ వాళ్వార్గళ్
తఙ్గళ్ ఆర్వత్తు అళవుతానన్టి- పొఙ్గుమ్
పరివాలే విల్లిపుత్తూర్ పట్టర్ పిరాన్ పెఱ్ఱాన్
పెరియాళ్వార్ ఎన్టుమ్ పెయర్.

భగవానునికి మంగళాశాసనం చేయుటలో తక్కిన ఆళ్వార్లకంటే పెరియాళ్వార్లకు అనవధికమైన ప్రీతి. ఆ కారణంచే వీరికి పెరియాళ్వార్లు అను పేరు కల్గినది-అని పాశురభావం. వీరిని పెరియాళ్వార్లు అనుటకు వేఱొక కారణం-

"అరఙ్గర్మౌళి శూళ్గిన్టమాలైయై చ్చూడి క్కొడుత్తవళ్ తొల్లరుళాల్ వాళ్గిన్ట వళ్ళల్ ఇరామానుశనెన్టుమ్ మామునియే" అనే ఇరామానుశ నూఱ్ఱన్దాది పాశురం ద్వారా శ్రీరంగడు తన కిరీటానికి అలంకరించుకొన్న మాలిక గోదాదేవి అలంకరించుకొని విడచిన మాలికయే. శ్రీరంగనికి గోదాదేవి అలంకరించుకొన్న

Scanned by CamScanner

మాలయే అత్యంతభోగ్యమైనది - అట్టి గోదాదేవి దివ్యకటాక్షాన్ని పొందినవారు ఉదారులైన గొప్ప మునులు శ్రీరామానుజులవారు- అని పైపాశురభావం.

శ్రీరంగనాథుడు (వటపత్రశాయి) అలంకరించుకొనుటకు తగినట్లు గోదాదేవి ముడిచి విడచిన మాలికను సమర్పించినవారు భట్టనాథులు (ఇది గోదా చరిత్రలో స్పష్టము) తనకు ఇష్టమైన మాలికను సమర్పించిన భట్టనాథులకు శ్రీరంగడు పెరియాళ్వార్లు - అను బిరుదాన్ని ప్రసాదించినాడని - శ్రీవేదాంత దేశికుల సూక్తి. అంతియే గాక "శ్వశురమమరవంద్యం రంగనాథస్య సాక్షాత్" అన్నట్లు శ్రీరంగానికి మామగారై నిత్యసూరిగోష్ఠిచే నమస్కరింపదగినవారు అన్నట్లు పెరియాళ్వార్లు అయినారని పూర్వులు అనుగ్రహించినారు.

ఇంతకును, సర్వజ్ఞత్వసర్వశక్తిత్వ పూర్ణుడైన శ్రియఃపతికి అతనిచే రక్షింపబడే చేతనుడు మంగళం (ఆశీర్వచనం) చేయవచ్చునా? ఇది స్వరూపవిరుద్ధము కాదా! అను సందేహానికి శ్రీపిళ్లైలోకాచార్యస్వామివారు శ్రీవచనభూషణదివ్యశాస్త్రంలో సమాధానం ఇచ్చినారు- దాని సంగ్రహమిది -

జీవునకు జ్ఞానదశ - ప్రేమదశ అను రెండు దశలుండును. జ్ఞానదశలో భగవానుని సర్వజ్ఞత్వ- సర్వశక్త్యాదిగుణములు ప్రకాశించి అతడు రక్షకుడు తాను రక్షింపదగినవాడు అనే భావాన్ని పొందును. ఆ జ్ఞానమే ప్రేమగా మారినపుడు రక్ష్యరక్షకభావము తారుమారగును. అను తాను రక్షకుడనియు- భగవానుడు రక్ష్యభూతుడనే భావము స్థిరముగా నుండును. చేతనునికి ఈ భావము కల్గుటకు కారణము - భగవానుని దివ్యమంగళవిగ్రహములో గల సౌందర్య సౌకుమార్య లావణ్యాదులు. వీనిని చూచినపుడు చేతనుడు స్వామికి "పల్లాణ్డు... పల్లాణ్డు- పల్లాయిరత్తాణ్డు- పలకోటి నూఱాయిరమ్" అనే రీతిలో కాలమున్నంతవరకు మనుష్యదేవబ్రహ్మ మానములతో మంగళము (శుభం) అని మంగళాశాసనము చేయుచునే యుండును.

శ్రుతిమాతకూడా భగవానుని సృష్టికి ఉన్ముఖునిగా జేయుటకు "జయ జయ జహ్యాజామ్" (భాగ-ద.స్క-14శ్లో, 8వ అధ్యాయం) జయ జయ (మంగళం) అని స్వామికి మంగళమునాశాసించును.

భగవానుడు పరత్వాదిస్థితులలో ఏస్థితిలో వేంచేసియున్నా భక్తులు చేయునది మంగళాశాసనమే. "ఉఱకల్ - ఉఱకల్" నిద్రవలదు- నిద్రవలదు- అని స్వామి రక్షణలో జాగరూకులై మెలగుడని శంఖచక్రములను హెచ్చరించినారు భట్టనాథులు.

Scanned by CamScanner

ఇది మంగళాశాసనకార్యం. అస్థానే భయశంకిత్వం. ఈ భావన అంతర్యామి విషయంగా నడచింది. ఇక తిరుమళ్ళిశైప్పిరాన్ అనుభవము.

"అజ్గారవార మతు కేట్టు అళ్లల్ ఉమిళ్లుమ్ పూజ్గార్ అరవణైయాన్" - నిత్యసూరులు సామగానం చేయుచుండగా ఆదిశేషులు స్వామికి ఏమి కీడు కల్గునో అనే శంకతో పూత్కారం చేస్తారట. అర్చలోకూడ - "నాథనిద్రోచితోన్నిద్ర తామ్రేక్షణాం సంచరన్తీం స్తుమస్తాం చ పంచాయుధీమ్"- శ్రీరంగనాథుడు నిద్రించుటకు తగినట్లు పంచాయుధాలు తాము నిద్రింపక నిద్రలేమిచే అరుణనేత్రములై స్వామికి కాపలాగానుండునట- ఇది పరాశరభట్టర్ అనుభవం. ఇట్లెన్నియో ఆళ్వార్ల, పూర్వాచార్యుల అనుభవాలను భావన చేయవచ్చును.

భగవానునికి మంగళాశాసనం చేయుటకు అజ్ఞవిజ్ఞప్రాజ్ఞనియమం లేదు. భక్తిపరవశులు చేసే కార్యమే ఇది. శ్రీరామాయణాదులలో దానిని స్పష్టంగా చూడవచ్చునని పిళ్ళైలోకాచార్యస్వామివారు శ్రీవచనభూషణంలో విశదంగా అనుగ్రహించినారు.

పండితసభలో విష్ణుపరత్వస్థాపకులైన పెరియాళ్వార్లకు ఆ సభను ఏర్పాటుచేసిన మధురానగరపు రాజు వల్లభరాయలు గజారోహణమహోత్సవాన్ని ఏర్పాటుచేసినారు. ఆ ఉత్సవాన్ని దర్శించుటకు వైకుంఠవాసుడైన శ్రియఃపతి పత్నీపరిజనసహితుడై ఆకసమున సాక్షాత్కరించినాడు.

స్వామిని సేవించిన పెరియాళ్వార్లు అతని సౌందర్యసౌకుమార్యాదులకు ఏమి హాని కల్గునో అను ఆ శంకతో స్వామికి, అతని అవతార వీరకృత్యములకు, పాదారవిందములకు, స్వామిని ఎప్పుడు వీడని భక్తులకు స్వామిని వీడని శ్రీదేవికి శంఖచక్రాలకు మంగళాశాసనం చేసినారు.

భగవానునికి ఉదయంనుండి రాత్రివరకు చేసే సేవలలో ఉదయం- సుప్రభాతం, రాత్రి శయనం - మంగళాశాసనంతో ప్రారంభమయి మంగళాశాసనంతో పూర్తి అగును. స్వామికి మంగళాన్ని ఆశించుట దాసుని కృత్యము. శేషభూతుడు శేషికి చేయు ముఖ్యమైన సేవ. వేదేతిహాసపురాణములలో బోధించిన భగవత్- భాగవత మంగళాశాసనాన్ని పెరియాళ్వార్లు అనుభవపరీవాహరూపంగా తిరుప్పల్లాణ్డు దివ్యప్రబన్ధరూపంలో కృపజేసినారు. కావుననే గృహతిరువారాధనగావచ్చును; కోవెలలోని స్వామి ఆరాధన కావచ్చును. అంతయు పల్లాణ్డుతో

Scanned by CamScanner

ప్రారంభమయి పల్లాండుతో పూర్తి అగును. (శాత్తుముత్రై). కావుననే ద్రావిడవేదానికి వ్యాసపదమలంకరించిన శ్రీమన్నాథమునులు తిరుప్పల్లాణ్డును ముదలాయిరంలో మొదటి దివ్యప్రబన్ధంగాను, (భగవన్మంగళాశాసనపరమైనదాని) ఆచార్యవైభవ మంగళాశాసనాల్ని తెలుపు కణ్ణినుణ్శిఱుత్తామ్బును చివరి దివ్యప్రబంధంగాను కూర్చుట జరిగినది. తిరుప్పల్లాణ్డు దివ్యప్రబన్ధానికి గల మఱియొక వైశిష్ట్యము -

తిరుప్పల్లాణ్డు "వేదత్తుక్కు ఓమెన్ను మదుపోల్ ఉళ్ళదుక్కెల్లామ్ శురుక్కాయ్ తాన్ మఙ్గళమాదలాల్ (ఉపదేశరత్తినమాలై) వేదసంగ్రహం ప్రణవం- "ప్రణవాద్యా స్తథా వేదా:" గదా! ఈప్రణవం అర్థపంచకజ్ఞానాన్ని కల్గిస్తుంది. ప్రణవంలోని ఓంకారం మంగళవాచకం. ఓంకారం, అథశబ్దం మంగళవాచకములని ప్రమాణం కావున చేతనునికి స్వరూపజ్ఞానం కల్గించి అతని ముఖ్యకృత్యమైన భగవత్ భాగవతమంగళాశాసనాన్ని ప్రణవం తెలియజేస్తుంది.

పెరియాళ్వార్లు తిరుప్పల్లాణ్డు దివ్యప్రబంధంలో "పల్లాణ్డు" అని భగవంతునికి మంగళాశాసనం చేసినారు. తాను ఒక్కరే ఈ అనుభవాన్ని పొందుటకు తృప్తిపడక కైంకర్యనిష్ఠులు, ఆత్మప్రాప్తికాములు, ఐశ్వర్యార్థులు - అను వీరినికూడ భగవత్ మంగళాశాసనానికి ఆహ్వానించినారు. వారందఱును స్వరూప జ్ఞానవంతులై తమ గోష్ఠిలో చేరినారు. పిమ్మటవారందఱితోడను కలసి భగవదవ తారములలోని వైభవాన్ని అనుభవించి భగవత్మంగళాశాసనమే పరమ పురుషార్థమని దివ్య ప్రబంధాన్ని పూర్తిచేసినారు.

ఆవగింజలో మేరుపర్వతాన్ని ఇమిడ్చినట్లు జ్ఞాతవ్యసకలార్థాలను పెరియాళ్వార్లు ఈ 12పాశురాలు గల దివ్యప్రబన్ధంలో ఇమిడ్చినారు. పరమ కారుణికులు, వ్యాఖ్యాతృచక్రవర్తియగు పెరియవాచ్చాన్పిళ్ళైగారు నాలాయిర దివ్యప్రబన్ధములకు గంభీరార్థసంకలితమైన వ్యాఖ్యానాన్ని అనుగ్రహించినవారు. ఈ తిరుప్పల్లాణ్డుదివ్యప్రబన్ధానికి విశదమైనవ్యాఖ్యను అనుగ్రహించినారు. పాశురాల్లోని ప్రతిపదస్వారస్యాన్ని గాంభీర్యాన్ని విశదపఱచినారు. చేతనుడు ఏల భగవంతునికి మంగళాశాసనం చేయాలో అనేదానిని "పతిం విశ్వస్య" అని ప్రారంభించి విశదతమమైన అవతారికను అనుగ్రహించారు. తిరుప్పల్లాణ్డు పాశురాలు కర్ణామృతాలు. పెరియవాచ్చాన్పిళ్ళైగారి వ్యాఖ్యానం గంభీరార్థ ప్రతిపాదకం.

గత పుష్కరకాలానికి పైగా దివ్యప్రబన్ధస్తోత్రవాఙ్మయాలకు స్పష్టతమమైన, హృదయరంజకమైన వ్యాఖ్యాపరంపరలతో ఆంధ్రులను అలరింపజేయుచున్నారు-

Scanned by CamScanner

పండితరత్న- ఇత్యాదిబిరుదాంకితులైన శ్రీ ఉ.వే.శ్రీమాన్ ఠ॰ఎ. శింగరాచార్య స్వామివారు. పుంఖానుపుంఖములుగా వీరు వెలయించు వ్యాఖ్యాగ్రంథములు పండితులకేగాక సాధారణపాఠకులకుకూడ ఆనందానందాన్ని కల్గించుట సర్వేశ్వరుని కృపాఫలితమేయనుట సమంజసము.

లీలావిభూతిలోనున్న విజయనగరాన్ని నిత్యవిభూతిగా సదా భగవద్ భాగవతగుణానుభవంతో ప్రకాశించేటట్లు అనుగ్రహించినవారు కీర్తిమూర్తి, ఉభయవేదాన్త విద్వత్తల్లజులైన శ్రీ.ఉ.వే.శ్రీమాన్ కందాళ వేంకటాచార్యస్వామి వారు. తమ పితృపాదుల జ్ఞానధారను నిరాటంకంగా ప్రవహింపజేయుచు, సంప్రదాయ సేవను చేయుచున్నవారు ఉభయవేదాన్తవిదుషీమణి శ్రీమతి జానకమ్మగారు. ప్రతిసంవత్సరం జరుగు తమ ఆచార్యులు అయిన శ్రీమాన్ కందాళవేంకటాచార్యస్వామి వారి తిరునక్షత్రమహోత్సవ సందర్భంగా నొక సంప్రదాయగ్రంథాన్ని ఆస్తికలోకానికి అందించుట విజయనగరం - త్రైవర్ణిక వైష్ణవగోష్ఠివారికి పరిపాటి. ఠ॰ సంవత్సరం సభలకు ఒక ప్రత్యేకత గలదు.

నూతనముగా సకలసౌకర్యములతో రామానుజకూటనిర్మాణము- భగవద్రామానుజుల దివ్యచరితలోని విషయములు- ఉపన్యాస విషయములగుట- మంగళాశాసన దివ్యప్రబన్ధము తెలుగువ్యాఖ్యతో ఆవిష్కరింపబడుట- ఈమూడును- "మంగళాదీని మంగళమధ్యాని మంగళాన్తాని చ కార్యాణి ప్రథన్తే" అన్నట్లు అందరికిని సకలశుభాల్ని ప్రసాదించునట్టివి.

ఆచార్యవరివస్యా (సేవ) రూపంగా తమ పవిత్రద్రవ్యంతో "తిరుప్పల్లాణ్డు"ను ముద్రింపజేసినవారు -ధన్యజన్ములైన ప్రపన్నశ్రీమాన్ నాగులకొండ శింగరయ్య గారు, వారి ధర్మపత్ని శ్రీమతి రాజమ్మగారు (తల్లెమ్మగారు). వీరికి, వీరి కుటుంబానికి సర్వవిధములైన శ్రేయస్సులను అస్మదారాధ్యదైవమైన భగవద్రామా నుజులు ప్రసాదింతురుగాక -యని ఆశించుచున్నాను.

రామానుజార్యదివ్యాజ్ఞా వర్ధతామభివర్ధతామ్

భాగవతవిధేయుడు

**కె. వేంకటాచార్యులు**

Scanned by CamScanner

సువర్ణవల్లభ, పండితరత్న, వాచస్పతి,
ఉ.వే. శ్రీమాన్ డా॥ టి.పి. శ్రీరామచంద్రాచార్యస్వామివారు
ఎడిటర్, భక్తినివేదన (మాసపత్రిక).
మధ్యవీథి, సింహాచలం, విశాఖపట్టణం.

# మంగళాశాసనము

పాండ్యరాజసభలో పరతత్త్వ ప్రతిష్ఠాపనం కావించి విద్యాశుల్కగ్రంథితో పాటు రాజసమ్మానము పొంది ఏనుగంబారీపై సకలరాజలాంఛనములతో శ్రీవిల్లిపుత్తూరు నకు సాగుతున్నారు భట్టనాథమహోదయులు. ఆ సన్నివేశాన్ని సందర్శించటానికి శ్రీమన్నారాయణుడు శ్రీదేవితో శంఖచక్రపాణియై, గరుడవాహనుడై వినువీథి నిలచినాడు. దుర్భావకలుషితమైన ప్రకృతిమండలంలోకి స్వామి వేంచేయడం చూసి ఆయనయందున్న భక్తి వాత్సల్యంగా పర్యవసించి విష్ణుచిత్తులవారు స్వామికి మంగళం పాడనారంభించినారు. చతుర్భుజములకు, శంఖచక్రములకు, అమ్మ వారికి, సకలపరిజనపరిచ్ఛదములకు వేల లక్షల కోట్ల సంవత్సరములు సుఖమగు గాక - అని ఎలుగెత్తి పాడినారు.

ఈ ఆనందానుభవాతిశయంలో వారి మదిలో ఔదార్యం పెల్లుబికింది. అపూర్వమైన, అద్భుతమైన, అమందానందప్రదమైన ఈ సేవాభాగ్యాన్ని చూరగొనండని సృష్టిలోని భక్తకోటికంతటికీ ఆహ్వానాలు పలికేరు. మీరు రండి! మీరు రండి! మీరూ రండి! అని వారందరినీ తమతో కలసి స్వామిని కీర్తింప రమ్మని పిలిచినారు.

భగవంతుని సర్వజ్ఞత్వాదులనెరిగీ, స్వామిసౌందర్యలావణ్యాది గుణాలకు మోహపడి వాత్సల్యం పెల్లుబకగా అస్థానభయశంకతో ఆ సర్వేశ్వరునకు, సకల జగద్రక్షకునకు, సర్వజ్ఞునకు, సర్వశక్తికి మంగళాశాసనం కావించడం అపూర్వమైన సన్నివేశం. ఈ మధురానుభూతిని తామొక్కరు చూరగొని ఊరకొనలేక భక్తకోటి నంతటినీ పాల్గొన నాహ్వానించటంలోని వారి ఔదార్యం, అనుకంపాతిరేకం అద్భుతాలు.

వేదములకు ప్రణవంవలె, దివ్యప్రబంధపటలికి తిలకాయమానంగా పూర్వా చార్యులు ఈ ప్రబంధాన్ని కీర్తించినారు. తిరుప్పల్లాణ్డునుగూర్చి శ్రీవైష్ణవ సంప్రదాయలోకానికి నేను కొత్తగా పరిచయం కావించాల్సిన ఆవశ్యకత లేదు.

Scanned by CamScanner

వ్యాఖ్యాతృ చక్రవర్తి పెరియవాచ్చాన్ పిళ్ళైగారి వ్యాఖ్యానంతోపాటు అరుం బదాది విశేషములతో చాల విపులంగా, ప్రామాణికంగా ఆంధ్రవ్యాఖ్యానాన్ని ఈ తిరుప్పల్లాణ్డు ప్రబంధమునకు సమకూర్చిన వ్యాఖ్యాతృ శిరోమణులు పండితరత్న ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ. ఏ. శింగరాచార్యస్వామివారు అభినందనీయులు. ఆంధ్రవ్యాఖ్యానంతోపాటు మూలమును చేర్చడం చాలాబాగుంది. ఈ వ్యాఖ్యాన ప్రబంధానికి ముఖబంధముగా వారే చారిత్రక సాంప్రదాయిక లాక్షణిక విశేషాలతో పరిపుష్టమైన ముఖబంధమును సంతరించడం ప్రశస్యతరం. పాఠకులకు వ్యాఖ్యానంతోపాటు ఈ ఉపోద్ఘాతము చాలా ఉపకరిస్తుంది. ఈ ఉ.వే. శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యస్వామివారి ఈ సంప్రదాయవరివస్యను మరోమారు మనసారా అభినందిస్తున్నాను.

కీర్తిమూర్తులు ఉ.వే. శ్రీమాన్ డా॥ కందాళ వేంకటాచార్యస్వామివారి తిరునక్షత్ర మహోత్సవ శుభసందర్భంలో శ్రీస్వామివారి శిష్యులైన శ్రీమాన్ నాగుల కొండ సింగరయ్య, శ్రీమతి రాజమ్మ (తల్లెమ్మ) దంపతుల ఆచార్య కైంకర్యముగా ఈ శ్రీకోశము వెలువడుతోంది. ఈ కైంకర్యమును సమర్పించిన ఈ దంపతులను భాగవతగోష్ఠి మంగళాశాసనం కావించాలని కోరుకుంటున్నాను.

తమ తండ్రిగారి తిరునక్షత్రోత్సవమును క్రమం తప్పక అపూర్వమైన రీతిలో నిర్వహిస్తున్నవారు శ్రీమాన్ వేంకటాచార్య స్వామివారి సంతానం - శ్రీమతి చి॥ సౌ॥ జానకి, శ్రీమతి చి॥ సౌ॥ డా॥ హరిప్రియ, శ్రీమాన్ శార్ఙ్గపాణి, శ్రీమాన్ సౌమిత్రిగారలు. ఈ రూపంగా ఆచార్యవరివస్య కావించి కృతార్థులౌతుందుకు వారికి అనేకమంగళాశాసనములు కావిస్తున్నాను.

ఇట్లు, విన్నవించు
భాగవత విధేయుడు
శ్రీరామచంద్రాచార్య

Scanned by CamScanner

శాస్త్రరత్నాకర, పండితరత్న, శాస్త్రవిద్వన్మణి
ఉ.వే. శ్రీమాన్ డా॥ ఎస్.వి.రంగరామానుజాచార్య స్వామివారు
డైరెక్టర్, జీవా, శ్రీరామ్‌నగర్, హైదరాబాద్.

# పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డు

సర్వచేతనసముజ్జీవకమైన ద్రావిడప్రబంధరాశిని నిత్యం అనుసంధించే ప్రపన్నలోకానికి పల్లాణ్డు. ప్రబంధరహస్యాలను విమత్సరంగా లోకానికి అవిశ్రాన్తంగా అందించే ఆచార్యకోటికి పల్లాణ్డు. దివ్యమైన ఈ మహానర్ఘకోశరాశిని నిర్మించిన ఆళ్వారులకు పల్లాణ్డు. దివ్యప్రబంధ ప్రతిపాద్య పరమతత్త్వమైన శ్రియఃపతికి **"పలకోటి నూఱు ఆయిరమ్ పల్లాణ్డు"**. వేల సంవత్సరాలైనా మొక్కవోని నవనవోన్మేషంతో రసఝురులు జాలువారే దివ్యప్రబంధరాశి, సంసారమరుకాంతార నిరంతర బంభ్రమ్యమాణ–బహుశ్రాన్త–కృపణపథిక జనతాజీవాతువు. ఎందరో ఆచార్యులు తాము స్వయంగా ఈ అమృతరస నిష్యందాలను సేవించి పరమసుఖనిర్భరులైనారు.

శ్రియఃపతి నిఖిలహేయప్రత్యనీక కల్యాణగుణగణుడు. ఆయనలోని అన్ని గుణాలు పరమస్పృహణీయాలే అయినా, ఆళ్వారులలో కొందరికి కొన్ని గుణాలు విశేషప్రీతికరాలైనాయి. భట్టనాథులుగా కీర్తింపబడిన విష్ణుచిత్తులకు, స్వామి నిరవధిక సౌందర్యం, లావణ్యం మున్నగు గుణాలు హృదయహారులై వివశులనొనర్చినాయి. గరుడవాహన పండితుడీ రహస్యాన్ని తన దివ్యసూరిచరితంలో ఇలా ఉపశ్లోకించాడు.

**"సర్వజ్ఞ– సర్వావన– సర్వశక్తి భావేషు సత్స్వన్యగుణేషు విష్ణోః ।**
**సౌందర్యలావణ్యముఖాది బాహ్యే సమీక్ష్య సమ్మోహమగాత్స చిత్తే ॥**

**సౌందర్య లావణ్య పురస్సరాణాం సామ్రాజ్యమాశాస్య హరేః స నిత్యమ్ ।**
**తాతౌ గృహీత్వాకరిరాజఘంటే తన్మంగళాశాసన గేయమాహ" ॥**

శ్రీహరికి చెందిన సర్వజ్ఞత్వము, సర్వరక్షకత్వము, సర్వశక్తిత్వము మొదలైన గుణాలున్నప్పటికి, బాహ్యంగా దర్శనకమనీయాలైన సౌందర్యలావణ్యాదిగుణాలను వీక్షించి తన చిత్తంలో వల్లమాలిన మోహాన్ని పొంది, ఆ మోహపారవశ్యంలో రెండు చేతులలో గజఘంటలను పట్టి స్వామికి మంగళాశాసనగీతిని గానం చేశారట భట్టనాథులు.

కృష్ణావతారంపట్ల వీరికి గల ఈడుపాడు వల్లమాలినది. 'కృష్ణతృష్ణాతత్త్వం'గా కీర్తింపబడిన నమ్మాళ్వారులకు వీరు తీసిపోరు. కనుకనే నిత్యానుసంధేయాలు,

Scanned by CamScanner

ఆలయాల్లో స్వామికి జరిగే స్నపనాది పరిచర్యలు జరిపేటప్పుడు, సాభినివేశంగా గానం చేయబడేవి అయిన వీరు అనుగ్రహించిన పాశురాలను **"నీరాట్టమ్" "పూచ్చూడల్" "కాప్పిడల్"** అనే వాటిని శ్రీవైష్ణవలోకం మరచిపోజాలదు.

**"పాణ్డియన్ కొణ్డాడ"** ఇత్యాదిగా శ్రీ పాండ్యభట్టర్ అనుగ్రహించిన తనియన్‌లో చెప్పబడినట్లుగా, పాండ్యరాజసభలో పరతత్త్వనిర్ణయంచేసి, ధననిచయాన్ని పొంది, గజారోహణవైభవంతో నగరవీధులలో సమ్మానింపబడి, ఈ వైభవాన్ని వీక్షించడానికి అమ్మతో గరుడవాహనాధిరూఢుడై విచ్చేసిన స్వామికి మంగళాశాసనం పాడిన ఈ మహనీయులు, ఆచార్యముఖంగా శాస్త్రాన్ని అధికరింపకపోయినా, శ్రీహరికృప చేతనే సమస్తశ్రుతిపురాణాది రహస్యాలను ఎరిగి పాండ్యరాజసభలో తత్త్వప్రతిష్ఠాపనం అప్రతిహతంగా చేసినట్లు శ్రీమన్నాథమునులు కృప చేసిన – **"గురుముఖమనధీత్య ప్రాహ వేదానశేషాన్ "** అనే తనియన్‌వల్ల విశదం అవుతున్నది. స్వామి, శ్రియఃపతి, తన పరత్వాన్ని సభలో ఉద్ఘోషింపుమని ప్రేరించినప్పుడు– స్వామీ! నేను శాస్త్ర గంధమెరుగని సామాన్యజనుడను. ఉద్యానక్రియామాత్రదక్షుడనే తప్ప, శాస్త్రవాద పటువును కానని, వినయంతో నిరాకరించినా, స్వామిచే ప్రతిబద్ధుడై తదనుగ్రహంచేత శాస్త్రవాదం చేసిన వైనాన్ని గరుడవాహన పండితుడు ఈ శ్లోకాల్లో ఆవిష్కరించాడు.

**"తతస్తదా ధన్విపురే మురారిః శ్రీ విష్ణుచిత్తేన వటాగ్ర్యధామా ।**
**ప్రకాశయిష్యన్ పరమార్థజాతం జగద్ధితాయ స్వయమేవ మాహ ॥**

**త్వమద్య గత్వా మధురాం మహీశబద్ధం చ విచ్ఛేదయ తత్ర శుక్లమ్ ।**
**ఖనిత్రముద్రాకిణపాణినా తద్ వేదార్థసాధ్యం కథమాహరేహమ్ ॥**

**ఇతి బ్రువన్తం తమువాచ దేవః వేదార్థసారప్రతిపాదకత్వమ్ ।**
**న త్వద్ధురస్తద్వివృణోమి యావత్ గత్వా త్వమద్యైవ గృహాణ శుల్కమ్ "** ॥

ఈ శ్లోకాల్లోని భావాన్ని ఆముక్తమాల్యదాప్రబంధంలో శ్రీకృష్ణదేవరాయలవారు చాలా మనోజ్ఞంగా తెలుగులో వర్ణించారు. ఈ పద్యాలు ఆంధ్రసారస్వతంలో సహృదయహృదయ నైవేద్యాలై భాసిస్తున్నాయి.

**విష్ణుచిత్తుడు** స్వామితో అంటున్నాడు.

స్వామీ! నన్ను నితః **పురాపఠిత శాస్త్రగ్రంథజాత్యంధు, నారామక్ష్మాఖనన క్రియా ఖరఖనిత్రగ్రాహితోద్యత్కిణస్తోమాస్నిగ్ధకరున్, భవద్భవనదాసున్ వాదిగాఁ బంపుచో భూమీభృత్సభ నోటమైన నయశంబుల్ నీకు రాకుండనే!**

స్వామీ! ఇతః పూర్వం శాస్త్రాధ్యయనము లేమిచే జ్ఞానాంధుడనైన నేను, ఉద్యానక్రియలో త్రవ్వుగోలతో భూమిని నిరంతరం త్రవ్వుటచే కల్గిన ఘర్షణవల్ల కరకుదేలిన కరతలాలు కలవాడను. కేవలం నీ ఆలయకైంకర్యపరుడను. ఇట్టి విజ్ఞానహీనుని శాస్త్రవాదానికి నీవు పంపితే, సభలో ఓటమి కలిగిన నీకపకీర్తి కలుగదా?

**గృహసమ్మార్జనమో, జలాహరణమో, శృంగారపల్యంకికావహనంబో,**
**వనమాలికాహరణమో, వాల్లభ్యలభ్యధ్వజగ్రహణంబో, వ్యజనాతపత్త్రధృతియో,**
**ప్రాగ్దీపికారోపమో, నృహరీ! వాదములేల, లేరె యితరుల్ నీలీలకుం పాత్రముల్.**

"స్వామీ! నీ ఆలయాన్ని శుభ్రంగా తుడవడమో, తీర్థకైంకర్యము చేయుటయో, నీవు విలాసంగా వేంచేసి ఊరేగే పల్లకిని మోయడమో, వనపుష్పమాలికలను సమకూర్చడమో, ప్రీతితో లభించిన నీ ధ్వజాన్ని మోయడమో, వింజామర వీచడమో, గొడుగు పట్టడమో, తొలిసంజవేళ దీపారోపణము చేయుటమో – ఇలాంటి ఏ కైంకర్యమైనా నీ దాసునికి పరమభోగ్యమే కాని, నాకీ శాస్త్రవాదాలేల ? నీ పరిహాసలీలకు బాలిశుడైన ఈ దాసుడు తప్ప ఇంకెవ్వరు దొరకలేదా?" అని పరిపరివిధాల వాపోయారు భట్టనాథులు. అయినా, స్వామి, విడచిపెట్టలేదు.

**"నీ యిష్టమా ? మరుమాటాడక పోవోయి. నీకు బాధ కలిగిస్తానా ? రాజసభలో నీకేమి ప్రతిబంధ ముండదు. నేనున్నాను "** అని ప్రోత్సహించి పంపించినాడు. ఇలా స్వామి ప్రేరణచే, పాండ్యరాజసభకు విచ్చేసిన భట్టనాథులు, 'పాండ్యుడు కీర్తిస్తుంటే, భట్టరు శ్రేష్ఠులు విచ్చేశారని సభ మారుమ్రోగేలా ఉచ్చైర్ఘోషణం చేస్తూ తెల్లని శంఖాన్నెత్తి బిగ్గరగా పూరించి ఊదగా, వేదశాస్త్ర ప్రమాణాలను అప్రతిహత తీక్ష్ణశరాలుగా పరులపై ప్రయోగించి, నిర్వీర్యులను చేసి పరతత్త్వ ప్రతిష్ఠాపనం చేసిన భట్టర శ్రేష్ఠులు సర్వథా వందనీయులని" కీర్తింపబడ్డారు. ఈ మహనీయులు స్వామిని భావనాప్రకర్షచే దర్శించి పాడిన మంగళాశాసన పాశురాలు **"తిరుప్పల్లాణ్డు"** గా ప్రసిద్ధిచెంది వేదాలకు ప్రణవం లా సర్వదివ్యప్రబంధరాశికి తొలిపలుకై విరాజిల్లుతున్నది.

**ఈ మంగళాశాసన ప్రక్రియ వేదపురాణేతిహాస ప్రసిద్ధమే.**

**"పశ్యేమ శరదశ్శతమ్,.......శ్రుణువామ శరదశ్శతమ్"** ఇత్యాది శ్రుతివచనాలు ఈశైలికి ఒరవడి. పెద్దలు పిన్నలకు, మంగళాశాసనం చేయడం పరిపాటియే అయినా, పిన్నలు పెద్దలకు చేయడం అపూర్వం. భట్టరులు సాక్షాత్తు స్వామికి చేసిన ఈ మంగళాశాసనం పరమాపూర్వమని శ్రీ వైష్ణవాచార్యానుభవం.

Scanned by CamScanner

నిత్యానుసంధేయమైన ఈ ప్రబంధంతో పాటు భట్టనాథులు పెరియాళ్వార్ తిరుమొళిని అనుగ్రహించారు. ఇది పెరియాళ్వారులచే అనుగ్రహింపబడింది కనుక "పెరియాళ్వార్ తిరుమొళి" అని ప్రసిద్ధిచెందింది. వీరి పుత్రిక అయిన "ఆండాళ్లు"ను పరిణయమాడి రంగనాథుడు అల్లుడు కావడం వీరికే లభించిన వరం. ఆమెకు తండ్రిగా వీరు, వీరికి పుత్రికగా ఆమె 'మణినా వలయః' అన్నట్లు అన్యోన్య విశ్రాన్త యశస్కులైనారు. వీరి తిరుప్పల్లాండు ప్రబంధానికి వ్యాఖ్యాతృచక్రవర్తియైన పెరియవాచ్చాంబిళ్లై అనుగ్రహించిన వ్యాఖ్యానాన్ని తమ మూలవిధేయమైన ఆంధ్రానువాదంతో పాటు పాశురార్థాలను లెస్సగా అనుగ్రహించిన వారు "పండితరత్న" "ఉభయవేదాన్త వాచస్పతి"ఉ.వే శ్రీమాన్ ఈయుణ్ణి సింగరాచార్యస్వామివారు. వారి యీ కృషిని అప్రతిహతంగా ప్రోత్సహిస్తూ, జిజ్ఞాసులోకార్తిని తీరస్తున్న ప్రకాశకులైన శ్రీమాన్ నాగులకొండ వెంకటసింగరయ్య, శ్రీమతి రాజమ్మ దంపతులకు, వీరికి ప్రోత్సాహకులై తమ తండ్రిగారైన ఉవే.శ్రీమాన్ డా॥కందాళ వేంకటాచార్యస్వామివారి తిరునక్షత్ర పర్వాన్ని పరమస్పృహణీయంగా చేస్తున్న శ్రీమతి జానకి, చి॥సౌమిత్రి, చి॥ పాణి , శ్రీమతి హరిప్రియలు, వారి తల్లిగారు ఉ.వే. శ్రీమాన్ శ్రీకందాళస్వామి వారి ధర్మపత్ని శ్రీమతి చిత్రనీల గార్లు సర్వథా అభినందనీయులు.

భాగవత విధేయుడు

**సముద్రాల వేంకట రంగరామానుజాచార్యులు**

Scanned by CamScanner

శ్రీమతే రామానుజాయ నమః

# ఆణిముత్యం మా ఆచార్యులు

పరమాత్మ నిరాశ చెందని కృషీవలుడు అని అంటారు. రైతు ఎండిపోయిన నేలను పదును పరచి, దున్ని, విత్తనాలు వేసి పంట పండించినట్లు, రెండవ క్లాసు, మూడవ క్లాసు చదువుకున్న మాపెద్దవారి, కొంచెం చదువుకున్న మాలాంటి వారికి కూడా మా ఆచార్యులు ఉ.వే. శ్రీమాన్ డా॥ కందాళ వేంకటాచార్య స్వామివారు ఎంతో కఠినమైన విషయాలను తమ కాలక్షేపం ద్వారా సులువుగా అందించేరు. మాచేత పెద్దల దగ్గర దివ్యప్రబంధంలోని పాశురాలను, వాటి అర్థాలను, వ్యాఖ్యా నంతో చెప్పించి వారి మన్నన పొందేటట్లు చేసేరు. మాకు సమాశ్రయణం చేసన ఉపకారక ఆచార్యులు ఉ.వే. శ్రీమాన్ పురిహేళ్ళ వేంకట నరసింహాచార్య స్వామివారు రాజమండ్రి వాస్తవ్యులు. శ్రీమాన్ వేంకటాచార్యస్వామివారు ఉత్తారకా చార్యులు. మా అందరిని తీర్చిదిద్దినవారు.

మా వేంకటచార్య స్వామివారితో మాకు సుమారు నలభై (40) సంవత్సరాల పరిచయం ఉంది. వీరు టెక్కలి (శ్రీకాకుళం జిల్లా)లో ఉద్యోగం చేస్తూ ఉండేవారు. విజయనగరంలోని మహారాజాకాలేజీకి ఉద్యోగరీత్యా వారు వచ్చేరు. అప్పుడు ఉ.వే. శ్రీమాన్ గోపాలాచార్యస్వామివారు (మా ఆచార్యులకి ఆచార్యులు) రామానుజ కూటంలో కాలక్షేపం చెప్పమని వీరిని ఆజ్ఞాపించేరు. ఉచితంగా చెప్పమని, ప్రతిఫలం ఆశించవద్దని కూడా నియమించేరు. వారి ఆజ్ఞను శిరసా వహించి ఎన్నో గ్రంథాలను కాలక్షేపంగా మాకు అనుగ్రహించేరు. భగవద్రామానుజ చరిత్ర, ప్రపన్నామృతం, ఆళ్వార్ల చరిత్రలు, వేంకటేశ్వర సుప్రభాతం, తిరుప్పల్లాండు, తిరుప్పళ్ళి యెళుచ్చి, తిరుప్పావై, తిరువాయ్‌మొళి, ఇరామానుశనూత్తందాది, ఆచార్యహృదయము, తిరుమంత్రార్థము, శ్రీవచనభూషణము - ఇలా ఎన్నో గ్రంథాలను మాకు సులువుగా అర్థమయ్యేటట్లు సాయించేరు. మాచేత తిరిగి చెప్పించేవారు. ఎన్నో స్తోత్రములను కూడా మాకు చెప్పేరు. భగవద్విషయ కోశాలను తెప్పించి ఇంచుమించు 10 సంవత్సరాలు కాలక్షేపం చెప్పి, గోపాలాచార్య స్వామివారు వేంచేసి ఉన్న చోటికి మమ్మలను తీసుకొని వెళ్ళి ప్రతిపదికి శాత్తుముఱై జరిపించేవారు. గోష్ఠివారమంతా రెండు బస్సులలో పరమాచార్యుల సన్నిధికి నడిగడ్డపాలెం వెళ్ళేవారము.

Scanned by CamScanner

గోపాలాచార్యస్వామివారు భగవద్విషయకోశాలను మళ్ళీ ముద్రింపజేయాలని సంకల్పించేరు. ఆ మంచిపనికి ద్రవ్యకైంకర్యమును చేయమని మమ్మలను ప్రోత్సహించి మాచేత చేయించి వారి ఆచార్యులకు ఆనందము కలిగించేరు. మేము ధన్యులమయినాము.

మా స్వామి వారికి షష్టిపూర్తి మహోత్సవము జరిగింది. మా అందరికి తదీయారాధన ఏర్పాట్లు చేయడమేకాకుండా కాలక్షేప గోష్ఠిలో అన్వయించిన వారికందరికీ ఒక తులం వెండి కాసులు ఇచ్చేరు. శిష్యులు ఆచార్యులకు సంభావనను సమర్పించాలి. కాని శిష్యులకు కానుకలనిచ్చి ఆదరించిన ఘనత మా ఆచార్యులది. ఇటువంటి ఔదార్యం మాఆచార్యులలోనే చూసేము. తను విద్యను, శక్తిని, సంపదను కూడా మాకు అందించన మహనీయులు మా వేంకటాచార్య స్వామివారు. నిజంగా ఆణి ముత్యమే మా ఆచార్యులు. నిస్వార్థంగా శిష్యుల శ్రేయస్సును కోరిన నిర్మల హృదయాలు. మా స్వామివారి ధర్మపత్ని చిత్రనీళగారు. వారిని అమ్మగారని అంటాము. ఓరిమికి మారుపేరు మా అమ్మగారు. ప్రేమకు ప్రతిరూపము. మా స్వామికి, వారి పెరుమాళ్ళకు, అత్తగారికి అనుకూలంగా సేవలు చేస్తూ శిష్యులమైన మా అందరినీ ఆదరించేవారు. ధనుర్మాసంలో ప్రతిరోజు వందమందికి తక్కువ కాకుండా వారి గృహానికి వెళ్ళి సేవాకాలగోష్ఠిలో పాల్గొన్నా అందరికీ ప్రసాదాలు తయారుచేసి ఒక్కచేతిమీద వడ్డన చేస్తూ ఆప్యాయంగా మాట్లాడేవారు. స్వామితో పాటుగా నిత్యం కాలక్షేపగోష్ఠికి వేంచేసి అన్వయించేవారు. ఈనాటికీ అదే ప్రేమ, ఓర్పు, ఆత్మీయత, ఆదరణ ఆమెలో మేము చూస్తున్నాము.

మా స్వామివారితో, అమ్మగారితో కలిసి మేము ఎన్నో దివ్యదేశయాత్రలు చేసేము. ఉత్తరాదిలో బదరీవరకు, దక్షిణాదిన కన్యాకుమారివరకు సేవించే సదవకాశం కలిగింది. యాత్రలకు వెళ్ళినప్పుడు పెరుమాళ్ళను సేవిస్తూ తన్మయులై పోయే వారు మా స్వామి. ఆనందబాష్పాలు కారుస్తూ అంజలి కావిస్తూ ఉండిపోయే వారు. ఆళవందారు స్తోత్రంలోని శ్లోకాలు అనుసంధానం చేస్తూ వెక్కి వెక్కి ఏడ్చేదారు. కులశేఖరులు 'బద్ధేనాంజలినా'.... అనే శ్లోకంలో చెప్పిన రీతి మాస్వామి వద్ద మాకు ప్రత్యక్షంగా కనిపించేది. దివ్యదేశయాత్రలలో పెరుమాళ్ళని సేవిస్తున్న మా స్వామిని సేవించడము గొప్ప భాగ్యము "ఆహ్లాదశీతనేత్రాంబుః పులకీకృత గాత్రవాన్. సదా పరగుణావిష్టః ద్రష్టవ్యః....." అని పెద్దలు చెప్పాతు. ఆ భాగ్యం మాకు దక్కిందని మేము ఆనందిస్తాము.

Scanned by CamScanner

మా స్వామివారి భగవదనుభవమేకాదు గ్రంథకాలక్షేపము కూడా విలక్షణమైనదే. "షూళ్ విశుంబు..." పాశురాలు చెప్పేటప్పుడు అర్చిరాది మార్గం కళ్ళకు కట్టినట్లుండేది. తిరుప్పావై కాలక్షేపము వింటాడంటే వ్రేపల్లెలో ఉండి అనుభవిస్తున్నట్లుండేది. శ్రీరామాయణము, శ్రీమద్భాగవతము వారిదగ్గర వింటూ మేము పొందిన అనుభూతి మాటలకు అందనిది. పోతనగారి పద్యాలు చెప్తూ ఉంటే వామనచరిత్ర, క్షీరసాగరమథనం కనుల ఎదుట కనిపించేవి. గంభీరమైన వారి కంఠం వీనుల విందుగా వినిపించేది. దివ్యమైన వారి రూపం మనస్సులో నిలిచిపోయేది. ఈ అనుభవం మాకు ఎప్పటికీ అతృప్తామృతమే.

మా త్రైవర్ణికశ్రీవైష్ణవకులానికి ఇటువంటి ఆచార్యులు లభించడము ఒక వరం. ఆచార్యసేవ ఎలాచేయాలో గోపాలాచార్య స్వామివారికి చేసి మాకు మార్గదర్శకులయినారు మా ఆచార్యులు. పూర్వము మాకులంలో పెద్దలే తిరుమణి, శ్రీచూర్ణాలు ధరించేవారు. పిల్లలు శ్రీచూర్ణం మాత్రమే ధరించేవారు. మా ఆచార్యులు వారందరిచేత స్వరూపాన్ని ధరించేటట్లు చేసేరు. వారి ఆజ్ఞను అందరూ శిరసావహించేరు. స్వామి రిక్షాలో వారి గృహమునుండి రామానుజకూటానికి వస్తూ దారిలో మా షాపులవైపు చూసే సరికి మావాళ్ళు తిరుమణిక్కోప్పు ధరించి నవ్వుతూ నమస్కరిస్తే, అది చూసి పొంగిపోయేవారు. "రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతామ్ అభివర్ధతామ్" అని ఆనందించేవారు. కాలక్షేపసమయంలో పరత్వము, తరువాత వాత్సల్యంతో మాకులం యోగక్షేమాలను వహించేవారు.

మూడు తరాలనుండి రామానుజకూటానికి, మా కులానికి, స్వామి కుటుంబానికి అనుబంధం ఉంది. మాస్వామివారి చిన్నతనంలో వారి తండ్రిగారు స్థానాచార్యులుగా కైంకర్యం చేసేవారు. మాస్వామివారి చిన్నతనం, విద్యాభ్యాసము ఇక్కడే జరిగేయి. తరువాత ఉద్యోగరీత్యా స్వామి వేంచేసి మాకులంవారికి రెండు తరాలవారికి సంప్రదాయ గ్రంథ కాలక్షేపం సాయించి మూడవ తరానికి ప్రారంభించి పరమపదించేరు. ఈనాడు వారి కుమార్తె శ్రీమతి జానకమ్మగారు నాన్నగారి ఆజ్ఞను అనుసరించి, పెద్దలను అనువర్తించి, పండితసభలు, ఆచార్యపరివస్యవంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రంథ కాలక్షేపాన్ని కొనసాగిస్తూ మమ్మలను నడిపిస్తున్నారు. మా ఆచార్యస్వామివారి కుటుంబము, మాకులము అందరం కలసి ఎప్పటికీ రామానుజులవారి కైంకర్యం పల్లాండుగా పల్లాండుగా చేసుకుంటూ ఉండాలని పెరుమాళ్ళను పెద్దలను ప్రార్థిస్తున్నాము.

Scanned by CamScanner

ఈ సంవత్సరం 'ఆచార్య పరివస్య' మేము చేసుకోగలిగే అవకాశం కలిగింది. రెండు సంవత్సరములుగా అనుకుంటున్నా కార్యరూపంలోకి రాలేదు. ఈ సంవత్సరం రామానుజకూటం నూతన నిర్మాణం పూర్తవడము, మా ఇంట్లో మాకు మరొక తరంగా ముని మనవడు కలగడము. రెండవ మనుమని భార్యకూడ గర్భవతిగా ఉండటము- ఇవన్నీ చూస్తూ ఉంటే తరతరాలకు ఇటువంటి కైంకర్య భాగ్యం మాకు కలుగుతుందని సంతోషంగా ఉంది. మా కుటుంబములో పెద్దలు భాగవత కైంకర్య పరులు. 1954వ సంవత్సరంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారు పాదయాత్ర చేస్తూ విజయనగరం వేంచేసేరు. అప్పుడు మా మామగారు వారిని మా గృహానికి ఆహ్వానించి తీసుకొని వచ్చేరు. వారి శ్రీపాదములు తాకి పవిత్రమయిన స్థలము మా గృహము. తరువాత పండితసభలకు ఉ.వే. శ్రీమాన్ తె.కం. గోపాలాచార్య స్వామివారు, భాగవతోత్తములు ఈ దాసుల గృహానికి వేంచేసి విడిది చేసేవారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయరు స్వామివారు కూడా వేంచేసి మంగళా శాసనములు చేసేరు.

అంతేగాక మరొక అదృష్టము ఈ మధ్యకాలంలో మాకు కలిగింది. మా రామానుజ కూటమునందు భగవద్రామానుజులు ప్రతిష్ఠింపబడి సుమారుగా 80 సం॥లు పైనే అయినది. కోవిలలో ఎన్ని మార్పులు జరిగినా పెరుమాళ్ళు రామానుజులు అదేస్థానంలో వేంచేసి ఉన్నారు. మా ఆచార్యుల ఆజ్ఞతో ప్రస్తుతము రామానుజకూటం అధ్యక్షులుగా ఉన్న కృష్ణాజీగారు రామానుజకూట పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టేరు. గోష్ఠివారంతా చాల సహకరించేరు. రామానుజ కూటాన్ని విశాలంగా చేయాలని, పెద్దలువేంచేసినా, వివాహాది శుభకార్యాలు జరిగినా సౌకర్యంగా ఉండేటట్లు కట్టించమని ఆచార్యుల సూచన. ఇప్పుడు ఆ సమయం వచ్చి కట్టించేటప్పుడు రామానుజులవారిని తాత్కాలికంగా మరొకచోట వేంచేపు చేయవలసి వచ్చినది. స్వామి రామానుజుల సంకల్పంగా ఒక గంట సమయంలో అందరి మనస్సుల్లో ఒకే ఆలోచన కలిగింది. ప్రక్కనే ఉన్న మా గృహానికి పెరుమాళ్ళు వేంచేసేరు. ఎంబెరుమానార్లు. ఆళ్వార్లు, పెరుమాళ్ళు అందరూ వేంచేసి 80 రోజులు నిత్య ఆరాధనాది కైంకర్యములను స్వీకరించేరు. 17-9-2011వ వేంచేసి 5-12-2011న మరల రామానుజ కూటము చేరినారు. స్వామి మా ఇంట వేంచేసిన సమయంలోనే శరన్నవరాత్రులు, దసరాపూజలు, లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు జరిగేయి. సుమారు 40 సం॥ల నుండి క్రమం తప్పకుండా జరిగే దసరా పూజలు మాగృహంలో ఉండి అమ్మ స్వీకరించడం మాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

Scanned by CamScanner

మాస్థానాచార్యస్వామివారుకూడా మాగృహంలోనే కాపురముండి వైభవంగా కార్యక్రమాలను నిర్వహించేరు. పెద్దలు. పెరుమాళ్ళు, రామానుజులు, ఆచార్యులు అభిమానించి విచ్చేసిన స్థలమని, అది మా అదృష్టమని మా కుటుంబ సభ్యులం అందరము కృతజ్ఞతతో దాసోహములు సమర్పిస్తున్నాము. మా జన్మలకు మరపురాని భాగ్యం ఇది. పెద్దల ఆశీస్సులు పొందాలని ఈ విషయాన్ని విన్నపం చేసుకొంటున్నాము. అతిశయంతో కాదు. భాగవతాభిమానమే మాకు బలము.

మా ప్రార్థనను మన్నించి 'ఆచార్యవరివస్య' సందర్భముగ 'తిరుప్పల్లాండు' గ్రంథావిష్కరణమునకు సహృదయంతో తమ పరిపూర్ణ సహకారము అందించిన పెద్దలు ఉ.వే. శ్రీమాన్ ఈ.ఏ. శింగరాచార్య స్వామివారికి కృతజ్ఞతా పూర్వకముగ దాసోహములు సమర్పిస్తున్నాము. ప్రతిసంవత్సరము గ్రంథ ప్రకాశమునకు వారు అందిస్తున్న సహకారము మరువలేనిది. తమ అమూల్యమైన అభిప్రాయముతో పాటుగా మాకు మంగళాశాసనములను అనుగ్రహించిన ఉ.వే. శ్రీమాన్ కిడాంబి వేంకటాచార్య స్వామివారికి, ఉ.వే. శ్రీమాన్ టి.పి. శ్రీరామచంద్రాచార్య స్వామివారికి, ఉ.వే. శ్రీమాన్ ఎస్.వి. రంగరామానుజాచార్య స్వామివారికి దాసోహములు సమర్పించుకుంటున్నాము. ఈ అవకాశమును మాకు అందించిన మా ఆచార్య కుటుంబానికి, ప్రత్యేకముగ ఆచార్య పుత్రిక శ్రీమతి జానకమ్మ గారికి మా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము. విలక్షణమైన పద్ధతిలో రామానుజుల కైంకర్యాన్ని చేస్తున్న స్థానాచార్యస్వామివారికి దాసోహములు. ఆచార్యుల మన్ననకు పాత్రులై సమర్థంగా రామానుజ కూటకార్య భారాన్ని వహిస్తున్న అధ్యక్షులు శ్రీమాన్ దాసరి సుబ్బారావు (కృష్ణాజీ) గారిని, సహకరిస్తున్న కార్యనిర్వాహకవర్గం వారిని, మహిళామండలివారిని మనసారా అభినందిస్తున్నాము. సదా భగవద్భాగవత ఆచార్య అభిమాన పాత్రులమయేటట్లు మంగళాశాసనం చేయమని పెద్దలందరిని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు

భాగవత విధేయులు

నాగులకొండ వెంకట శింగరయ్య,

రాజమ్మ దంపతులు

విజయనగరం

తేది. 03-07-2012

Scanned by CamScanner

# పురోవాక్

శ్రీవైష్ణవసంప్రదాయంలో భాగవతాగ్రేసరులుగా ప్రశంసింపబడుతున్న ఆళ్వార్లు పదిమంది. వారు- పొయ్‌కై ఆళ్వార్లు, పూదత్తాళ్వార్లు, పేయాళ్వార్లు, తిరుమళిశైప్పిరాన్, నమ్మాళ్వార్లు, కులశేఖర ప్పెరుమాళ్, పట్టర్ పిరాన్, (పెరియాళ్వార్లు) తొణ్డరడిప్పొడికళ్, తిరుప్పాణ్ పెరుమాళ్, కలియన్- అనేవారు. నమ్మాళ్వార్ల శిష్యులైన మధురకవులను, పట్టర్ పిరాన్ అనే ప్రసిద్ధిని పొందిన పెరియాళ్వార్ల పుత్రిక అయిన శూడిక్కొడుత్త నాచ్చియార్‌ను వీరితో చేర్చి ఆళ్వార్లు పన్నెండుమంది అనే వ్యవహారంకూడా ఉన్నది.

లోకంలోని బాహ్యాంధకారాన్ని పోగొట్టే ద్వాదశాదిత్యులకంటే గొప్పవారై, ఆంతరతమస్సును పోగొట్టే దివ్యసూరులైన ఈ ఆళ్వార్ల చరిత్రల వైభవానికి అవధి లేదు. అది, సంస్కృతభాషలో బ్రహ్మాండం, పాద్మం, మార్కండేయం మొదలైన పురాణాలలోను, భార్గవం,వృద్ధపాద్మం మొదలైన ఉపపురాణాలలోను, భవిష్యత్కాలిక వృత్తాంతాలను తెలిపే సందర్భంలో ప్రస్తావింపబడింది. ఇంతేకాక, దివ్యసూరిచరితం, ప్రపన్నామృతం- అనే సంస్కృత గ్రంథాలలోను, గురుపరంపరా ప్రభావం- అనే మణిప్రవాళగ్రంథంలో కూడా తెలుపబడింది. వీటిలో తెలుపబడని, ఇతర గ్రంథాలద్వారా, కర్ణపరంపరద్వారా తెలియదగిన ఐతిహ్యాలు కూడా చాలా ఉన్నాయి.

"నలమన్దమిల్లైదోర్ నాడు" అని కీర్తింపబడే శ్రీవైకుంఠనగరంలోని హిరణ్మయ మైన కోవెలలో తిరుమామణిమంటపంలో "ఒళివిల్ కాలమెల్లా ముడనాయ్ మన్ని వళువిలా అడిమై" (విచ్ఛేదం లేని కాలం అంతా స్థిరంగా ఉండి నిత్యకైంకర్యాన్ని) చేసే ఆదిశేషుని స్వరూపమైన శిరియశిఙ్గాశనమ్‌లో శ్రీభూనీళాదేవులనే దివ్య దేవేరులు ముగ్గురితో కూడి వేంచేసి ఉండి, నిత్యులకు, ముక్తులకు అంతు లేని ఆనందాన్ని అనుభవింపజేసే సకలకల్యాణ గుణపూర్ణుడైన సర్వేశ్వరుడు, ఆ విభూతిలో ఉండేవారితోపాటుగా, ఈ లీలావిభూతిలో ఉన్నవారుకూడా ఆ గొప్ప స్థానాన్ని పొంది, ఆనందాన్ని పొంది ఉజ్జీవించదగి ఉన్నా, ఆవిధంగా ఆనందాన్ని పొందకుండా, అందుకోసం తాను వారికి అనుగ్రహించిన కరణకళేబరాలను వారు శబ్దాదివిషయాంతరాలలో ప్రవర్తింపజేసి, మన్మథునకు వశులై, విషయసుఖాలకు లోనై, మాటి మాటి పలు జన్మలను ఎత్తి, మరణించి, తీరంలేని కర్మలనే మహా

సముద్రంలో మునిగి క్లేశపడడాన్ని గమనించి చూచాడు. నిరుపాధిక పిత అయిన అతడు ఆ ఆత్మలనుకూడా వినాశం లేని ఆ పరమపదానికి తీసికొనిపోవాలని తలచి, తన నిర్హేతుకదివ్యకృపతో ఆ ఆత్మలు సన్మార్గ- కుమార్గాలను చక్కగా వివేకించి తెలిసికొని ప్రవర్తించే రీతిని వారికి తెలుపడం కోసంగా తన ఆజ్ఞారూపమైన వేదాలను వ్యక్తం చేసి, అరుదైన ఆ గొప్ప వేదాలలోని గంభీరాలైన అర్థాలను పరిమితమైన ఆయుస్సును, శక్తిని కల మనవంటివారు గ్రహించడానికి వీలుగా వాటికి అంగాలైన అనేకశాస్త్రాలను మహర్షులద్వారా ప్రవర్తింపచేశాడు.

కటికచీకటిలో కొట్టుమిట్టాడేవారికి పదార్థవివేకం కల్గడంకోసం చేతిదీపాన్ని ఇచ్చినట్లుగా, అనాది అయిన అజ్ఞానాంధకారంలో చిక్కుకొని బాధపడేవారికి అర్థజ్ఞానప్రకాశం కల్గడంకోసం ఆ విధంగా శాస్త్రదీపాన్ని భగవానుడు అనుగ్రహించినా, కన్నులు లేనివారికి దీపంవల్ల ఉపయోగం కలుగనట్లుగా, భగవద్భక్తి అనే సిద్ధాంజనంతో మనస్సు - అనే ఆంతరనేత్రంయొక్క గుడ్డితనం తీరని లోకులకు పలువురికి ఆ ప్రమాణప్రదీపం పూర్తిగా నిరుపయోగమే అయినది. వారు, శాస్త్రాల సిద్ధాంతాన్ని పూర్తిగా లోతుగా విమర్శించి తెలిసికోలేక, పైపైననే గమనించి, అస్థిరాలైన ఫలాలను స్థిరమైనవి అని, స్థిరమైన ఫలాన్ని అనిత్యమని విపరీతంగా భావించి, అర్థకామాలలో అభిముఖులై, మోక్షంపట్ల విముఖులై నశించిపోయారు. ఆ విషయాన్ని గమనించి, కరుణాసముద్రుడైన భగవానుడు, తన ఆజ్ఞ చెల్లుబాటు కాని చోట్ల ప్రభువే స్వయంగా పోయి ఆజ్ఞాదండాన్ని నడిపించే రీతిలోను, బావిలో పడిన బిడ్డను పైకి తీసికొని రావడంకోసం తల్లి స్వయంగా ఆ బావిలోకి దూకే రీతిలోను, తానే ఈ లోకంలోకి రామకృష్ణాదిరూపాలలో **"ఆదియమ్ శోదియురువై అఙ్గు వైత్తిఙ్గు ప్పిఱన్దు"** అనేటట్లు తన పరత్వాన్ని ఇతరులకు తెలియకుండా మఱుగుపరచుకొని, సౌలభ్యాన్నే ప్రధానగుణంగా చేసికొని, లోకసహజమైన రీతిలో వ్యవహరించి, దుష్టశిక్షణ- శిష్టరక్షణలను చేసి, ధర్మాన్ని సుస్థాపించి, తన రూపసౌందర్యంతో, ఉపదేశాలద్వారా, అనుష్ఠానం ద్వారా తన వశం చేసికోవాలని ప్రయత్నించాడు. కాని పలువురు జీవులు అనాది దుష్కర్మ వశంచేత, ఆ భగదవతారాలపట్ల మానవభావనను కల్గినవారై, అవమానించి, **"కేట్పార్ శెవి శుడు కీళ్మై వశవుకళే"** (వినేవారి చెవులను కాల్చే నీచమైన నిందలను) పల్కి అధమగతికి లోనయ్యారు.

దీనిని అంతటిని గమనించిన భగవానుడు లోకులపట్ల చాలా జాలిపడి, "ఇక వీరిని వశీకరించుకొనే దారి ఏది?"అని లక్ష్మీదేవితో దీర్ఘంగా ఆలోచించి,

Scanned by CamScanner

సజాతీయమృగాన్ని చూపి ఆ జాతి మృగాలను వశీకరించుకొనేటట్లుగా, జీవవర్గానికి చెందినవారైన శ్రీభూమీనీళాదేవేరులను, పంచాయుధాలను, శ్రీవత్సకౌస్తుభ వనమాలాదిచిహ్నాలను, అనంతగరుడ విష్వక్సేనాదులను చూచి, "మీరు తగిన రీతిలో భూమిలో పలు జాతులలో జన్మించి, జీవులను జన్మసముద్రంనుండి ఉద్ధరించండి" అని ఆజ్ఞాపించి పంపాడు. వారుకూడా ఆ కార్యాన్ని శిరసా వహించి ఆళ్వార్లు మొదలైనవారిరూపంలో భూమిలో అవతరించారు.

వీరు భగవానుని సకలకల్యాణగుణాలనే అమృతప్రవాహంలో చాలా అభినివేశాన్ని పొంది పూర్ణంగా అవగాహించేవారు కనుక, వీరిని "ఆళ్వార్" అనే పేరుతో వ్యవహరించడం సంప్రదాయం. (ఆళ్గ్తల్ - అవగాహించడం)

వీరు, మహర్షులవలె తామే స్వయంగా స్వప్రయత్నంతో తత్త్వజ్ఞానాన్ని పొందినవారు కాకుండా, భగవానుడే స్వయంగా వచ్చి తనను సాక్షాత్కరింపజేయగా దర్శించి, జ్ఞానశక్తివైరాగ్యాలను సులభంగా పొందారు. కొందఱికి అధ్యయనం చేసి తెలిసికొనే అవకాశం లేని వేదాలవలె కాకుండా, అందఱు గ్రహించే రీతిలో సకల వేదవేదాంతరహస్యార్థాలను ద్రావిడదివ్యప్రబంధాలుగా అనుగ్రహించి, తమ అనుభవాన్ని ఇతరులకు తెలిపి, లోకాన్ని ఉద్ధరించినందువల్ల వాచామగోచరమైన వైభవాన్ని కలవారు, ఆళ్వార్లు.

శ్రియఃపతియొక్క వేఱొక దశావతారాలుగా చెప్పదగిన మహిమను కల ఈ ఆళ్వార్ల అవతారాలు "పొయ్‌కైయార్ పూదత్తార్ పేయార్ పుకళ్ మళిశై అయ్యనరుళ్ మాఱన్ శేరలర్‌కోన్ తుయ్యపట్ట నాదన్ అన్బర్ తాళ్‌తూళి నల్పాణన్ నన్‌కలియన్ ఈదివర్ తోఱ్ఱత్తు అడైవామిఙ్గు" అనే క్రమాన్ని కల్గి ఉన్నాయి.

వీరిలో, నమ్మాళ్వార్లు, మిగిలిన ఆళ్వార్లవలె ఈ లోకంలోని సామాన్యులవలె జీవితాన్ని కొంతకాలం సాగించిన తరువాత ఒకానొక సమయంలో భగవానుని అనుగ్రహంవల్ల తత్త్వజ్ఞానాన్ని పొందినవారు కాకుండా, తులసి పుట్టిన క్షణంనుండి పరిమళించేటట్లు, అవతరించిన క్షణంనుండి సహజమైన జ్ఞానభక్తులను కలవారై, ఆస్థితి ఏనాటికీ మాఱనివారై ఉన్నందున, ఆళ్వార్లలో ప్రధానులుగా చెప్పబడ్డారు. ఈ కారణంవల్ల వారు అవయవి అని, మిగిలిన ఆళ్వార్లు వారికి అంగభూతులు అని పూర్వులు నిరూపించారు.

ఈ విధమైన రూపణం చేసే క్రమంలో- అంగి అయిన నమ్మాళ్వార్లకు పూదత్తాళ్వార్లను శిరస్సుగా, పొయ్‌కై ఆళ్వార్లు, పేయాళ్వార్లను నేత్రాలుగా,

Scanned by CamScanner

పెరియాళ్వార్లను ముఖంగా, తిరుమళిశై ఆళ్వార్లను కంఠంగా, కులశేఖరాళ్వార్లను, తిరుప్పాణ్ ఆళ్వార్లను హస్తాలుగా, తొణ్డరడిప్పొడి ఆళ్వార్లను వక్షఃస్థలంగా, తిరుమఙ్గైయాళ్వార్లను నాభిగా, మధురకవులను శ్రీచరణాలుగా పెద్దలు పలికారు.

దీనికి అనుగుణంగా "భూతం శిరోహ్రదమహాహ్వాయ మక్షియుగ్మం, భట్టార్య మాస్య మథ భార్గవ మస్య కంఠమ్, బాహూ వదంతి కులశేఖరయోగివాహౌ దోర్మధ్యనాభిచరణానితరాన్ శఠారేః" అనే శ్లోకం, "భూతం మస్తకమక్షిణీ హ్రదమహత్సూరీ చ భట్టేశ్వరం వక్త్రం భక్తిఘనం గళం కులశిరోభూషం మునిం కాయకమ్, దోర్యుగ్మం హరిదాసపద్రజ ఉరోనాభిం కలిధ్వంసినం శ్రీపాదం మధురం కవిం యతిపతిం చాహుః శఠారేర్బుధాః" అనే శ్లోకం అవతరించాయి.

ఇటువంటి నిస్సమాభ్యధికమైన వైభవాన్ని కల ఆళ్వార్లు "ఉయర్వఱ ఉయర్ నలమ్"ను (నిస్సమాభ్యధికమైన ఆనందాన్ని) కల "అయర్వఱు అమరర్కళ్ అదిపతి" (నిత్యసూరి నాథుని) చేత "మయర్వఱ మదినలమ్" (భ్రమవిప్రలంబాది దోషరహితమైన, భక్తిరూపంలో పరిణమించిన జ్ఞానం) అనుగ్రహింపబడినవారై, లోకానికి కృపజేసిన దివ్యప్రబంధాల వివరం ఏమంటే-

| ప్రబంధం పేరు | పాశురసంఖ్య |
|---|---|
| 1. పొయ్కై ఆళ్వార్లు అనుగ్రహించిన ముదల్ తిరువన్దాది - | 100 |
| 2. పూదత్తాళ్వార్లు అనుగ్రహించిన ఇరణ్డామ్ తిరువన్దాది - | 100 |
| 3. పేయాళ్వార్లు అనుగ్రహించిన మూన్ఱామ్ తిరువన్దాది - | 100 |
| 4. తిరుమళిశై ప్పిరాన్ అనుగ్రహించిన తిరుచ్చందవిరుత్తమ్ (120), నాన్ముకన్ తిరువన్దాది (96) - | 216 |
| 5. నమ్మాళ్వార్లు అనుగ్రహించిన తిరువిరుత్తం (100), తిరువాశిరియమ్ (7), పెరియతిరువన్దాది (87), తిరువాయ్మొళి (1102) - | 1296 |
| 6. కులశేఖరాళ్వార్లు అనుగ్రహించిన పెరుమాళ్ తిరుమొళి - | 105 |
| 7. పెరియాళ్వార్లు అనుగ్రహించిన తిరుప్పల్లాణ్డు (12), పెరియాళ్వార్ తిరుమొళి (461) - | 473 |

Scanned by CamScanner

8. తొణ్డరడిప్పొడి ఆళ్వార్లు, అనుగ్రహించిన తిరుమాలై (45), తిరుప్పళ్ళి ఎళుచ్చి (10) - 55

9. తిరుప్పాణ్ ఆళ్వార్లు అనుగ్రహించిన అమలనాదిపిరాన్ (10) - 10

10. తిరుమఙ్గై ఆళ్వార్లు అనుగ్రహించిన పెరియతిరుమొళి (1084), తిరుక్కుఱున్దాణ్డకమ్ (20), తిరునెడున్దాణ్డకమ్ (30), శిఱియ తిరుమడల్ (1), పెరియ తిరుమడల్ (1), తిరువెళుకూఱ్ఱిరుక్కై (1) - 1137

11. మధురకవి ఆళ్వార్లు అనుగ్రహించిన కణ్ణినుణ్ శిఱుత్తాంబు - 11

12. ఆణ్డాళ్ అనుగ్రహించిన తిరుప్పావై (30), నాచ్చియార్ తిరుమొళి (143) - 173

---

ఆళ్వార్లు అనుగ్రహించిన 24 ప్రబంధాలలోని పాశురాల సంఖ్య- 3776

---

భగవద్రామానుజుల విషయంగా తిరువరఙ్గత్తముదనార్ అనుగ్రహించిన ఇరామానుశనూఱ్ఱన్దాదిలోని 108 పాశురాలను కూడా కలిపితే ఈసంఖ్య 3776+108=3884

ఇపుడు పెరియాల్వార్ల వైభవం సంగ్రహంగా నివేదింపబడుతున్నది.

## పెరియాళ్వార్ వైభవం

మిథునే స్వాతిజం విష్ణో రథాంశం ధన్వినః పురే ।
ప్రపద్యే శ్వశురం విష్ణోః విష్ణుచిత్తం పురశ్శిఖమ్ ॥

మిథునమాసం (అంటే - ఆనిమాసం)లోని స్వాతి అనే నక్షత్రంలో, విష్ణువుకు వాహనమైన గరుడుని అంశతో, పూర్వశిఖాశ్రీవైష్ణవబ్రాహ్మణకులంలో అవతరించిన వారు శ్రీరంగనాథునకు మామగారైన విష్ణుచిత్తులను (పెరియాళ్వార్లను) శరణు పొందుతున్నాను.

తాదాత్వికప్రతిఫలత్ భగవత్పరత్వం
విస్తీర్య పాండ్యకథకేంద్రజయీ గజేన ।
గచ్ఛన్ ప్రియాదుపగతే గరుడే సనాథే
ప్రేమ్ణాఽఽశిషం రచయతి స్మ నమోఽస్తు తస్మై ॥

Scanned by CamScanner

ఆ సమయంలో పరమపురుషుని నిర్హేతుకకృపవల్ల మనస్సులో భాసించిన శ్రీమన్నారాయణుని పరత్వాన్ని విస్తృతంగా పల్కి, వాదించి పాండ్యదేశంలో జరిగిన, వాదంలో సమర్థులైన ప్రతివాదులను జయించినవారై, ఏనుగుపై ఊరేగింపుగా వచ్చే ఏ పెరియాళ్వార్లు, అపుడు ఆనందంతో గరుడుని అధిరోహించి ప్రత్యక్షమైన శ్రీమన్నారాయణుని విషయంలో ప్రేమాధిక్యంచేత పల్లాణ్డు పాడారో, ఆ ఆళ్వార్లకు మంగళాశాసనం.

తత్త్వాబ్దాపగమే కలౌ యుగవరే సంవత్సరే క్రోధనే
చందాంశౌ మిథునం గతేఽహ్ని నవమే పక్షౌ వళర్క్షేఽపి చ ।
స్వాత్యాం భాస్కరవాసరే శుభతిథౌ ఏకాదశీనామని
శ్రీమానావిరభూదచింత్యమహిమా శ్రీవిష్ణుచిత్తోఽనఘః ॥

అతిశయించిన భగవత్ప్రేమ అనే సంపదను కలవారై, ఎవరిచేతకూడా ఇంత అని లెక్క కట్టలేని మహిమను కలవారై, దోషరహితులైన పెరియాళ్వార్లు, యుగాలలో (అల్పాంశానికి అధిక ఫలాన్ని ఇచ్చే) గొప్పతనాన్ని కల కలియుగంలో "తత్త్వ" అనే పదం ద్వారా (తకారంద్వారా ఆరు, వకారంద్వారా నాల్గు, ఈ రెండు అంకెలను చేర్చి, క్రమాన్ని ఎడమనుండి లెక్కిస్తే) సూచింపబడే 46 సంవత్సరాలు గడచిన తరువాత, క్రోధన అనే పేరు గల సంవత్సరంలో, సూర్యుడు మిథునరాశిలో ప్రవేశించిన ఆనిమాసంలో తొమ్మిదవ నాడు, శుక్లపక్షంలోని ఏకాదశితిథిలో అవతరించారు.

జ్యేష్ఠేఽథ మాసే పవమానతారే శ్రేష్ఠే గుణేనాజని భట్టనాథః ।
తత్ర త్రయీరూప గరుత్మతాత్మా కటాక్షలక్ష్యం కమలాపతేర్యః ॥

దివ్యాత్మగుణాలతో గొప్పవారు, వేదస్వరూపి అయిన గరుడుని అంశతో అవతరించినవారు, శ్రియ:పతికటాక్షానికి లక్ష్యమైనవారైన భట్టనాథులనే పెరియాళ్వార్లు ఆనిమాసంలో వాయువును అభిమానదేవతగా కల స్వాతీ నక్షత్రంలో అవతరించారు.

పైన ప్రస్తావించిన తనియన్ శ్లోకాలలో, వైభవశ్లోకాలలో పూర్వాచార్యులు అనుసంధించిన రీతిలో, కలియుగారంభమైన తరువాత 47వ సంవత్సరంలో, క్రోధన నామసంవత్సరంలో, ఆనిమాసం శుక్లపక్షంలోని ఏకాదశిలో, స్వాతీనక్షత్రంతో కూడిన ఆదివారంనాడు శ్రీవిల్లిపుత్తూర్‌లో, పూర్వశిఖా శ్రీవైష్ణవ బ్రాహ్మణకులంలో,

Scanned by CamScanner

వేదార్థవిశదీకరణప్రవీణులైన ముకుందభట్టర్‌కు, పద్మ అనే పేరును కల పతివ్రతాశిరోమణికి అయిదవ కుమారునిగా, వేదస్వరూపుడైన గరుడుని అంశతో పెరియాళ్వార్లు అవతరించారు. సంస్కృతభాషలో ఉండే శ్రీవిల్లిపుత్తూర్ స్థల పురాణంలోను, మణిప్రవాళశైలిలోని గురుపరంపరాప్రభావమనే గ్రంథంలోను వీరి వైభవం చాలా విస్తృతంగా తెలుపబడింది.

ఈ ఆళ్వార్లు జన్మించిన తరువాత, వీరి తండ్రి తగిన జాతకకర్మ సంస్కారాన్ని చేసి, "విష్ణుచిత్తు"లనే పేరును వీరికి పెట్టారు. చౌలం, ఉపనయనం మొదలైన బ్రాహ్మణకులోచితసంస్కారాలను అన్నిటిని యుక్తవయస్సులో జరిపి, వేదాల అధ్యయనాన్ని చేయించారు. వివాహోచిత వయస్సురాగానే తగిన కన్యకతో ప్రాణిగ్రహణాన్ని కూడా జరిపి, గృహస్థధర్మంలో ప్రవేశింపజేశారు. విష్ణుచిత్తులు, శ్రీవిల్లిపుత్తూర్‌లోని వటపత్రశాయిస్వామి నిర్హేతుకకృపవల్ల, ఆ స్వామికి నిత్య కైంకర్యం చేయడంలో అభినివేశాన్ని కలవారయ్యారు. "కైంకర్యాలలో భగవానునకు చాలా అభిమతమైనది ఏది?" అని వారు విచారించి చూచినపుడు, శ్రీకృష్ణావతారంలో భగవానుడు కంసునకు పూలమాలికలను కట్టి అలంకరించిన శ్రీ మాలాకారుని ఇంటిని వెదకి వచ్చి, అతనివద్ద అడిగి పూమాలికలను పొందిన వృత్తాంతాన్ని గమనించి, "మాలాసమర్పణ కైంకర్యమే భగవానుడు మెచ్చే కైంకర్యం" అని నిశ్చయించుకొని, ఒక పెద్ద నందనవనాన్ని నిర్మించి, నిత్యం వటపత్రశాయిస్వామికి పూమాలికలను కూర్చి సమర్పించేవారు.

ఆ కాలంలో పాండ్యకులతిలకుడైన శ్రీవల్లభదేవుడు - అనే ప్రభువు ధర్మం తప్పకుండా **"కూడల్"** - అనే పేరును కల మధురను రాజధానిగా చేసికొని పాండ్యదేశాన్ని పాలించేవాడు. అతడు, ఒకనాటి రాత్రి నగరశోధనను చేసేటపుడు, ఒక ఇంటి వీధి అరుగుపై నిద్రించే ఒక బ్రాహ్మణుని చూచి నిద్ర లేపి - "నీవెవరు" అని అడిగాడు. అపుడు ఆ బ్రాహ్మణుడు "నేను దివ్యదేశయాత్రను చేస్తూ ఉత్తర దేశం అంతటా పర్యటించి, గంగలో స్నానం చేసి వస్తున్నాను" అని బదులిచ్చాడు. దానిని విన్న ప్రభువు - "నీకు తెలిసిన ఏదయినా ఒక మంచి శ్లోకాన్ని చెప్పు" అని అన్నాడు. ఆ బ్రాహ్మణుడు - "వర్షార్థ మష్టౌ ప్రయతేత మాసాన్ నిశార్థమర్ధం దివసం యతేత, వార్ధక్యహేతోః వయసా నవేన పరత్ర హేతో రిహ జన్మనా చ" (సంవత్స రంలో వర్షకాలమైన ఆణి, ఆవణి, పురట్టాశి, అల్పిశి, (ఆషాఢం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం) అనే నాల్గు నెలలలో సుఖంగా జీవించడంకోసం మిగిలిన ఎనిమిది నెలలలో తగిన ప్రయత్నం చేయాలి. రాత్రిలో సుఖాన్ని పొందడంకోసం

Scanned by CamScanner

పగలు శ్రమించాలి. ముదుసలితనంలో శ్రమ లేకుండా జీవించడంకోసం యౌవన పరువంలో పాడుపడాలి. మఱుజన్మలో ఆనందంపొందడంకోసం ఈ జన్మలో ప్రయత్నించాలి) అనే శ్లోకాన్ని చెప్పాడు. ప్రభువు ఆ రాత్రి ఆ శ్లోకంలోని అర్థాన్ని గూర్చి చింతిస్తూ నిద్రించాడు. తెల్లవారగానే, "ఈ శ్లోకంలోని మొదటి మూడు పాదాలలో చెప్పబడిన కొఱతలు ఏమీ నాకు లేవు. కనుక, వానినిగూర్చి నేను చేయవలసిన ప్రయత్నం ఏదీ లేదు. కాని, నాల్గవ పాదంలో చెప్పబడ్డ మఱుజన్మ లోని ఆనందాన్నిగూర్చి ఇంతవరకు నేను ఏవిధమైన ప్రయత్నాన్ని చేయలేదు కదా!" అని తన మనస్సులో బాధపడ్డాడు. తన పురోహితుడు, శాస్త్రపారంగతు డైన శెల్వనంబిని పిలిచి "మఱుజన్మలో గొప్ప ఆనందాన్ని పొందడానికి ఏది దారి?' అని అడిగాడు. శెల్వనంబికూడా "నేను ఏదయినా ఒక విషయాన్ని తెలిపితే, ఇతనికి దానిలో స్థిరమైన నమ్మిక కలుగక పోవచ్చు" అని తలచి, "రాజ్యంలో ఉండే విద్వాంసులను అందఱిని ఆహ్వానించి, వేదాంతాలద్వారా పరతత్త్వనిర్ణయం చేయించు. ఆ మార్గంలో పరమార్థాన్ని పొందవచ్చు" అని ఉపదేశించాడు. వల్లభ దేవుడు దానికి సమ్మతించి, రాజ్యంలోని విద్వాంసులను అందఱిని సమావేశ పరచడంకోసం గొప్ప విలువైన ధనరాశిని ఒక వస్త్రంలో మూటగా కట్టించి, "పరతత్త్వనిర్ణయాన్ని చేసినవారికి ఈ ధనశుల్కం బహుమానంగా సమర్పించ బడుతుంది" అని రాజ్యంలో అంతటా చాటింపు వేయించాడు.

అపుడు, వటపత్రశాయిస్వామి పెరియాళ్వార్లద్వారా వేదాంతాలలో నిగూఢంగా ఉండే పరతత్త్వాన్ని ప్రకాశింపజేయించి లోకాన్ని ఉద్ధరించడంకోసం, ఆ ఆళ్వార్లకు స్వప్నంలో సాక్షాత్కారించి, "మీరు పాండ్యరాజు సభకు పోయి, వాదాన్ని చేసి జయించి, వాదశుల్కాన్ని పొంది రండి" అని అన్నాడు. "అది శాస్త్రాలను అన్నిటిని అభ్యసించిన పండితులు చేయదగిన పని. శాస్త్రాభ్యాసాన్ని చేయకుండా, కేవలం నందనవనకైంకర్యంలోనే అభినివేశాన్ని కల్గి ఉండే నేను, తవ్వుగోలతో ఎల్లప్పుడు తవ్వుతున్నందున నాచేతిలో ఏర్పడిన కాయలను చూపించి, వాదశుల్కాన్ని పొందడం సాధ్యమా?" అని ఆళ్వార్లు బదులివ్వగా, వటపత్రశాయి స్వామి "విష్ణుచిత్తా! దానిని గూర్చి మీకెందుకు చింత? మీ ద్వారా పరతత్త్వనిర్ణయం చేయబోయేది నేనే కదా! మీరు తప్పక వెళ్ళండి" అని నిర్బంధించాడు. విష్ణుచిత్తులు కూడా తెల్లవారిన తరువాత నిద్ర లేచి, తనకు కల్గిన స్వప్నాన్నిగూర్చి ఆశ్చర్యంతో ఆలోచిస్తూ ఉండగా, వటపత్రశాయి పెరుమాళ్ళకోవెలలోని కైంకర్యపరులు ఆ స్వామి

Scanned by CamScanner

ఆజ్ఞ ఇచ్చిన ప్రకారం, ఆళ్వార్లు బయలుదేరడంకోసం పల్లకిని, తిరుచ్చిన్నాలను (జీయర్‌వంటి పెద్దలు బయటకు వేంచేసేటపుడు వారి రాకను తెల్పుతూ ఊదే బాకాలవంటి వాద్యాలు) మొదలైన కోవెలపరిచ్ఛదాలను తీసికొని వచ్చి, ఆళ్వార్లను మధురకు తీసికొని పోవలసినదిగా భగవానుడు తమను ఆజ్ఞాపించినట్లు తెలిపారు. అపుడు ఆళ్వార్లు మధురకు వెళ్ళి, పాండ్యరాజుసభలో వాదించడానికి అంగీకరించి, ఆలయపరిజనపరిచ్ఛదాలు వెంట రాగా ప్రయాణం సాగించి మధురను చేరి పాండ్యప్రభువు సభలోకి ప్రవేశించారు. అప్పటికే శెల్వనంబి ద్వారా వీరి లంకను గూర్చి వినిన వల్లభదేవుడు ఆళ్వార్ల దివ్యతేజస్సును దర్శించి, చాలా ఆశ్చర్యపడి, శెల్వనంబితోపాటు పోయి, వారికి స్వాగతాన్ని పలికి, పాదాలపై వ్రాలి "పట్టర్ పిరాన్ వన్దార్" అని వారిని ప్రశంసించాడు. అక్కడ ఆ సమయానికే వచ్చి చేరిన పలు మతాలకు చెందిన పలువురు విద్వాంసులు "అన్ని వేదాలను, శాస్త్రాలను చదివి, పాండిత్యాన్ని గడించిన మా ముందు ఏ శాస్త్రాన్ని అభ్యసించని వీరిని ప్రశంసించడం తగదు" అని అధిక్షేపించారు. దానిని చూచిన శెల్వనంబి 'వేదాంత నిగూఢార్థమైన పరతత్త్వాన్ని నిర్ణయించి తెలుపండి" అని విష్ణుచిత్తులను ప్రార్థించాడు.

విష్ణుచిత్తులు అపుడు శ్రీరామాయణాన్ని అంతటిని కరతలామలకంగా దర్శించిన వాల్మీకిమహర్షివలె, పాంచజన్యాగ్ర స్పర్శను పొందిన ధ్రువుడు సముద్రం కట్టలు తెంచుకొన్న రీతిలో స్తుతించగల్గినట్లు, అంతకు ముందు ఆక్షేపించిన విద్వాంసులు, దేవలోకంలోనుండి పండితుల రూపంలో సభకు వచ్చిన బృహస్పత్యాదులు అందఱు నోరు మెదపలేనట్లుగా భగవానుని నిర్హేతుకకృపవల్ల, "ప్రాహ వేదానశేషాన్", "వేణ్డియ వేదఙ్గళోది" అని తనియన్ శ్లోకంలో, పాశురంలో పల్కిన రీతిలో, తాము గురుముఖంగా అధ్యయనం చేసిన వేదాలనే కాక, గురుముఖంగా అధ్యయనం చేయనివి, దేవలోకాదులలో ప్రవర్తించేవి అయిన ఆయా వేదవాక్యాలను "శార్‌ఙ్గమ్ ఉదైత్త శరమళైపోల్" వర్షించి, పరతత్త్వనిర్ణయాన్ని చేసి, విద్వాంసులందఱిని జయించారు.

వేలాది వేదవాక్యాలను ఉదాహరిస్తూ, స్మృతీతిహాసపురాణాదులనుండి ప్రమాణాలను ఉట్టంకిస్తూ, తమను ఎదిరించిన విద్వాంసులు తమకు తామే అంగీకరించే రీతిలో, పెరియాళ్వార్లు "శ్రీమన్నారాయణుడే పరతత్త్వం" అని సభలో ఉద్ఘాటించి, ఉద్ఘోషించగానే, విద్యాశుల్కంగా శిలాతోరణానికి కట్టిన ఆ శుల్క

గ్రంధి "వీరి విజయాన్ని పరమాత్మకూడా మెచ్చాడు" అనే దానికి సూచకంగా వీరి ముందు తనకు తానే జారింది. ఆళ్వార్లు భగవానుని ఆ నిరవగ్రహానుగ్రహాన్ని చూచి ఆశ్చర్యపూర్వకంగా ఆనందించి, "విరైస్లు కిళి యఱుత్తాన్" అని తనియన్ పాశురంలో చెప్పినట్లుగా ఆ మూటను తమ విజయచిహ్నంగా ఖండించి, హస్తగతం చేసికొన్నారు.

దీనిని చూచిన విద్వాంసులు, ప్రభువు, మిగిలినవారు అందఱు చాలా ఆశ్చర్యపడి ఆళ్వార్ల శ్రీచరణాలకు నమస్కరించారు. శ్రీవల్లభదేవుడు ఆళ్వార్లను తన పట్టపుటేనుగుపైకి ఎక్కించి, "వేదప్పయన్ కొళ్లవల్ల విట్టుశిత్తర్ వన్దార్", (వేదార్థాన్ని గ్రహించగల్గిన విష్ణుచిత్తులు వచ్చారు), "మెయన్నావన్ వన్దార్" (సత్యాన్ని పలికేవారు వచ్చారు), "మెయ్యడియార్ వన్దార్" (నిజమైన భక్తులు వచ్చారు) మొదలైన పలు బిరుదులను పల్కుతూ, తిరుచిన్నాలను ఊదుతూ పరిజనాలు వెంటరాగా, రాజవీథిలో ఊరేగింపు జరిపించాడు. విద్వాంసులందఱు తమకు విష్ణుచిత్తులే నాథులనే విషయం లోకానికి తెలిసేటట్లు "పట్టర్ పిరాన్" (భట్టనాథులు) అనే తిరునామాన్ని సమర్పించి, ప్రశంసిస్తూ, ఛత్ర ధ్వజ, చామరాది లాంఛనాలను తామే మోస్తూ వెంట వచ్చారు.

ఈ విధంగా ఆళ్వార్లు నగరంలోని రాజవీథులలో పట్టపుటేనుగును అధిరోహించి ఊరేగేటపుడు, తనయుని అతిశయాన్ని చూడాలని వచ్చిన తండ్రివలె, భగవానుడు గరుడారూఢుడై, శ్రీభూదేవీసమేతుడై, బ్రహ్మశివాదులు స్తుతించగా, భూలోక వాసులందరూ చూచేటట్లుగా ఆకాశంలో సాక్షాత్కరించాడు. శ్రీమన్నారాయణుని ఆ నిర్హేతుకకృపవల్ల "మయర్వఱ మతినలమ్" పొందిన ఆళ్వార్లు "కాలాతీతమైన శ్రీవైకుంఠంలో వేంచేసి ఉండే ఈ స్వామి, కాలాధీనమైన, అజ్ఞాన తమోమయమైన ఈ లోకంలో, కల్యాణగుణాలతో కూడిన రూపంతో మాంస చక్షువులకు సైతం గోచరంచేటట్లు వేంచేస్తే ఆ రూపానికి ఏమి హాని కల్గుతుందో!" అని అస్థానే భయశంకను పొంది, "పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డు పలకోటి నూఱాయిరమ్" అని ఆరంభించి, పట్టపుటేనుగుపై ఉంటే చిఱుగంటలనే తాళాలుగా చేసికొని, తిరుప్పల్లాణ్డు పాడడానికి ఆరంభించారు. వీరి భయం పోవడంకోసం భగవానుడు మల్లులను వధించిన తన బలమైన బాహువులను, రూపసౌందర్యాన్ని, అసురులను, రాక్షసులను నిరసించ శ్రీచరణాలను, మంగళాలకు అన్నిటికి కారణభూతురాలైన లక్ష్మీదేవిని, శంఖచక్రాలను మొదలైనవానిని

దర్శింపజేశాడు- భగవానుడు. వాటిని దర్శించిన ఆళ్వార్లకు భయశంక తీరకపోగా, మరింత అధికమై, వాటికికూడా ఆళ్వార్లు తాము ఒక్కరే పల్లాణ్డు పాడితే తృప్తి కలుగదు కనుక, తమతో అనన్యప్రయోజనులను, ఐశ్వర్యకైవల్యార్థులను చేర్చుకొని భగవానునకు పల్లాణ్డుపాడిన రీతిని తరువాత గల తొమ్మిది పాశురాలలో తెలిపి, పరమపదంలోకూడా పల్లాణ్డు పాడడమే పరమ ప్రయోజనం అని ప్రబంధ ప్రయోజనాన్ని చివరగా పల్కి, "తిరుప్పల్లాణ్డు" దివ్యప్రబంధాన్ని పూర్తి చేశారు. పొంగి పొర్లే వీరి ప్రేమాధిక్యాన్ని చూచిన భగవానుడు వీరికి "పెరియాళ్వార్లు" అనే పేరును పెట్టి, అదృశ్యుడయ్యాడు.

తరువాత, ఆళ్వార్లు, "భగవానునకు మంగళాశాసనాన్ని చేస్తూ, ఆ స్వామికి, ఆ స్వామి భక్తులకు కైంకర్యంచేస్తూ జీవించడమే, అతని అనుగ్రహంతో ప్రాప్యాన్ని పొందడానికి ఉత్తమోత్తమోపాయం" - అనే తిరుప్పల్లాణ్డు ప్రబంధసారాన్ని వల్లభదేవునకు ఉపదేశించి, అతనిని సంస్కరించి, శ్రీవిల్లిపుత్తూర్‌కు తిరిగి చేరారు. వాదశుల్కధనంగా తమకు లభించిన గొప్ప ధనాన్ని వటపత్రశాయిస్వామి కైంకర్యాలకు వినియోగిస్తూ, పూర్వంవలె వటపత్రశాయికి పూమాలికా సమర్పణ కైంకర్యాన్ని కొనసాగించారు. తాము మిక్కిలిగా అభినివేశాన్ని పొందిన శ్రీకృష్ణావతారంనుండి ఆరంభించి, ఆ అవతారంలోని భగవానుని బాల్యక్రీడలను అన్నిటిని దేనిని విడువకుండా స్తుతించి, అతిమానుషలీలలను పొగడి అనుసంధిస్తూ పెరియాళ్వార్ తిరుమొళి అనే దివ్యప్రబంధాన్ని పాడారు. ఈ విధంగా శ్రీకృష్ణావతార లీలలను యశోదాభావనతో అనుభవించడంవల్ల వీరు "పోకత్తిల్ వళువాత పుదు వైయర్‌కోన్" అని గోదాదేవిచేతకూడా శ్లాఘింపబడ్డారు.

ప్రబంధరచనద్వారా లోకాన్ని ఉజ్జీవింపజేయడమే కాక, "ఒరు మకళ్‌తన్నై యుడైయేన్" అని తామే పల్కిన రీతిలో గోదాదేవిని పెంచి, ఆమె తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి లోకానికి అనుగ్రహించడంలో కారణభూతులై, ఆమెను శ్రీరంగనాథునకే సమర్పించి, సాక్షాత్తు శ్రీరంగనాథుననే మామగారు అయ్యారు. ఈ రీతిలో పలు మహోపకారాలను చేసిన ఆళ్వార్లు తాము మిక్కిలిగా అభినివేశాన్ని పొందిన తిరుమాలిరుమ్ శోలై అనే క్షేత్రంలోనే చరమకాలంలో నివసించి అక్కడే తిరునాడుకు చేరారు.

ఇక, పల్లాణ్డు అనే ద్రావిడ ప్రబంధ ప్రక్రియనుగూర్చి కొన్ని అంశాలు తెలుపబడుతున్నాయి.

Scanned by CamScanner

ద్రావిడ ప్రబంధరీతులు :- నాలాయిర దివ్యప్రబంధ వాఙ్మయంలో కన్పించే "పల్లాణ్డు, పళ్ళి ఎళ్లుచ్చి, పావై, మడల్, మాలై" మొదలైనవి అర్థాన్నిబట్టి వచ్చిన ప్రక్రియానామాలు కావు. ఇవియే కాక, ఇంకా ఇటువంటి మఱి కొన్ని ప్రబంధరీతులుకూడా దివ్యప్రబంధాలలో కన్పిస్తాయి. వీటినిగూర్చి కొంచెం పరిశీలించవలసి ఉన్నది.

పల్లాణ్డు :- పెరియాళ్వార్లు భగవానునిగూర్చి పాడిన "తిరుప్పల్లాణ్డు" ప్రబంధం నాలాయిరదివ్యప్రబంధవాఙ్మయంలో మొట్టమొదటి ప్రబంధంగా కూర్చబడింది. ఈ విధంగా ఈ ప్రబంధాన్ని మొదటి ప్రబంధంగా కూర్చడం దాని వైలక్షణ్యాన్ని చక్కగా తెల్పుతున్నది- అని అభిజ్ఞులంటారు. "ఉళ్ళదుక్కెల్లామ్ శురుక్కాయ్, త్తాన్మఙ్గలమాదలాల్" అని అంటూ శ్రీమణవాళ మహామునులు ఈ ప్రబంధంయొక్క వైశిష్ట్యాన్ని ఉపదేశరత్తినమాలై ప్రబంధంలో తెలిపారు. భగవానునకు పెరియాళ్వార్లు మంగళాశాసనం చేసే రీతిలో పాడబడిన ప్రబంధం ఇది.

పల్లాణ్డుప్రబంధప్రక్రియావిర్భావంలోని నేపథ్యం :-

ఇపుడు, "పల్లాణ్డు" అనే ప్రబంధప్రక్రియ ఆవిర్భవించడంలో గల నేపథ్యాన్ని గమనిద్దాం. ఒకనిని, ఇంకొకడు "చిరకాలం వర్ధిల్లు" అని ఆశీర్వదించడం లోకపరిపాటి. ఇదియే ఈ ప్రబంధావతరణకు మూలకారణం కావచ్చు. బాల్యం నుండి ఒకనిని ఈ విధంగా ఆశీర్వదించడం లోకరీతి. "పణ్ణోర్ మొళ్ళియార్గై క్కావి ముళై యిట్టు పల్లాణ్డు కూఱువిత్తేన్" (పెరియాళ్వార్ తిరు 3-3-9) అని అంటూ యశోద చక్కగా గానం చేసే గొల్లవనితలద్వారా శ్రీకృష్ణశిశువుకు పల్లాణ్డు పాడించినట్లు పెరియాళ్వార్లు తమ ప్రబంధంలో అంటారు. ఇక్కడ తల్లి తన బిడ్డకు పలువురు ముత్తయిదువుల ద్వారా ఆశీర్వాదం (మంగళాశాసనం) చేయించే సాంఘికసంప్రదాయం సూచింపబడింది. ఈవిధంగా బాల్యంనుండి కన్పించే మంగళాశాసనప్రక్రియ మానవజీవితంలో పలు దశలలో- (అక్షరాభ్యాసంలో, వివాహం మొదలైన పలు సందర్భాలలో) కన్పిస్తున్నది. ఈ సాంఘికమైన, శాస్త్రీయమైనవిధానం సాహిత్యంలో చోటు చేసికోవడం సహజం. ద్రావిడ సాహిత్యంలోని "పుఱనిలై వాళ్త్తు", "వాయుఱై వాళ్త్తు" ఇత్యాది కావ్యప్రక్రియలు ఇందుకు నిదర్శనాలు. పుఱనానూఱుమొదలైన ప్రాచీనద్రావిడ గ్రంథాలలో పల్లాణ్డు పాడే విధానం విరివిగా కన్పిస్తుంది. పుఱనానూఱు అనే ప్రాచీనద్రావిడ (సంకల

Scanned by CamScanner

నాత్మక) గ్రంథంలోని "వాళ్త్తు, వాళ్త్తియల్", "ఇయన్మొళి" ఇత్యాది ప్రక్రియా విశేషాలలో ఈ అంశాన్ని గమనించవచ్చు. విశ్లేషించిన నాయకుడు తిరిగి వచ్చిన సందర్భంలో నాయిక అతనికి "నీడు వాళ్క" అని మంగళం పాడే ఆచారాన్ని తిరుక్కుఱళ్ (1317) కూడా పేర్కొన్నది. ప్రభువులకు, లేక, భర్తలకు ఈవిధంగా పల్లాణ్డు పాడే లౌకిక సంప్రదాయం పెరియతిరుమొళి (6-2-5)లో, "తొక్కు ప్పల్లాణ్డిశైత్తు" తిరువాయ్మొళి (7-6-11) పాశురాలలో కూడా గోచరిస్తుంది. ఈ విధంగా ప్రభువులకు, లేక, నాయకులకు మంగళాశాసనం చేసే సాహిత్య ప్రక్రియ భగవానుని విషయంలోకూడా కన్పిస్తుంది. ప్రాచీన ద్రావిడ లక్షణ గ్రంథమైన తొల్కాప్పియంలోని "కడవుళ్ వాళ్త్తు" దీనికి ఒక ఉదాహరణం. వీటిని అన్నిటిని "పల్లాణ్డు" అనే ప్రబంధ ప్రక్రియావిర్భావానికి నేపథ్యంగా భావించవచ్చునని శ్రీ ఎం.పి. శ్రీనివాసన్ అనే సాహిత్యలక్షణ విమర్శకులు "వైణవ ఇలక్కియ వకైకళ్" అనే పరిశోధన గ్రంథంలో అన్నారు.

భగవానునకు పల్లాణ్డు పలికే సంప్రదాయం ఉన్నదని, అది సంగీతాత్మకంగా గానం చేయబడుతున్నదని తిరునావుక్కరశు అనే తమిళకవి రచించిన "తేవారమ్" గ్రంథంలోని తిరువారూర్ పదికం (దశకం) వల్ల తెలియవచ్చు. ఈ విధంగా పల్లాణ్డు పాడేవారిని గూర్చిన- "పాడువోర్ పణివోర్ పల్లాణిశై కూఱు పత్తర్కళ్" అనే అక్కడి ప్రయోగం గమనార్హం. పెరియాళ్వార్లు "పణ్ పల పాడి ప్పల్లాణ్డిశైప్ప" (1-9-5) అని, తిరుమంగైమన్నన్ "పాణ్ తేణ్ పణ్ణత్తైయుమ్ కుళలార్కళ్ పల్లాణ్డిశైప్ప" (6-2-5) అని దీనిని సూచించారు. దీనివల్ల "పల్లాణ్డు వాళ్క" అని మంగళాశాసనం చేసే రీతిలోని సంగీతాత్మకమైన పాశురాలను "పల్లాణ్డిశై" అని వ్యవహరించే సంప్రదాయం ఉన్నదని కూడా తెలుస్తున్నది. ఈ విధంగా పల్లాణ్డు పాడేవారిని "పల్లాణ్డిశైప్పార్" అని తిరుప్పావై ప్రబంధం పేర్కొన్నది.

ఈ "పల్లాణ్డిశై"ను గూర్చి తిరునావుక్కరశర్ మునుముందుగా పేర్కొన్నా, అతని కాలంలో ప్రత్యేకంగా పల్లాణ్డు ప్రబంధం ఏదీ రచింపబడినట్లు కన్పించదు. మొదటి తిరుప్పల్లాణ్డు ప్రబంధం పెరియాళ్వార్ల తిరుప్పల్లాణ్డు ప్రబంధమేనని శ్రీనివాసన్గారి అభిప్రాయం. ఆ తరువాత శైవసాహిత్యంలో ఒక పల్లాణ్డు ప్రబంధాన్ని శెన్దనార్ అనే కవి రచించారు. పెరియాళ్వార్ల తిరుప్పల్లాణ్డుప్రబంధం అవతరించిన సందర్భం పెరియాళ్వార్ల వైభవంలోనే తెలుపబడినందున ఇక్కడ మళ్ళీ దానినిగూర్చి ప్రస్తావించడం లేదు.

Scanned by CamScanner

### తిరుప్పల్లాణ్డు ప్రబంధనిర్మాణవైఖరి :-

తిరుప్పల్లాణ్డు ప్రబంధంలో 12 పాశురాలున్నాయి. మొదటి పాశురం కేవలం రెండు పాదాలున్నాయి. ఇది కుఱళ్ ఛందస్సులో కూర్పబడింది. మిగిలిన 11 పాశురాలు "అఱుశీర్ ఆశిరియ విరుత్తమ్" అనే ఛందస్సులో రచింపబడ్డాయి.

ఈ ప్రబంధం "పల్లాణ్డు" అనే పదంతో ప్రారంభమై, "ఏత్తువర్ పల్లాణ్డే" అని ముగుస్తున్నది. పల్లాణ్డు పాడడం కోసంగా రచించిన ఈ ప్రబంధంలో ఆఴ్వార్లు "పల్లాణ్డు" అనే పదాన్ని పాశురాలు అన్నిటిలోను ప్రయోగించడం గమనార్హం. శైవకవి శేన్దనార్ పాడిన తిరుప్పల్లాణ్డు ప్రబంధంలోకూడా ఈ పదం ప్రయోగింపబడినా, "పల్లాణ్డు కూఱుదుమే" అనే ఒకే రీతిలో ప్రయోగింపబడింది. కాని, పెరియాఴ్వార్లు "పల్లాణ్డు కూఱుదుమే", "పల్లాణ్డు కూఱుమినే", "పల్లాణ్డు కూఱువనే" అని ఈ విధంగా భిన్నంగా ప్రయోగించారు. ఆఴ్వార్లు చేసిన బహువచనప్రయోగం భక్తులందరితో కలసి పాడిన రీతిని, ఏకవచనం భక్తులకు ప్రతినిధిగా తాము ఒక్కరే పాడిన రీతిని సూచిస్తాయి. ఈ భగవద్భక్తులు భగవత్ప్రాప్తికాములు, కైవల్యార్థులు, ఐశ్వర్యార్థులు- అని మూడు రీతులుగా విభాగింపబడ్డారు. ఈ మూడు విధాలైన భక్తులను ఆహ్వానించి, వారితో కలసి, ఆఴ్వార్లు భగవానునకు పల్లాణ్డు పాడే ప్రబంధమే తిరుప్పల్లాణ్డు- అని పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానం తెల్పుతున్నది. సర్వరక్షకుడైన భగవానునకు మంగళాశాసనం చేయడంలోని సామంజస్యాన్నిగూర్చికూడా పెరియవాచ్చాన్‌పిళ్ళై తమ వ్యాఖ్యానావతారికలో విరివిగా విచారించారు.

పెరియాఴ్వార్లు ఒక్కరే "తిరుప్పల్లాణ్డు" ప్రబంధాన్ని రచించారు. ఇంకొక ఆఴ్వార్లు ఎవరూ వేఱొక పల్లాణ్డు ప్రబంధాన్ని అనుగ్రహించలేదు. కాని, భగవానునకు మంగళాశాసనం చేసే ప్రక్రియను మాత్రం మిగిలిన ఆఴ్వార్లు తమ ప్రబంధాలలో అక్కడక్కడ ప్రస్తావించారు. తిరువాయ్‌మొఴి ప్రబంధంలోని "వీఱ్ఱిరున్దేఴులకుమ్" (4-5) అనే దశకంలో నమ్మాఴ్వార్లు భగవన్మంగళాశాసనం చేసినట్లు, వ్యాఖ్యాతలైన పూర్వాచార్యుల వివరణం. "అఙ్గుమిఙ్గుమ్" అనే (8-3) దశకాన్నికూడా "నమ్మాఴ్వారుడైయ తిరుప్పల్లాణ్డు"గా నమ్పిళ్ళైపేర్కొన్నారు. గోదాదేవి తిరుప్పావై ప్రబంధంలోని 10,21,24,26వ పాశురాలలో పల్లాణ్డు పాడే ప్రసక్తి కన్పిస్తుంది. తిరుప్పావైలోని "అన్ఱివ్వులకమ్" అనే పాశురం పూర్తిగా భగవన్మంగళాశాసనపరం.

Scanned by CamScanner

"వాళ్ళుమ్ పకై యఱిన్దేన్" (మూన్ఱామ్ తిరు-59), "వాళ్త్తియ వాయరాయ్" (మూన్ఱామ్-96) అని పేయాళ్వార్లు, "వాళ్తల్ కణ్డేర్ కుణమిదన్ఱో ! మాయవనడి పరవి" (తిరువాయ్ -9-1-8) అని, "వాళ్త్తువార్ పలరాక" (తిరువాయ్ 3-1-7) అని, "వాళ్త్తి యవనడి" (పెరియతిరువన్దాది-84) నమ్మాళ్వార్లు "వాళ్త్తుక వాయ్" (నాన్ముకన్ తిరు-11) అని తిరుమళిశైప్పిరాన్ అని పల్కిన సూక్తులు స్మరణీయాలు.

శ్రీవైష్ణవసంప్రదాయంలో "ఆరాధనానాం సర్వేషాం విష్ణోరారాధనం పరమ్, తస్మాత్ పరతరం ప్రోక్తం తదీయారాధనం నృప!" అనే రీతిలో భగవానునివలెనే, తద్భక్తులుకూడా ఆరాధ్యులు. కనుక భగవన్మంగళాశాసన ప్రక్రియవలె భాగవత మంగళాశాసన ప్రక్రియ కూడా కన్పిస్తుంది. తిరువాయ్మొళిలోని "పొలిక పొలిక పొలిక" అనే దశకంలో భాగవత మంగళాశాసనం చేయబడినదని పూర్వాచార్యుల అభిప్రాయం. "ఇత్తిరువాయ్మొళియిలే భాగవతర్కళుడైయ కూట్టత్తిఱ్కు మఙ్గళా శాసనమ్ శెయ్కిఱార్" అనే ఆ సందర్భంలోని నఞ్జీయర్ వ్యాఖ్యానసూక్తి అను సంధేయం.

ఆళ్వార్లు అందటు భగవద్భాగవతమంగళాశాసనాన్ని చేసే స్వభావాన్ని సహజంగా కల్గి ఉండడంచేత నాలాయిరదివ్యప్రంబంధం అంతా మంగళా శాసనప్రబంధంగా నిర్దేశించే సంప్రదాయం ఉన్నదని శ్రీవిల్లిపుత్తూర్ వి.కె. శ్రీనివాసాచార్యస్వామివారు అన్నారు. మంగళాశాసనాన్ని చేసే ఈ రీతి శ్రీవైష్ణవ సంప్రదాయంలో బహుళప్రాచుర్యాన్ని పొందడానికి పెరియాళ్వార్ల తిరుప్పల్లాణ్డు ప్రబంధం ఎక్కువ దోహదం చేసింది అనడంలో సందేహం లేదు.

కాప్పు - పల్లాణ్డు :- "పల్లాణ్డు" (మంగళాశాసనం) అనేది "కాప్పు" (కాపుదల్-రక్షణ) అని, "కాప్పిడుదల్" అని వ్యవహరింపబడుతున్నది. ప్రాచీన నాలాయిర దివ్యప్రబంధ శ్రీకోశాలలో "తిరుప్పల్లాణ్డు" అనే ప్రబంధం పేరు కింద "కాప్పు" అనే పేరు కూడా ముద్రింపబడడం గమనార్హం. శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఈ రెండు పదాలు ఒకే అర్థాన్ని ఇచ్చే పదాలుగా గ్రహింపబడుతున్నాయి. "పల్లాణ్డెన్ఱు కాప్పిడుమ్ పాన్మైయన్" అనే ఇరామానుశనూఱ్ఱన్దాది సూక్తి స్మరణీయం. ఇంతేకాక తిరుప్పల్లాణ్డులోని మొదటి పాశురం "పల్లాణ్డు" అనే పదంతో ప్రారంభమై, "ఉన్ శెవ్వడి శెవ్వి తిరుక్కాప్పు" అని పూర్తికావడం కూడా గమనించదగినది.

Scanned by CamScanner

పెరియాళ్వార్ తిరుమొళి ప్రబంధంలో రెండవ శతకంలోని- ఎనిమిదవ దశకం "కాప్పిడుదల్" (కాప్పిడల్) అనే పేరుతో వ్యవహరింపబడుతున్నది. "అళగనే ! కాప్పిడ వారాయ్" అని అంటూ యశోదాదేవి భావనతో పెరియాళ్వార్లు ఈ దశకాన్ని అనుగ్రహించారు. తిరుప్పల్లాణ్డు ప్రబంధంవలె ఈ దశకంకూడా నిత్యానుసంధేయంగా పెద్దలచే నిర్ణయింపబడి అనుసంధింపబడుతున్నది. పెరియాళ్వార్ తిరుమొళిలోని (4-2-2) పాశురంలో "తిరుమాలిరుమ్శోలై పర్వతంలో భక్తులు గానం చేసే పల్లాణ్డు అంతట వ్యాపించి ప్రతిధ్వనిస్తున్నదని"- అన్నారు. అదే ప్రబంధం లోని (5-3-3వ) పాశురంలో తిరుమాలిరుమ్ శోలైక్షేత్రంలో నివసించే కోయలు భగవానుని శ్రీచరణాలకు పల్లాణ్డు పాడుతున్నారని కూడా అన్నారు. ఇందువల్ల "పల్లాణ్డు", "కాప్పు"- అనేవి రెండు ఒకటే అని చెప్పవచ్చు- అని శ్రీనివాసన్ గారి అభిప్రాయం.

పల్లాణ్డుప్రబంధానికి సంబంధించి ప్రాచీనద్రావిడలక్షణగ్రంథాలలో ఏవిధమైన నిర్దేశం కన్పించదు. క్రీ.శ. పదవశతాబ్దకాలానికి చెందిన "పన్నిరు పాట్టియల్" అనే లక్షణ గ్రంథంలో "యాణ్డునిలై" అనే ఒక ప్రబంధ ప్రక్రియలక్షణం తెలుపబడింది. ఈ "యాణ్డునిలై" రీతిని పల్లాణ్డు ప్రబంధంగా గ్రహించవచ్చునని శ్రీ ఎం.జ్ఞానసుందరం అనే ద్రావిడసాహిత్యవిమర్శకుని అభిప్రాయం. కాని, "యాణ్డునిలై" ప్రభువుకు మంగళం పాడే రీతిలో లక్షింపబడినదే తప్ప, భగవానునకు మంగళాశాసనం చేసే ప్రబంధంగా లక్షింపబడలేదు. ఇంతేకాక, "పన్నిరు పాట్టియల్"లో "ఎళ్ళు కూఱ్ఱిరుక్కై", "పళ్ళి ఎళ్ళుచ్చి", "పాపైప్పాట్టు", "తాలాట్టు" వంటి ప్రక్రియల లక్షణనిర్దేశంకూడా కానరాదు. దీనికి తగిన కారణాలు ఏమో స్పష్టంగా తెలియడం లేదు"- అని శ్రీఎం.పి. శ్రీనివాసన్ గారు అభిప్రాయపడ్డారు.

పదహారవ శతాబ్దం తర్వాత ద్రావిడసాహిత్యంలో కుమారగురు దాసస్వామి, కురుప్పైయాప్పావలర్, తత్త్వరాయర్‌వంటి పలువురు కవులు పల్లాణ్డు ప్రబంధాలను రచించారు. ఆళ్వార్లను ఉద్దేశించి, పూర్వాచార్యులను ఉద్దేశించి రచింపబడి ఈ నాటికీ అనుసంధానంలో ఉండే వాళిత్తిరునామాలు ఈ పల్లాణ్డు ప్రక్రియలోకి చెందినవే. ఈనాటికి ఈ ప్రక్రియ కొనసాగడం విశేషం.

ఇపుడు తిరుప్పల్లాణ్డు అనే పేరును గూర్చి, ఆప్రబంధాన్ని గూర్చి సంగ్రహంగా వివరింపబడుతున్నది.

Scanned by CamScanner

## తిరుప్పల్లాణ్డు

ఈ ప్రబంధానికి తిరుప్పల్లాణ్డు అనే తిరునామం వ్యవహరింపబడడానికి గల కారణం ఏమి ? అని అంటే, ఒక్కొక్క పాశురంలోనే "పల్లాణ్డు పల్లాణ్డు" అని పల్కి, మంగళాశాసనం చేసినందువల్ల, ఆ పదాన్ని నిరూపకంగా చేసి "పల్లాణ్డు" అనే తిరునామాన్ని పెద్దలు పెట్టారు. "తిరు" అనే పదం సంస్కృతంలోని శ్రీశబ్దం వలె గొప్పతనాన్ని తెల్పుతుంది. గొప్పతనాన్ని కల్గిన మంగళాశాసనం- అని తాత్పర్యం. ఈ ప్రబంధం "పల్లాణ్డు" అనే పదంతో ప్రారంభింపబడినందువల్ల "మొదట్కు తిప్పు" అనే లక్షణప్రక్రియానుసారం "తిరుప్పల్లాణ్డు" అనే తిరునామాన్ని పొందినదని కూడా చెప్పవచ్చు. ఈ ప్రక్రియ "కణ్ణినుణ్ శిఱుత్తాంబు", "అమలనాదిపిరాన్" వంటి ప్రబంధాల నామకరణంలో కన్పిస్తుంది.

## "పల్లాణ్డు" అంటే ఏమి?

"పల్లాణ్డు" అనే పదం "పల్ + ఆణ్డు" అనే పదవిభాగాన్ని కల్గి, పలు సంవత్సరాలు- అనే అర్థాన్ని ఇస్తుంది. పలు సంవత్సరాలపాటు భగవానునకు మంగళం కలగాలి- అనేది దీని తాత్పర్యం. "సర్వదా విజయీభవ" - అని సారం.

అవాప్తసమస్తకాముడని, సర్వరక్షకుడని ప్రసిద్ధుడైన భగవానుని దర్శిస్తే మనకు కావలసిన శుభాలను ఆస్వామివద్ద ప్రార్థించి పొందవలసి ఉండగా, ఆళ్వార్లు తాము అతనికి మంగళం కలగాలని ఆశాసించడం తగునా? అని అంటే, భగవత్కృపవల్ల కల్గిన భక్తితో ఆ భగవానుని సర్వరక్షకత్వాదిగుణాలను పూర్తిగా మఱచి, "భగవానునకు ఏ కొఱత లేకుండా ఉండడమే మనకు మంగళం" అని ఈ ఆళ్వార్లు భావించి మంగళాశాసనం చేస్తున్నారు- అని గ్రహించాలి.

జ్ఞానదశ -అని, ప్రీతిదశ- అని రెండు దశలున్నాయి. వాటిలో, సర్వేశ్వరుడే రక్షకుడని, తాను అతనిచే రక్షింపబడేవాడనని ప్రణవంలో చెప్పబడే రీతిలో స్పష్టంగా గ్రహించి, అనుసంధించే దశ జ్ఞానదశ. ఆ అవస్థలో, "అణ్ణా! అడియేనిడరై క్కళైయాయే" (స్వామీ! దాసుని క్లేశాలను తీర్చు)అనే రీతిలో ప్రార్థిస్తారు. ఇక, సర్వేశ్వరుని జ్ఞానశక్తులను అన్నిటినీ మఱచిపోయి, సౌందర్య -సౌకుమార్యాదులనే అనుసంధించి, "ఇటువంటి అందమైన తిరుమేనికి ఏమి కీడు వస్తుందో ?" అనే అతిశంకను పొంది, వ్యాకులపడే దశ ప్రీతిదశ. ఆ స్థితిలో, ఈశ్వరుని రక్షించే దారిని వెదకి తడబడతారు. "పల్లాణ్డు, పోఱ్ఱి, జితమ్" అని అంటారు.

సర్వజ్ఞుడు, సర్వశక్తి అయిన భగవానునిపట్ల గల ప్రీతిచేత కలత చెంది, అతిశంకను పొందడం ఈ ఆళ్వార్ల విషయంలోనే కాక ఇంకా పలువురి విషయంలో గమనించవచ్చు (1) శ్రీరాముడు సీతాదేవిని వివాహమాడి మిథిలానగరంనుండి అయోధ్యకు తిరిగి వచ్చేటపుడు పరశురాముడు కన్పించగానే, దశరథుడు అంతకు ముందు తాను గమనించిన శ్రీరాముని పలు పలు శక్తివిశేషాలను అన్నిటిని మఱచిపోయి, శ్రీరాముని బాల్యాన్ని, సౌకుమార్యాన్ని చూచి భయపడి పరశురాముని వద్ద అభయాన్ని ప్రార్థించాడు. (2) కౌసల్యాదేవి కూడా, శ్రీరాముని ప్రభావాలను గూర్చి తెలిసినా, శ్రీరాముడు వనవాసానికి వెళ్ళేటపుడు "తత్తే భవతు మంగళమ్, తత్తే భవతు మంగళమ్" అని మంగళాశాసనాలను ఆశాసించింది. (3) దండకారణ్యవాసులైన ఋషులు తమ ఆపదలను పోగొట్టడంకోసం, అభిమతాలను అనుగ్రహించడంకోసం శ్రీరాముడు వస్తున్నాడని తెలిసినా, ఆ విషయాన్ని మఱచిపోయి, శ్రీరాముని రూపసౌందర్యంలో అభినివేశాన్ని పొంది, మంగళాశాసనాన్ని చేశారు. భగవానుని సౌందర్యసౌకుమార్యాదులు ఎటువంటి జ్ఞానులను అయినా వ్యామోహాన్ని కలుగజేసి, భయశంకను కలుగజేస్తాయి. (ఈ విధంగా పలు ఉదాహరణలను శ్రీవచనభూషణంలో గమనించవచ్చు)

సర్వరక్షకుడైన ఈశ్వరుని రక్ష్యకోటిలోనికి చేరినవానినిగాను, అతనిచే రక్షింపబడవలసిన తమను రక్షకులుగాను భావించడం మంగళాశాసనాన్ని చేసేవారికి తటస్థించినందున ఈ భావన విపరీతజ్ఞానమే కదా! "మయర్వఱ మదినలమ్" పొందినవారైన ఆళ్వార్లకు ఈ విపరీతజ్ఞానం కూడదు కదా- అని అంటే, దుష్కర్మల ఫలంగా కలిగే విపరీతజ్ఞానమే హేయం తప్ప, భగవానుని వైలక్షణ్యమూలకంగా కలిగే విపరీతజ్ఞానం హేయం కాబోదు; చాలా ఉద్దేశ్యమై ఉంటుంది- అనేది సమాధానం.

నిజానికి ఈ విపరీతజ్ఞానం పరమపదంలో కూడా ఉంటుంది. "హావు హావు హావు" అనే సామగాన ఘోషను వినే ఆదిశేషుడు ఆ సామగానఘోషను అసురులు, రాక్షసులు చేసే కోలాహలమని భ్రమించి, కోపించి నిప్పును తన నోళ్ళనుండి వెలువరిస్తున్నాడు- అని చెప్పబడింది. ఈ భావాన్ని "అజ్గు ఆరవార మదుకేట్టు అఱ్ఱలుమిఱ్ఱుమ్ పూజ్గారరవు" అని తిరుమళిశైప్పిరాన్ వ్యక్తం చేశారు. "స్నేహాదస్థాన రక్షావ్యసననిభిరభయం శార్జ్గచక్రాదిముఖ్యైః, ఆనందైకార్ణవం శ్రీర్భగవతి!

Scanned by CamScanner

యువయోరాహు రాస్థానరత్నమ్" (పూజ్యురాలా! లక్ష్మీదేవీ! పరమ పదంలో పంచాయుధాలు సైతం అస్థానే భయశంకను పొంది మంగళాశాసనం చేస్తున్నారు) అని భట్టర్‌కూడా శ్రీగుణరత్నకోశంలో అన్నారు. అందువల్ల భగవానునకు మంగళాలను ఆశాసించడం చేతనునకు స్వరూపానురూపం; నిత్యంకూడా.

మిగిలిన ఆళ్వార్లకుకూడా మంగళాశాసనంలో అభినివేశం ఉన్నా, వారికి అది ఎపుడో ఒకనాడు ఉండేదే తప్ప, ఈ పెరియాళ్వార్లకువలె నిత్యం కాదు; ముఖ్యం కాదు. వారు భగవానుని రక్షకునిగా తలచి ఆశ్రయించి, అతనివద్ద తమ శుభాలను పొందాలని కోరారు. ఈ ఆళ్వార్లు అటువంటివారు కారు. భగవానుని మంగళమే తమకు మంగళంగా తలచి, భగవానునకు ఏమి కీడు వస్తుందో ! అని చాలా భయపడి మంగళాశాసనం చేయాలని ప్రయత్నించే పరమభక్తులు. అందువల్లనే మిగిలిన ఆళ్వార్లకంటే ఎక్కువ గొప్పతనాన్ని కల్గిన కారణం కలవారైన వీరికి పెరియాళ్వార్లు అనే పేరు కల్గింది. "మఙ్గళాశాసనత్తిల్ మఱ్ఱుళ్ళ ఆళ్వార్‌కళ్ తఙ్గళార్వత్తళవుతానన్ఱి, ప్పొఙ్గుమ్ పరివాలే విల్లిపుత్తూర్ పట్టర్ పిరాన్ పెఱ్ఱాన్ పెరియాళ్వార్ ఎన్నుమ్ పెయర్" అని అంటూ ఉపదేశరత్తినమాలైలో ఈ అర్థాన్ని మణవాళ మహామునులు పలికారు.

శ్రీమన్నిగమాంతదేశికులు గోదాదేవి విషయంగా అనుగ్రహించిన గోదాస్తుతిలో పల్కిన "తాతస్తు తే మధుభిద స్తుతిలేశవశ్యాత్ కర్ణామృతై: స్తుతిశతైరనవాప్తపూర్వమ్, త్వన్మౌలిమాల్యసుభగా ముపహృత్య మాలాం లేభే మహత్తరపదానుగుణం ప్రసాదమ్" అనే శ్లోకాన్ని గమనించినపుడు, పెరియాళ్వార్ అనే బిరుదు తిరుప్పల్లాణ్డు పాడిన పొంగే భగవత్ప్రీతివల్లకాకుండా, గోదాదేవి ధరించి ఇచ్చిన పూమాలికను భగవానునకు సమర్పించినందువల్ల వారికి లభించింది- అని తెలుస్తున్నది. "మహత్తరపదమ్" అంటే- ఆళ్వార్లకు విశేషణమైన "పెరియ" అని అర్థం. పెరియాళ్వార్ అనే తిరునామానికి (మణవాళ మహామునులు అనుగ్రహించిన రీతిలో) "మఙ్గళాశాసనంలోని పొంగే ప్రీతియే కారణం"- అనేది సత్‌సంప్రదాయం; వేఱొక కారణాన్ని పల్కడం అస్వారస్యం- అని భావించియే పైన ఉదాహరించిన గోదాస్తుతి శ్లోకానికి వ్యాఖ్యానాన్ని అనుగ్రహించిన పెద్దలు "మహత్తర" అనే పదానికి నిత్యవిభూతి- అనే అర్థాన్ని గ్రహించారు - అని మహావిద్వాన్ ప్ర.భ. కాంచీ అణ్ణంగ రాచార్యస్వామి వారు అంటారు.

Scanned by CamScanner

## తిరుప్పల్లాణ్డు సూక్తులతో మిగిలిన ఆళ్వార్ల సూక్తులకు గల అర్థసామ్యాలు

1. పల్లాణ్డు పల్లాణ్డు ... ఉన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు - (తిరుప్పల్లాణ్డు-1)
   పొన్ఱ్రిరుప్పు... పోన్ఱ్రి - (తి.వా-4-5-1)
2. అడియోమోడుమ్..... పల్లాణ్డు - (తిరుప్పల్లాణ్డు -2)
   పొలిక పొలిక ... (తి.వా.-5-2-1)

వివరణం

1. తిరువాయ్‌మొఴిలోని "పొన్ఱ్రిరుప్పు" అనే దశకంలో నమ్మాళ్వార్లు ముందుగా భగవన్మంగళాశాసనం చేశారు. దీనిని అనుసరించి పెరియాళ్వార్లుకూడా తిరుప్పల్లాణ్డు ప్రబంధంలో ముందుగా మొదటి పాశురంలో భగవన్మంగళాశాసనం చేశారు.

"పొలిక పొలికా" అనే దశకంలో నమ్మాళ్వార్లు బాగవతమంగళాశాసనం చేశారు. ఇది భగవన్మంగళాశాసనానికి తరువాత చేయబడిన భాగవత మంగళాశాసనం. దీనిని అనుసరిస్తూ పెరియాళ్వార్లు తిరుప్పల్లాణ్డులోని రెండవ పాశురంలో "అడియోమోడుమ్, అఴ్రియుమ్, పాఞ్జశన్నియముమ్ పల్లాణ్డే" అని భాగవత మంగళాశాసనాన్ని చేశారు. ఈ విషయాన్ని తెలిపే ఈక్రింది ఈడు సూక్తిని గమనించండి.

"మున్బాడ భగవత్సమృద్ధిక్కు మంగళాశాసనమ్ పణ్ణి, పిన్నై భాగవత సమృద్ధిక్కు మఙ్గళాశాసనమ్ పణ్ణవేణ్డావో, పెరియాళ్వారైప్పోలే ?" ఎన్న, "అప్పడియే యన్రో శెయ్‌తతు. పొన్ఱ్రిరున్దేళులకిలే భగవత్సమృద్ధిక్కు మఙ్గళాశాసనమ్ పణ్ణినార్ కణ్డీరే ! పిన్నై ఇదిలే భాగవతసమృద్ధిక్కు మఙ్గళాశాసనమ్ పణ్ణినార్. -ఎన్ఱు జీయర్ అరుళిచ్చెయ్‌దార్. పరమాచార్యరాన ఇవరై ప్పిన్ శెన్ఱార్ ఇత్తనై కాణుమ్ పెరియాళ్వారుమ్"

2. ఎ. అప్పాఞ్జశన్నియముమ్ -(తిరుప్పల్లాణ్డు -1)
   బి. అప్పెరియవాయ కణ్‌కళ్ - (అమలనాదిపిరాన్ - 8)
   సి. అరు కాలనే - (తిరువాయ్-9-5-7)
   డి. కణమయిల్ అతు కలన్దు - (తిరువాయ్-10-3-1)

Scanned by CamScanner

వివరణం :

ఈ ప్రయోగాలలో అన్నిటిలో ప్రత్యక్షంగా ఉండే విషయాన్ని ముఖాన్ని పక్కకు తిప్పుకొని పరోక్షనిర్దేశం చేయబడింది.

ఎ. "ఉన్ శేవడి", "విన్ వలమార్పు"అని ముందు ప్రత్యక్షనిర్దేశం చేసి, తరువాత "అప్పాక్షశన్నియమ్" అని పెరియాళ్వార్లు పరోక్షనిర్దేశాన్ని చేశారు. "తన కంటి దృష్టి సోకినా దృష్టి తగులుతుంది'' అని నేరుగా చూడడానికి జంకి, ముఖాన్ని పక్కకు తిప్పుకొని ఆళ్వార్లు ఈ పరోక్షనిర్దేశాన్ని చేశారు. తిరుమేనిలోని నల్లదనం, అరచేతి లోని ఎఱ్ఱదనం, శంఖంలోని తెల్లదనం- ఈ మూడు విభిన్నవర్ణాలు కలిసినపుడు ఏర్పడిన పరభాగశోభను దర్శిస్తే దృష్టిదోషం సోకవచ్చునని ఆళ్వార్ల భావం.

బి. "అప్పెరియవాయ కణ్గళ్" -శ్రీరంగనాథుని నేత్రాలలోని భోగ్యతాతిశయం వల్ల ముఖాన్ని పక్కకు తిప్పుకొని తిరుప్పాణ్ ఆళ్వార్లు ఈ పరోక్ష నిర్దేశాన్ని చేశారు.

సి. "కాట్టేన్ నుమ్మురు"- అని ప్రత్యక్షంగా పల్కిన, తరువాత "అతు" అనే పరోక్షనిర్దేశం ముఖాన్ని ప్రక్కకు తిప్పుకొని చేయబడింది.

డి. "కణమయిల్ అవై"- నెమళ్ళు సమూహంగా ఉండి, బాధకమైనందువల్ల. దృష్టికి విషయంగా ఉండడంవల్ల ముఖాన్ని చాటు చేసికొని "అవై" అని అంటున్నారు. విశేషమేమంటే- మొదటి రెండు సూక్తులో భోగ్యతాతిశయంవల్ల పరోక్షనిర్దేశం, తరువాతి రెండు సూక్తులో బాధకత్వాతిశయంచేత పరోక్షనిర్దేశం చేయబడింది.

3. "పల్లాణ్డు పల్లాణ్డు ... ('తిరుప్పల్లాణ్డు-1)
"అమలన్ విమలన్...." (అమలనాదిపిరాన్ -1)

వివరణం :

"పల్లాణ్డు పల్లాణ్డు" ఇత్యాది సూక్తిలోని (ఒకే అర్థాన్ని ఇచ్చే) నాల్గు పదాలకు నాల్గు విధాలైన అర్థాలు తాత్పర్యరూపంగా వివరింపబడ్డాయి. మనుష్యమానంతో, దేవమానంతో, బ్రహ్మమానంతో, పలు బ్రహ్మల మానంతో నీ చరణాలకు మంగళం- అనే అర్థాలు ఆ నాల్గింటికి తెలుపబడ్డాయి.

ఇదే రీతిలో అమలనాదిపిరాన్ మొదటి పాశురంలో గల "అమలన్, విమలన్, నిమలన్, నిన్ మలన్" అనే ఒకే అర్థాన్ని ఇచ్చే నాల్గు పదాలకు భిన్నభిన్న తాత్పర్యార్థాలు తెలుపబడ్డాయి.

Scanned by CamScanner

"అమలన్" (దోషరహితుడు) - ఆళ్వార్లను తనకు దాసునిగా చేసికొన్న శుద్ధి దీనిచే తెలుపబడింది.

"విమలన్" -(దోషరహితుడు) -ఆళ్వార్లను తన భక్తులకు దాసునిగా చేసికొన్న శుద్ధి. దీనిచే తెలుపబడింది.

"నిమలన్" - (దోషరహితుడు) ఏవిధమైన సాధనానుష్ఠానాన్ని చేయకపోయినా ఆళ్వార్లను సంస్కరించిన శుద్ధి. దీనిచే తెలుపబడింది.

"నిన్మలన్" - (దోషరహితుడు) ఇంత చేసినా, అది అంతా తన ప్రయోజనంగా బావించి చేసిన శుద్ధి దీనిచే తెలుపబడింది.

ఈ విధంగా నాల్గు పదాలద్వారా విభిన్నరీతులలో భగవానుని దోషరాహిత్యం తెలుపబడింది.

4. "పల్లాణ్డు కూఱువనే- (తిరుప్పల్లాణ్డు -8)
"మజ్జైయర్.. తైయల్" (తిరువాయ్-10-3-11)

వివరణం :

"తైయల్" ఇత్యాది- సభలో అందఱు పల్కినట్లు, అందఱు ఒకేసారి పల్కితే, ఏమాట చెవిన పడదు- అని భావించిన, ఒక గోపిక (నప్పిన్నై ప్పిరాట్టివచనాలద్వారా) శ్రీకృష్ణుని పశువులను మేపడం మాని, తిరిగి రమ్మని అందఱు గోపికల ప్రతినిధిగా పల్కిన సూక్తి ఇది. అందువల్లనే "అడిచ్చియోమ్", "తొళుత్తైయోమ్" అనే బహువచనప్రయోగాలకు, "ఆళుమ్ ఎన్నారుయిర్", "ఎన్శొల్కొళ్" అనే ఏకవచనప్రయోగాలకు మధ్య అర్థవైరుధ్యం ఏమీ లేదు- అని ఈడుసూక్తి.

ఈవిధమైన వివరణమే పల్లాణ్డు ప్రబంధంలోని "పాడుదుమే", "కూఱుదుమే", "కూఱువనే" ఇత్యాది బహువచన, ఏకవచననిర్దేశాలనుగూర్చి తెలుపబడడం గమనార్హం.

5. పైన్నాకణై- (తిరుప్పల్లాణ్డు -9)
పణత్తలై - (తిరుచ్చందవిరుత్తం -15)

భగవానుని తిరుమేనిస్పర్శవల్ల వికసించిన పడగలను కల్గినవాడు, అనన్తాళ్వాన్ (ఆదిశేషుడు) - అనే విషయం "పణత్తలై" అనే తిరుచ్చన్దవిరుత్తసూక్తిలో అస్పష్టం. ఇది "పైన్నాకణై" అనే తిరుప్పల్లాణ్డు సూక్తిలో సుస్పష్టం.

Scanned by CamScanner

6. "పుళ్ళిన్ మెయ్ప్పకై" - (తిరుచ్ఛందవిరుత్తమ్ -19)
నాకప్పకై క్కొడియాన్ - (తిరుప్పల్లాణ్డు -8)

వివరణం :

"పుళ్ళిన్మెయ్ ప్పకై" - సామాన్య దృష్టితో చూస్తే గరుడునకు సహజశత్రువు అనదగిన ఆదిశేషునిపై క్షీరాబ్దిలో, ఆ ఇద్దఱు అభిలషించి అభినివేశంతో కైంకర్యాలను చేసే రీతిలో, యోగనిద్రలో భగవానుడు శయనించిన ఈ రీతి ఏమి ఆశ్చర్యం !

సహజశత్రుత్వబుద్ధి ఉండే ఈ సంసారమండలంలో ఆ ఇద్దరిని ఏకగ్రీవంగా ఉండేటట్లు చేసే ఈ నీ సర్వశక్తిని ప్రకాశింపజేయడంకోసమా! అనాదియై, అహంకారాన్ని కల్గి ఉండే చేతనుని దివ్యసూరి గోష్ఠిలో ఒకడుగా ఉండేట్లు చేస్తున్నది ఈ శక్తియే కదా! దీనినే గీతాచార్యుడు చరమశ్లోకంలో "అహమ్" అనే పదంద్వారా తెలిపాడు. ఈ విధంగా సహాశత్రుత్వాన్ని కల్గిన గరుడుడు, ఆదిశేషుడు- అనే ఇద్దఱు ఏ విధమైన వైరుధ్యం లేకుండా కైంకర్యం చేసేటట్లు ఘటింపజేసిన భగవానుని శక్తిని పెరియాఴ్వార్లు. "నాక ప్పకైక్కొడియాన్" అని అంటూ వ్యక్తం చేశారు. ఈ విషయం వ్యాఖ్యానం ద్వారా స్పష్టం.

ఈవిధమైన పరమభోగ్యాలైన అర్థసామ్యాలు పల్లాణ్డు ప్రబంధంలో ఇంకా చాలా ఉన్నా, విస్తరభీతివల్ల ఇంతటితో విరమింపబడుతున్నది.

## తిరుప్పల్లాణ్డు - వేంకటేశ్వరుడు

పొంగి పొర్లే భక్తితో భగవానునకు మంగళాశాసనాన్ని "పల్లాణ్డు పల్లాణ్డు" అని అంటూ చేసిన పెరియాఴ్వార్లు అనే తిరునామాన్ని పొందిన భట్టనాథుల విషయంలో గమనిద్దాం. ఈ ఆఴ్వార్లకుకూడా కులదైవం శ్రీవేంకటేశ్వరుడే. "శెన్నియోఙ్గు తణ్ తిరువేఙ్గడముడైయాయ్!" (పెరియా-తిరు-5-4-1) అని సంబోధించి, "ఎమ్మనా! ఎన్ కులదెయ్వమే" (5-4-3) అని పల్కడం గమనించ దగినది. "పఱవై యేఱు పరమ్పురుడా !" (5-4-2) అనే పాశుర వ్యాఖ్యలో వ్యాఖ్యాన చక్రవర్తి పెరియవాచ్చాన్పిళ్ళై, తిరువేఙ్గడముడైయాన్ గరుడవాహనాన్ని అధిరోహించి వచ్చి, పెరియాఴ్వార్లను పరమపదానికి తీసికొనిపోడంకోసం త్వరపడుతున్నాడు- అని పల్కడం కూడా గమనార్హం. ఇంతేకాక "పెరుమ్ పదమాకిన్టదాల్" (5-4-2) అనే సందర్భంలో "పెరుమ్ పదమ్" అనేదానికి "పెరియతరమ్" అనే అర్థాన్ని అనుగ్రహించి, దానిని "మేల్ శాత్తుమ్ పెరియట్టముమ్ పెఱ్ఱు, తిరుప్పొలిన్ద

శేవడి తన్ శెన్నియన్ మేల్ పాతిక్కప్పెఱ్ఱు త్తిరుప్పల్లాణ్డు పాడినపడి" అని వ్యాఖ్యాత వివరించారు. ఇందువల్ల పెరియాళ్వార్లు పాండ్యరాజ్యంలో పరతత్త్వ నిర్ణయం చేసి, వాదశుల్కధనాన్ని పొందిన వెంటనే భద్రగజాన్ని అధిరోహించి, ఊరేగింపుగా వీథులలో వేంచేయడాన్ని చూచి సంతోషించి, మధురానగరంలో ఆకాశంలో ప్రత్యక్షమైన గరుడవాహనారూఢుడు స్వామి శ్రీవేంకటేశ్వరుడేనని పూర్వోదాహృత ప్రమాణాలవల్ల, వివరణంవల్ల స్పష్టం. ఆ శ్రీవేంకటేశ్వరునకే పెరియాళ్వార్లు మొట్టమొదటగా "పల్లాణ్డు పల్లాణ్డు" ఇత్యాదిగా మంగళాశాసనం చేసినట్లుగా పెరియవాచ్చాన్‌పిళ్ళై స్పష్టీకరించారని అనడం యుక్తం. ఇంతేకాక, పల్లాణ్డు ప్రబంధంలోని మొదటి పాశురంలో గల "మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణా !" అనేది శ్రీవేంకటేశ్వరుని ఉద్దేశించి చేసిన సంబోధనే - అనే అంశాన్ని నిరూపించ డానికి పలు ప్రమాణాలున్నాయి. వాటిలో కొన్నిటిని మాత్రం గమనిద్దాం.

పాశురంలో "మణివణ్ణన్" అని నిర్దేశింపబడినవాడు శ్రీవేంకటేశ్వరుడే. పెరియాళ్వార్ల పుత్రిక గోదాదేవి నాచ్చియార్ తిరుమొழி మొదటి దశకంలోని మొదటి పాశురంలో వేతెవ్వరినీ ప్రస్తావించకుండా "వేఙ్గడవఱ్కెన్నై విదిక్కిఱ్ఱియే" (1-1) అని, "వేఙ్గడవాణనెన్నుమ్ విళక్కినిల్ పుక వెన్నై విదిక్కిఱ్ఱియే" (1-3) అని శ్రీవేంకటేశ్వరుని రెండుమార్లు ప్రస్తావించి ఆ దశకంలోని చివరి పాశురంలో "మణివణ్ణఱ్కెన్నై వకుత్తిడు" అని ఆ స్వామియే మణివర్ణుడని పల్కి ముగించడాన్ని గమనించవచ్చు. పెరియాళ్వార్లు "శెన్నియోఙ్గు తణ్ తిరువేఙ్గడముడైయాయ్!" (పెరియా-తిరు- 5-4-1) అని సంబోధించి, అతనినే "మరుప్పొశిత్త మల్లడర్త్తాయ్" (5-4-7) అని సంబోధించి, అతడే మల్లులను సంహరించాడని అనడంకూడా గమనించాలి.

నమ్మాళ్వార్లు, వేఱు ఏ మూర్తినిగూర్చిన ప్రస్తావన లేని "శార్వే తవనెఱి" (తిరువాయ్-10-4) అనే దశకంలో "మలైమేల్ తాన్ నిన్ఱు ఎన్ మనత్తుళ్ ఇరున్దానై" అని అంటూ తిరువేఙ్గడముడైయాన్‌నుగూర్చి పల్కి, అతనినే చివరలో "మల్‌తిణ్డోళ్‌మాలై" అని, "మాలుక్కు" (6-6) అనే దశకంలో "మట్పొరు తోళుడైయాయ పిరాన్" అని పల్కి, చివరలో "కట్టెழிల్ శోలై నల్ వేఙ్గడవాణనై" అని అంటూ అతడు శ్రీవేంకటేశ్వరుడేనని తెలుపడంకూడా గుర్తించదగినది.

తిరుమంగై మన్నన్ కూడా "మల్లార్ తోళ్ వడవేఙ్గడవనై వరచ్చొల్లాయ్ పైఙ్కిళియే!" (పెరియ.తిరు-10-10-5) అని, "విల్లార్ మలి వేఙ్గడమామలై మేయ

మల్లార్ తిరడోళ్ మణివణ్ణనమ్మానై" అని అంటూ పల్లాణ్డులోని "మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణన్" శ్రీవేంకటేశ్వరుడేనని తెలుపడం దీనిని బలపరుస్తుది. ఇంతేకాదు, ఆ ఆళ్వార్లు పెరియతిరుమొழி ప్రబంధంలోని "మానమరు మెన్నోక్కి" (11-5) అనే దశకంలో "వెళ్ళత్తాన్ వేఙ్గడత్తానేలుమ్ కలికన్ఱి యుళ్ళత్తినుళ్ళే యుళన్" అని శ్రీవేంకటేశ్వరుని ప్రస్తావించి, "ఇరున్దమిழ்నూల్ పులవర్" అయిన ఆ ఆళ్వార్లకు "ఉలకముణ్డ పెరువాయన్" శ్రీవేంకటేశ్వరుడేనని మనస్సులో తోచడంవల్ల, ప్రళయ కాలంలో లోకాలను గ్రసించి తన బొజ్జలో పెట్టుకొన్న వృత్తాంతాన్ని విస్తృతంగా కీర్తించి, 'మైన్నిన్ఱ కరుఙ్కడల్వాయ్" (11-6) అనే దశకంలో "మల్లాణ్డ తడక్కైయాల్ పకిరణ్డ మకప్పడుత్త కాలత్తు" అని శ్రీవేంకటేశ్వరునియొక్క మల్లులను నిరసించిన బలిష్ఠబాహువులనుగూర్చి ప్రస్తావించారు. అయితే, ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు. ఈ దశకంలో- "కణ్ణాళన్ కణ్ణమఙ్గై నకరాళన్" (7) అని తిరుక్కణ్ణ మఙ్గైలోని స్వామినిగూర్చి ప్రస్తావించడంవల్ల మల్లులను నిరసించిన దృఢమైన బాహువులను కలవానినిగా ఆ స్వామిని కీర్తించినట్లు చెప్పవచ్చుకదా!- అన్నది ఆ సందేహం. దీనికి సమాధానం ఏమంటే- శ్రీవేంకటేశ్వరునితో తిరుక్కణ్ణ మఙ్గైలోని స్వామికి గల ఏదో, ఆళ్వార్లు మాత్రం తెలిసిన, ఒక సామ్యాన్ని పురస్కరించుకొని "మైన్నిన్ఱ" దశకంలో తిరుక్కణ్ణమఙ్గై స్వామిని ప్రస్తావించారు- అని భావించాలి. ఈ విధంగా సామ్యం లేకపోతే, "ఒరునల్ శుఱ్ఱమ్" (10-1) అనే దశకంలో "కరునెల్శూழ் కణ్ణమఙ్గైయుళ్ కాణ్డుమే" (10-1-1) అని పల్కిన వెంటనే, "పొన్నై మామణియై అణియార్న్ద తోర్ మిన్నై వేఙ్గడత్తుచ్చియిల్ కణ్డు పోయ్" (10-1-2) అని శ్రీవేంకటేశ్వరుని ఆళ్వార్లు ప్రస్తావించి ఉండరుకదా !

దీనినిబట్టి పల్లాణ్డుప్రబంధంలో పెరియాళ్వార్లు "మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణా! ఉన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు" అని మంగళాశాసనం చేయడం- శ్రీవేంకటేశ్వరుని గూర్చే- అనే విషయం చక్కగా ద్రఢీకరింపబడింది కదా!

### నాలాయిరదివ్యప్రబంధవ్యాఖ్యానాలు :

నాలాయిరదివ్యప్రబంధాలలో కొన్నిటికి మాత్రం వ్యాఖ్యానాన్ని అనుగ్రహించిన వారు- తిరుక్కురుకై ప్పిరాన్పిళ్ళాన్, నఞ్జీయర్, నమ్పిళ్ళై (వడక్కు త్తిరువీదిప్పిళ్ళై) అழகియ మణవాళచ్చీయర్, తిరువాయ్మొழிప్పిళ్ళై, మణవాళ మహామునులు, అప్పిళ్ళై, పిళ్ళైలోకమ్జీయర్ - అనే పూర్వాచార్యులు. నాలాయిర దివ్యప్రబంధాలకు అన్నిటికి పూర్తిగా వ్యాఖ్యానాన్ని అనుగ్రహించినవారు అభయప్రదరాజులు,

Scanned by CamScanner

పరమకారుణికులైన పెరియవాచ్చాన్‌పిళ్ళై ఒక్కరే. పెరియాఴ్వార్ తిరుమొఴికి పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యానంలో 400 పాశురాలకు గల వ్యాఖ్యానభాగం కాలక్రమంలో లుప్తమైనందువల్ల, ఆ భాగానికి మణవాళ మహామునులు వ్యాఖ్యానాన్ని కృపజేశారు.

కొన్ని ప్రబంధాలకు (వడకలై సంప్రదాయానికి చెందిన), పెరియ పరకాల స్వామి, వేదాంత రామానుజస్వామి, రంగరామానుజస్వామి మొదలైన పూర్వాచార్యులు సంక్షేపంగా వ్యాఖ్యానాలను అనుగ్రహించారు. ఈ పూర్వాచార్య వ్యాఖ్యానాలలో దేనిలోను తమిళభాషకు సంబంధించిన ఇలక్కణాన్ని (లక్షణం) అనుసరించిన వివరం, విచారం కన్పించదు. 20వ శతాబ్ది ప్రారంభంలో మహావిద్వాన్ కాంచీప్రతివాదిభయంకరమ్‌అణ్ణంగరాచార్యస్వామివారు పూర్వాచార్యవ్యాఖ్యానాలను అనుసరిస్తూ రచించిన దివ్యార్థదీపిక అనే వ్యాఖ్యలో ద్రావిడ లక్షణవిచారంకూడా చేశారు.

పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానశైలి - పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానం "నామూలం లిఖ్యతే కించిత్ నానపేక్షితముచ్యతే" అనే రీతిలో అన్యూనానతిరిక్తంగా ఉంటుంది. అద్వితీయ వైభవాన్ని కల్గిన ఈ వ్యాఖ్యనుగూర్చి ఒకటి రెండు అంశాలు విన్నపింపబడుతున్నాయి.

నాలాయిర దివ్యప్రబంధ వాఙ్మయం ముదలాయిరమ్, పెరియతిరుమొఴి, ఇయఱ్పా, తిరువాయ్‌మొఴి- అనే నాల్గు విభాగాలుగా వర్గీకరింపబడింది. వీటిలో తిరువాయ్‌మొఴి తప్ప మిగిలిన మూడు విభాగాలు కొన్ని ప్రబంధాల సంకలన రూపాలు. ముదలాయిరం అనే ప్రథమవిభాగం తిరుప్పల్లాణ్డు ప్రబంధంతో ఆరంభమై, పెరియాఴ్వార్ తిరుమొఴి, తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొఴి, పెరుమాళ్ తిరుమొఴి, తిరుచ్చందవిరుత్తమ్, తిరుమాలై, తిరుప్పళ్ళి ఎழுచ్చి, అమలనాదిపిరాన్, కణ్ణినుణ్ శిఱుత్తామ్బు- అనే క్రమంలో 9 ప్రబంధాలను కల్గి ఉన్నది. ఈ విధమైన కూర్పును చేసిన పూర్వాచార్యులు, శ్రీమన్నాథమునులు.

నాథమునులచే ఈ ప్రబంధాల కూర్పు యాదృచ్ఛికంగా చేయబడలేదు. దీనికి చక్కని సాంప్రదాయికమైన హేతువు ఉన్నది. దివ్యప్రబంధాలు అన్నీ రహస్యత్రయార్థ ప్రతిపాదకాలని పూర్వాచార్యుల సిద్ధాంతం. మంత్రరాజమనబడే అష్టాక్షరి, మంత్రరత్నమనబడే ద్వయం, శ్రీకృష్ణచరమశ్లోకం- అనేవి ఈ మూడు రహస్యాలు. వీటి అర్థాన్ని నాలాయిర దివ్యప్రబంధవాఙ్మయం క్రమంలో

Scanned by CamScanner

అనుసంధిస్తున్నదని శిష్టసంప్రదాయం. మొదటి రహస్యమైన అష్టాక్షరి -ప్రణవం, నమస్సు, నారాయణాయ- అనే మూడు పదాల సమాహారం. ముదలాయిరం అనే ప్రథమసహస్రం ఆరంభంలో గల తిరుప్పల్లాణ్డు ప్రబంధం- ప్రణవార్థాన్ని ప్రతిపాదించగా, చివరలోగల కణ్ణినుణ్ శిఱుత్తామ్బు తప్ప మిగిలిన ముందున్న ప్రబంధాలు ఈ అర్థాన్ని మఱింత విశదం చేస్తున్నవి. నమశ్శబ్దార్థాన్ని కణ్ణినుణ్ శిఱుత్తామ్బు, "నారాయణాయ" అనే పదంయొక్క అర్థాన్ని ద్వితీయ సహస్రమైన పెరియతిరుమొழி, ద్వయార్థాన్ని తిరువాయ్మొழி, చరమశ్లోకార్థాన్ని ఇయఱ్పా అనుసంధిస్తున్నాయి. ఈవిధంగా, నాలాయిర దివ్యప్రబంధవాఙ్మయం రహస్య త్రయార్థాన్ని సాకల్యంగా అనుసంధిస్తున్నదని పూర్వాచార్యుల అభిప్రాయం. పెరియతిరుమొழி పెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యానానికి పూర్వులు ఒకరు రచించిన అరుంబదంలో పెరియతిరుమొழி ప్రబంధం అష్టాక్షరిలోని తృతీయపదార్థాన్ని ("నారాయణాయ"అనే పదం యొక్క అర్థాన్ని) ప్రతిపాదిస్తున్న దని తెలుపడం పై సమన్వయానికి ఒక ప్రమాణం. తిరువాయ్మొழி ప్రబంధం పూర్తిగా ద్వయార్థ ప్రతిపాదకమనే విషయం సుప్రసిద్ధమే కదా!

ఈ క్రమాన్నిబట్టి చూచినపుడు, తిరుప్పల్లాణ్డు ప్రబంధంలో ప్రణవార్థం అనుశీలింపబడినది అని తెలుస్తున్నది. ప్రణవంలో ప్రతిపాదింపబడిన అర్థమేమి? అనే విషయాన్నిగూర్చి అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అనే ఆచార్యవర్యులు ప్రమేయసారమనే ప్రబంధంలోని మొదటి పాశురంలో తెల్పుతూ "అవ్వానవర్క్కు మవ్వానవరెల్లామ్ ఉవ్వానవర్ అడిమై ఎన్ఱురైత్తార్" (అకారవాచ్యుడైన శ్రీమన్నారాయణునకు మకారవాచ్యులైన జీవులు శేషభూతులని ఉకారశబ్దవాచ్యులైన ఆచార్యులు పలికారు) అని అన్నారు. అందువల్ల ప్రణవంలో ప్రతిపాదింపబడిన ప్రధానమైన అర్థం- జీవులంతా భగవానునకు శేషభూతులని. శేషత్వ-దాసత్వాలు పర్యాయపదాలైనా, శేషత్వం చేతనాచేతనసాధారణం కాగా, దాసత్వం చేతనా సాధారణధర్మం. అందువల్ల దాసత్వం ప్రకృతంలో వివక్షితం. ఈ దాసత్వానికి సార్థక్యం- స్వరూపానురూపమైన కైంకర్యాన్ని చేసినపుడే కల్గుతుంది. దాసభూతుడు చేసే ఈ కైంకర్యం శేషికి అతిశయాన్ని (ముఖవికాసాన్ని - ఆనందాన్ని) కల్గించేదై ఉండాలి. అటువంటి స్వరూపానురూపమైన, శేషికి అతిశయాన్ని కల్గించే ప్రధాన కైంకర్యం మంగళాశాసనమే కదా. పరమపదంలో కూడా నిత్యముక్తులు చేసేది "విషన్యవః జాగృవాంసః" అని, "ఘూழన్దు ఇరున్దు ఏత్తువర్ పల్లాణ్డే" అని భగవానుని

మంగళాశాసనమే కదా ! ఈ మంగళాశాసనమే పల్లాణ్డు ప్రబంధంలోని ప్రమేయం కనుక, ఈప్రబంధం ప్రణవార్థప్రకాశకమనే విషయం సుస్పష్టం. ఈ విషయాన్ని పరమకారుణికులైన పెరియవాచ్చాన్‌పిళ్ళై పల్లాణ్డు ప్రబంధానికి అనుగ్రహించిన అవతారిక చివరలో "శేషిశేషిభావజ్ఞానసమనంతరమ్, శేషిక్కు అతిశయత్తై విళైక్కై శేషభూతనుక్కు స్వరూపమాకైయాలే, తద్విషయమాక మంగళాశాసనమ్ పణ్ణుకై చైతన్యకృత్యమ్. అన్ద శేషత్వకాష్ఠైయావతు- తన్నై అఴియమాటియేయాకిలుమ్ స్వామిక్కు సమృద్ధియై ఆశాసిక్కైయిటే. వేదాన్తతాత్పర్యమితే ఇత్తిరుప్పల్లాణ్డిల్ ప్రతిపాదిక్కప్పడుకిఱతు"అని అంటూ స్పష్టం చేశారు. ఇంతేకాక, పల్లాణ్డు ప్రబంధంలోని మొదటి పాశురంలో గల "అడియోమోడుమ్" అనే పదం అర్థత: ప్రణవాన్ని తెల్పుతున్నదనే విషయాన్ని "అడియోమోడుమ్ -ఎన్గిఱ విడత్తాలే- ప్రణవార్థత్తై చ్చొల్లిఱ్ఱు" అనికూడా విశదీకరించడం గమనార్హం. ఈవిధంగా తిరుప్పల్లాణ్డు ప్రణవార్థప్రకాశకమైనందువల్ల ఇది ప్రణవస్థానీయం. "బ్రహ్మణః ప్రణవం కుర్యాదాదావంతే చ సర్వదా, స్రవత్యనోంకృతం పూర్వం పరస్తాచ్చ విశీర్యతే" అనే రీతిలో ప్రణవం వేదాధ్యయనప్రారంభసూక్తులలో అనుసంధింప బడేటట్లే, ఈ ప్రబంధం దివ్యప్రబంధాధ్యయనారంభంలో, చివరలో అనుసంధింప బడే సంప్రదాయాన్ని పూర్వాచార్యులు ఏర్పరచారు. (పల్లాణ్డు ప్రబంధానికి, ప్రణవానికి ఇంకోరీతిలోని సామ్యంకూడా ఉన్నది. ప్రణవం మంగళాత్మకం. "ఓంకారశ్చాథశబ్దశ్చౌ మాంగలికౌ" అనే రీతిలో ప్రణవం, "అథ" అనే శబ్దం మంగళాత్మకశబ్దాలు. పల్లాణ్డు ప్రబంధంకూడా మంగళాత్మకమే కదా!) దీనినిగూర్చి శ్రీమణవాళమహామునులు ఉపదేశరత్తినమాలైలో- "కోదిలవామ్మాఴ్వార్‌కళ్ కూఱుకలైక్కెల్లామ్ ఆది తిరుప్పల్లాణ్డానదువుమ్- వేదత్తుక్కు ఓమెన్ను మదుపోల్ ఉళ్ళదుక్కెల్లామ్ శురుక్కాయ్ తాన్ మఙ్గలమాదలాల్" అనే పాశురంలో తెలియ జేశారుకదా!

పల్లాణ్డు ప్రబంధవ్యాఖ్యానావతారికలో భక్తుడు భగవానునకు మంగళా శాసనం చేయడంలోని సామంజస్యాన్నిగూర్చి పెరియవాచ్చాన్‌పిళ్ళై చాలా విస్తృతంగా చర్చించి, సప్రమాణంగా, సోదాహరణంగా నిరూపించారు. ఈ వ్యాఖ్యానాన్ని శబ్దతః, అర్థతః అనుసరిస్తూ అనంతరకాలీయులైన శ్రీపిళ్ళైలోకా చార్యులవారు శ్రీవచన భూషణదివ్యగ్రంథంలోని మంగళాశాసనప్రకరణంలోని సూత్రాలను రచించారు. ఈ విధంగా పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానం తదనంతరకాలానికి చెందిన ఆచార్యులకు ఎంతో మార్గదర్శకమైనది. పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానంలో ఉండే

Scanned by CamScanner

ఇంకా పలు విశేషాలు ప్రస్తావనార్హాలే అయినా, విస్తరభీతిచేత ఏతావన్మాత్రంతో విరమింపబడుతున్నది.

**అరుంబదవివరణం :-**

ఈ వ్యాఖ్యానానికి పూర్వాచార్యులొకరు రచించిన చక్కని అరుంబద వివరణం ఉన్నది. దీనిలో పలు విశేషాంశాలు గోచరిస్తాయి. ఇతఃపూర్వం విన్నపించినట్లుగా పెరియవాచ్చాన్‌పిళ్లై వ్యాఖ్యానసూక్తులకు, ముముక్షుప్పడి, శ్రీవచనభూషణ గ్రంథంలోని సూత్రాలకు మధ్య గల సంబంధం ఈ అరుంబదంలో సూచింపబడింది. (ఉదా :- 6వ పాశురంలోని "ఏఱ్ఱప్పడికాల్" అనే ప్రయోగాన్ని వివరించే "విద్యాసన్తానత్తిలుమ్" ఇత్యాది వాక్యం శ్రీవచనభూషణంలోని "బ్రాహ్మణ్యమ్ విలై శెల్లుకిఱతు" ఇత్యాది చూర్ణికకు మూలం.) ఈ అరుంబదం రచింపబడిన సమయానికే పెరియవాచ్చాన్‌పిళ్లై వ్యాఖ్యానంలో పలు పాఠాంతరాలు ఏర్పడ్డాయి. వాటినికూడా అరుంబదకారులు ప్రస్తావించి, వివరించారు. (ఉదాహరణకు 5వ పాశురంలోని "అతిపతి" అనే పదాన్ని వివరించే వ్యాఖ్యానంలోని పాఠభేదాలు).

ఇందులో పలుచోట్ల అద్భుతమైన వివరణలు గోచరిస్తాయి. 10వ పాశురంలోని "ఉన్దనక్కు అడియోమ్ ఎన్ఱెన్ఱుత్తుపట్ట" అనే సూక్తిని వివరిస్తూ పెరియవాచ్చాన్‌పిళ్లై "అడియోమ్" - ఎన్గిఱ అర్థత్తుక్కు వాచకమానశబ్దత్తిలే ఎఴ్గళుక్కు అన్వయముణ్డు" అని పల్కిన వివరణాన్ని అరుంబదం విశదం చేసిన తీరును గమనించండి. ("వాచకమానశబ్దమ్"- ఎన్గతు ప్రణవమ్. ఇతు "అడియోమ్" ఎన్గిఱ. అర్థత్తై చ్చొల్లుకైయావతు- "అడియోమ్ ఎన్గిఱ పదమ్ ప్రతియోగిసాపేక్షకమాకైయాలే- అకారార్థత్తైయుమ్, "సర్వం వాక్యం సావధారణమ్" ఎన్గిఱ న్యాయత్తాలే ఉకారార్థత్తైయుమ్, ఇతుక్కు ప్రవృత్తినిమిత్తమ్ దాస్యమాకైయాలే చతుర్థ్యర్థత్తైయుమ్, అస్మచ్ఛబ్దపర్యాయతయా ప్రత్యగర్థబోధకమాకైయాలే మకారార్థత్తైయుమ్, ఇతిల్ బహువచనత్తాల్ అతిల్ జాత్యభిప్రాయకత్వత్తైయుమ్ కాట్టక్కడవదాయిరుక్కై. వాచకమెన్గతు- ప్రణవత్తుక్కు జీవప్రాధాన్యమ్ శాబ్దమాకైయాలే. ("వాచకమానశబ్దమ్"- అంటే ప్రణవం. ఇది "అడియోమ్" అనే దాని అర్థాన్ని గూర్చి పల్కడం అంటే- "అడియోమ్" అనే పదం దాసులనే అర్థాన్ని తెల్పుతున్నది కనుక, ఎవరికి దాసులు? అనే ప్రతియోగిశబ్దాన్ని ఇది అపేక్షిస్తున్నది. కాబట్టి, భగవానునకు దాసులు అని స్ఫురించే సమాధానాన్నిబట్టి భగవద్వాచకమైన అకారార్థాన్ని, "సర్వం వాక్యం సావధారణమ్" అనే న్యాయంవల్ల ప్రణవంలోని ఉకారంయొక్క అర్థాన్ని, "అడియోమ్" అనే పదవ్యవహారానికి, ప్రవృత్తినిమిత్తం దాస్యం కనుక, ప్రణవంలో

Scanned by CamScanner

ఆ దాస్యాన్ని తెలిపే అకారం పైనచ్చి లోపించిన చతుర్థీవిభక్తియొక్క అర్థాన్ని, "అడియోమ్" (దాసులము) అనే పదం - అస్మచ్ఛబ్దానికి (మేము అనే అర్థాన్ని ఇచ్చే అస్మచ్ఛబ్దానికి) పర్యాయం అయినందున ప్రత్యగర్థ (జీవ) బోధకం కనుక మకారంయొక్క అర్థాన్ని, "అడియోమ్" అనే పదం బహువచనంలో ఉన్నది కనుక, జీవుల బహుత్వాన్ని, జాతిని తెలుపగల్గినదై ఉన్నది. "వాచకమ్" అని అనడం- ప్రణవానికి జీవప్రాధాన్యం శాబ్దం కనుక. భగవత్ప్రాధాన్యం ఆర్థికం. ఇటువంటి విశేషమైన వివరణాలు ఇందులో చాలా ఉన్నాయి. పెరియవాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యలోని గాంభీర్యాన్ని నిరూపిస్తూ పలు జిజ్ఞాసుప్రశ్నలను లేవనెత్తి వాటికి సమాధానం చెప్తూ అరుంబద కారులు చేసిన పలు వివరణాలు, శ్రీభాష్య సూక్తిగాంభీర్యాన్ని నిరూపించే శ్రుతప్రకాశికాకారుల వివరణాలను స్మరింపజేస్తాయి.

## శ్రీపిళ్ళైలోకమ్‌జీయర్ తనియన్ వ్యాఖ్యానం :

నాలాయిరదివ్యప్రబంధాలకు అన్నిటికీ రహస్యవ్యాఖ్యానాలను అనుగ్రహించిన పెరియవాచ్చాన్పిళ్ళై ఎందువల్లనో ఆ ప్రబంధాల తనియన్‌లకుగాని, ఇరామానుశ నూత్తన్దాది ప్రబంధానికి గాని వ్యాఖ్యానాన్ని ప్రసాదించలేదు. ఈ కొఱతను తీర్చినవారు మణవాళమహామునుల కాలానికి పిమ్మట అవతరించిన శ్రీపిళ్ళైలోకమ్ జీయర్. వీరు శ్రీపిళ్ళైలోకార్యజీయర్ అనే పేరుతో కూడా వ్యవహరింపబడు తున్నారు. తిరుప్పల్లాణ్డు ప్రబంధతనియన్ శ్లోకానికి, పాశురాలకు శ్రీపిళ్ళైలోకమ్ జీయర్ రచించిన వ్యాఖ్యానం చాలా అందమైనది. ఆ కాలానికే తనియన్ పాశురంలో పాఠభేదాలు ఏర్పడినట్లు వీరి వ్యాఖ్యనుబట్టి తెలుస్తున్నది. "ఈణ్డియ శఙ్గమెడుత్తూద", "ఈణ్డియ శఙ్గమెడుత్తోద" ఇత్యాదులు ఇందుకు ఉదాహరణాలు.

## ప్రకృతముద్రణముగూర్చి

నాలాయిరదివ్యప్రబంధాలకు పూర్వాచార్యులు అనుగ్రహించిన వ్యాఖ్యానాలను చిరకాలంగా మహనీయులైన మనకు ముందున్నవారు ఎంతో శ్రమతో తాళపత్రగ్రంథరూపంలో రక్షిస్తూ వచ్చారు. కాగితం తయారీ, ముద్రణ యంత్ర నిర్మాణం, ముద్రణ (మొదలైన) సౌకర్యాలు ఏర్పడిన తరువాత పలువురి ధార్మికుల ఔదార్యంతో, పండితులు పలువురి ప్రయత్నంతో వ్యాఖ్యానాలు, పూర్వాచార్య గ్రంథాలు చాల వరకు ముద్రింపబడ్డాయి. (ఇంకా కొన్ని తాళపత్ర గ్రంథాలయాలలో అముద్రితాలుగా వెలుగుకోసం ఎదురుచూస్తున్నాయి కూడా) పెరియవాచ్చాన్పిళ్ళై వ్యాఖ్యానంతో, అరుంబదంతో పాటు 107 సంవత్సరాలకు పూర్వం 1907లో

Scanned by CamScanner

ప్లవంగనామ సంవత్సరంలో చెన్నపట్టణం, శ్రీవైష్ణవ గ్రంథముద్రాపకసభ ద్వారా. శ్రీగీతాచార్యముద్రాక్షర శాలలో ముద్రింపబడ్డ శ్రీకోశప్రతులు. అంతకుముందు 1870 వ సం. ప్రాంతంలో ప్రమోదూత సంవత్సరంలో వేదాంతవిద్యాముద్రాక్షర శాలలో ముద్రింపబడ్డ శ్రీకోశం ప్రతులు ఏవీ ఈ నాడు దుర్లభాలు; దొరికినా ఉపయోగపడే స్థితిలో లేవు. అందువల్ల తిరుప్పల్లాణ్డు వ్యాఖ్యానాన్ని, అరుంబదాన్ని మళ్ళీ ముద్రించవలసిన అవశ్యకత ఏర్పడింది. ఈ అవశ్యకతను గుర్తించి తమ పవిత్రద్రవ్యంతో ముద్రణను చేసిన శ్రీమాన్ నాగులకొండ సింగరయ్య, శ్రీమతి రాజమ్మ (తల్లమ్మ) దంపతులు ధన్యులు.

ప్రతిఏడు విజయనగరంలో జరిగే కీర్తిమూర్తులు ఉవే. శ్రీమాన్ కందాళ వేంకటాచార్యస్వామివారి తిరునక్షత్రమహోత్సవసందర్భంగా నిర్వహింపబడే ఉభయవేదాంత పండిత సభలలో ఒక సాంప్రదాయిక గ్రంథం ముద్రింపబడడం, ఆసక్తి కలవారికి దానిని అందివ్వడం జరుగుతున్నది. ఈ సత్కార్యాన్ని నిర్విఘ్నంగా, పెద్దల ప్రశంసలు అందుకొనే రీతిలో విజయనగరంలోని త్రైవర్ణికవైష్ణవ రామానుజ కూటం సభ్యులు అందరు కలసి నిర్వహించడం అందరికీ సువిదితమే. శ్రీమాన్ వేంకటాచార్యస్వామివారిపట్ల, వారి కుటుంబసభ్యులపట్ల త్రైవర్ణిక రామానుజ కూటం సభ్యులు చూపే గౌరవం, ఆదరం అసాధారణం. వారి ఆచార్యభక్తిని, చరమపర్వనిష్ఠను నేను మనసారా అభినందిస్తున్నాను. ఈ ఏడు జూలైనెలలో జరుగబోయే శ్రీకందాళ వేంకటాచార్యస్వామివారి తిరునక్షత్రోత్సవజ్ఞాపికగా తిరుప్పల్లాణ్డు వ్యాఖ్యానం, తెనుగు అనువాదంతోపాటు, అరుంబదంతోపాటు ముద్రింపబడడం హర్షణీయం. ఈ సత్కార్యాన్ని తమ పవిత్రద్రవ్యంతో నిర్వహిస్తున్న భాగ్యశాలురు, భగవద్భాగవతాచార్యకైంకర్యనిష్ఠులు శ్రీమాన్ నాగులకొండ శింగరయ్య, శ్రీమతి రాజమ్మ (తల్లమ్మ) దంపతులను హార్దంగా అభినందిస్తూ, వారికి సకలశ్రేయస్సుల అభివృద్ధి ఇబ్బడి ముబ్బడిగా కలగాలని మంగళాశాసనం చేస్తున్నాను. ఈ ఏడు త్రైవర్ణికరామానుజ కూట భవనం పునర్నిర్మింపబడింది. అభినవమైన తేజంతో అందంగా వెలిగే ఈ రామానుజ భవనంలో ఉభయవేదాంత పండితసభలు మొట్టమొదటగా జరుగుతున్న ఈ శుభవేళలో మంగళాశాసనాత్మకమైన తిరుప్పల్లాణ్డు ప్రబంధం ప్రకాశింప జేయబడడం చాలా సందర్భోచితం. "మంగళాదీని.... ప్రథంతే" కదా. తిరుప్పల్లాణ్డు ప్రబంధానికి పెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యానాన్ని ఆంధ్రీకరించవలసినదిగా నన్ను ప్రోత్సహించిన శ్రీమతి జానకమ్మ, శ్రీమతి

హరిప్రియ, శ్రీమాన్ శార్ఙ్గపాణి, శ్రీమతి సౌమిత్రిగార్లకు ధన్యవాద సమర్పణను చేసికొంటున్నాను. నా అనువాదప్రయత్నాన్ని ఆమోదించి ఆశీర్వదించి, తగిన మార్గదర్శనాన్ని చేసిన జ్ఞానవయోవృద్ధులు, అస్మత్ పితృచరణులు, న్యాయ వేదాంతవిద్వాన్ ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగాచార్యస్వామివారి సన్నిధిలో సప్రశ్రయంగా సాష్టాంగదండప్రమాణాలను చేసికొంటున్నాను. నా అనువాదాన్ని కటాక్షించి మంగళాశాసనాలను అందించిన పండితరత్న, ఉభయవేదాంత వాచస్పతి, ఉ. వే. శ్రీమాన్ కిడాంబి వేంకటాచార్యస్వామివారి సన్నిధిలో, పండితరత్న, సువచః శ్రీవల్లభ, వాచస్పతి, ఉ.వే. శ్రీమాన్ డా॥ టి.పి. శ్రీరామచంద్రాచార్య స్వామివారి సన్నిధిలో, పండితరత్న, శాస్త్రవిద్వన్మణి, శాస్త్రరత్నాకర, ఉ.వే. శ్రీమాన్ డా॥ ఎస్. వి. రంగరామానుజాచార్య స్వామివారి సన్నిధిలో సవినయంగా కార్తజ్ఞ్య నివేదనాన్ని చేసికొంటున్నాను. సకాలంలో డి.టి.పి. చేసి ఉపకరించిన శ్రీమతి జయలక్ష్మిగారికి, శ్రీ చంద్రశేఖర్‌గారికి, ముద్రణకార్యాన్ని అందంగా నిర్వహించిన సి.ఎన్. ప్రింటర్స్ శ్రీహర్షవర్ధన్‌గారికి హార్దిక కృతజ్ఞతలు. చివరగా, అనువాదంలో నా అనవధానతవల్ల, అజ్ఞానంవల్ల దొర్లిన తప్పులను మన్నించవలసినదిగా విజ్ఞులు, సహృదయులైన పాఠకులను వినయంగా ప్రార్థిస్తున్నాను. స్వస్తి.

జయతు జయతు సూరిః విష్ణుచిత్తో మహాత్మా
జయతు జయతు సూక్తిః మంగళాశాస్తిరస్య ।
జయతు జయతు నిత్యం కృష్ణసూరిర్దయాళుః
జయతు జయతు భవ్యా వ్యాకృతిః తత్ప్రణీతా ॥

భట్టనాథప్రబంధోయం తిరుప్పల్లాణ్డునామకః ।
మహే శ్రీవేంకటార్యాణాం జన్మర్క్షస్య ప్రకాశ్యతే ॥

రాజమ్మాసింగరయ్యాఖ్యౌ శ్రీమంతౌ దంపతీ ధ్రువమ్ ।
యాభ్యాం భక్త్యా కృతిర్దివ్యా సవ్యాఖ్యేయం ప్రకాశితా ॥

తిరుపతి
8-6-12

భాగవతవిధేయుడు
ఈ.ఏ. శింగరాచార్యులు

## పెరియాళ్వార్ల వాళితిరునామం

నల్ల తిరుప్పల్లాణ్డు నాన్మూన్ఱోన్ వాళియే
నానూర్ఱు అఱుపత్తొన్ఱుమ్ నమక్కురైత్తాన్ వాళియే
శొల్లరియ వానితనిల్ శోది వన్దాన్ వాళియే
తొడై శూడి క్కొడుత్తవళ్ తన్ తొళుమ్ తమప్పన్ వాళియే
శెల్వనమ్బితన్నైప్పోల్ శిరప్పుర్ఱాన్ వాళియే
శెన్ఱు కిళి యఱుత్తు మాల్ దెయ్వమెన్ఱాన్ వాళియే
విల్లిపుత్తూర్ నకరత్తై విళక్కినాన్ వాళియే
వేదియర్కోన్ పట్టర్ పిరాన్ మేదినియిల్ వాళియే

గొప్ప తిరుప్పల్లాణ్డు ప్రబంధం పన్నెండు పాశురాలను అనుగ్రహించినవారికి మంగళం. 461 పాశురాలతో పెరియాళ్వార్ తిరుమొళి అనుగ్రహించినవారికి మంగళం. వాచామగోచరమైన ఆనిమాసంలోని స్వాతీనక్షత్రంలో అవతరించినవారికి మంగళం. శూడిక్కుడుత్త నాచ్చియార్ తండ్రికి మంగళం. శెల్వనంబివలె గొప్ప వైభవాన్ని కలవారికి మంగళం. మధురకు పోయి వాదంలో జయించి వాదశుల్కధనం మూటను ఖండించి, భక్తవ్యామోహాన్ని కల శ్రియఃపతియే పరదైవమని పల్కినవారికి మంగళం. శ్రీవిల్లిపుత్తూర్‌నగరాన్ని ప్రకాశింపజేసినవారికి మంగళం. ఈ లోకంలో వైదికకులనాథులైన భట్టనాథులకు మంగళం.

## ప్రబంధసారం - శ్రీవేదాంత దేశికులు

పేరణిన్ద విల్లిపుత్తూర్ ఆనితన్నిల్ పెరుఞ్జోతి తనిల్ ర్ఱోన్ఱుమ్ పెరుమానే మున్
శీరణిన్ద పాణ్డియన్ తన్ నెఞ్జుతన్నిల్ తియక్కఱ మాల్ పరత్తువత్తై త్తిఱమా చ్చెప్పి
వారణమేల్ మదురైవలమ్ వరవే వానిన్ మాల్ కరుడవాకననాయ్ త్తోన్ఱ వాళ్త్తుమ్
ఏరణి పల్లాణ్డుముదల్ పాట్టు నానూర్ఱు ఎళుపత్తొన్నిరణ్డు మెనక్కుదవు నీయే

కీర్తిని గడించిన శ్రీవిల్లిపుత్తూర్‌లో స్వాతి అనే నక్షత్రంలో అవతరించిన పెరియాళ్వార్లు అనే మహానుభావా! నీవు పూర్వం గొప్ప తనాన్ని కల పాండ్యరాజా మనస్సులోగల సందేహాన్ని తీర్చి శ్రియః పతియొక్క పరత్వాన్ని చక్కగా స్థాపించి, పట్టపుటేనుగుపై ఎక్కి మధురానగర వీధులలో ఊరేగేటప్పుడు ఆకాశంలో శ్రీమన్నారాయణుడు గరుడ వాహనుడై సాక్షాత్కరించగా మంగళాశాసనాన్ని చేసే, అందాన్ని నిండుగా కల్గిన తిరుప్పల్లాణ్డు మొదలైన 472 పాశురాలను నాకు అనుగ్రహించు.

Scanned by CamScanner

శ్రీమతే రామానుజాయ నమః



# పాదుత్తనియన్‌లు

## (అళకియ మణవాళన్‌చే అనుగ్రహింపబడినది)

1. **శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవమ్ ।**
**యతీన్ద్రప్రవణం వన్దే రమ్యజామాతరం మునిమ్ ॥**

తిరుమలైయాళ్వార్ అనబడే తిరువాయ్‌మొళిప్పిళ్ళై అనుగ్రహానికి పాత్రమైన వారు, జ్ఞానభక్త్యాది కల్యాణగుణాలకు సముద్రంవంటివారు, భగవద్రామానుజుల పట్ల ప్రావణ్యాన్ని కలవారైన శ్రీవరవరమునులకు నమస్కరిస్తున్నాను.

## (కూరత్తాళ్వాన్‌చే అనుగ్రహింపబడినది)

2. **లక్ష్మీనాథసమారమ్భాం నాథయామునమధ్యమామ్ ।**
**అస్మదాచార్యపర్యన్తాం వన్దే గురుపరమ్పరామ్ ॥**

శ్రియఃపతిని ప్రారంభంలో కల్గినది, శ్రీమన్నాథముని- యామునమునులను మధ్యలో కల్గినది, మనకు ఆచార్యులైన భగవద్రామానుజులను చివరలో కల్గినది అయిన ఆచార్యపరంపరకు నమస్కరిస్తున్నాను.

## (కూరత్తాళ్వాన్‌చే అనుగ్రహింపబడినది)

3. **యో నిత్య మచ్యుతపదామ్బుజ యుగ్మరుక్మ -**
**వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే ।**
**అస్మద్గురో ర్భగవతోఽస్య దయైకసిన్ధోః**
**రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥**

ఏ భగవద్రామానుజులు నిత్యంగా భగవానుని శ్రీచరణపద్మయుగమనే బంగారంపట్ల కల గొప్ప వ్యామోహంవల్ల, ఆ పదపద్మాలకంటే వేఱయిన అన్ని విషయాలను గడ్డిపోచగా తలచి విడచి వేశారో, మాకు ఆచార్యులు, సమస్తకల్యాణ గుణపరిపూర్ణులు, కరుణాసముద్రులు అయిన ఈ భగవద్రామానుజుల శ్రీచరణాలను ఉపాయంగా ఆశ్రయిస్తున్నాను.

Scanned by CamScanner

( ఆళవన్దార్‌చే అనుగ్రహింపబడినది )

4. **మాతా పితా యువతయ స్తనయా విభూతి:**
**సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ ।**
**ఆద్యస్య న: కులపతే ర్వకుళాభిరామం**
**శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా ॥**

నా వంశంలోనివారికి ఎల్లప్పుడు తల్లి, తండ్రి, భార్య, సంతానం, సంపద-ఇంకా అన్నీ ఏ నమ్మాళ్వార్ల, శ్రీచరణాలే అవుతున్నవో, మన కులకూటస్థులు, అయిన నమ్మాళ్వార్ల, వకుళపూలచే అందమైన, నిత్యోజ్జ్వలమైన ఆ శ్రీచరణాలను శిరసా నమస్కరిస్తున్నాను.

( పరాశరభట్టర్‌చే అనుగ్రహింపబడినది )

5. **భూతం సరశ్చ మహదాహ్వయభట్టనాథ -**
**శ్రీభక్తిసారకులశేఖర యోగివాహాన్ ।**
**భక్తాంఘ్రిరేణుపరకాల యతీన్ద్రమిశ్రాన్**
**శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥**

పూదత్తాళ్వార్లు, పొయ్‌కై ఆళ్వార్లు, పేయాళ్వార్లు, పెరియాళ్వార్లు, తిరుమళిశై ఆళ్వార్లు, కులశేఖరాళ్వార్లు, తిరుప్పాణ్ ఆళ్వార్లు, తొణ్డరడిప్పొడి ఆళ్వార్లు, తిరుమఙ్గైయాళ్వార్లు, భగవద్రామానుజులు- అనే వీరిని, నమ్మాళ్వార్లను నేను నమస్కరిస్తున్నాను.

Scanned by CamScanner

శ్రీమతే రామానుజాయ నమః



# తిరుప్పల్లాణ్డు తనియన్‌కళ్

నాథమునికళ్ అరుళిచ్చెయ్‌తతు

గురుముఖమనధీత్య ప్రాహ వేదానశేషాన్
నరపతిపరిక్లుప్తం శుల్కమాదాతుకామః ।
శ్వశురమమరవన్ద్యం రఙ్గనాథస్య సాక్షాత్
ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి ॥

యః = ఏ పెరియాళ్వార్లు, నరపతి పరిక్లుప్తం = పాండ్యరాజుచే ఏర్పాటు చేయబడ్డ, శుల్కం = (వాద) శుల్కాన్ని, (పందెపు సొత్తు అయిన బంగారు మూటను), ఆదాతుకామః = పొందగోరినవారై, గురుముఖమ్ అనధీత్య (ఏవ) = ఆచార్యులద్వారా అభ్యసించకుండానే, అశేషాన్ వేదాన్ = అన్ని వేదాలను, ప్రాహ= పలికారో, అమరవంద్యం = దేవతలకుకూడా నమస్కరించదగినవారు, రంగనాథస్య = శ్రీరంగనాథునకు, సాక్షాత్ శ్వశురం = సాక్షాత్తు మామ, ద్విజకులతిలకం = బ్రాహ్మణకులానికి తిలకంవంటివారు (బ్రాహ్మణకులంలో గొప్పవారు) అయిన, తం = ఆ, విష్ణుచిత్తం = విష్ణుచిత్తులను (పెరియాళ్వార్లను) నమామి = నమస్కరిస్తున్నాను.

---

శ్రీపిళ్ళైలోకమ్‌జీయర్ అరుళిచ్చెయ్‌త వ్యాఖ్యానమ్- అవతారికై

ఇతుతాన్ తిరుప్పల్లాణ్డు త్తనియనాయిరుక్కుమ్. అన్ద త్తిరుప్పల్లాణ్డు పాడుకైక్కడియాన పెరియాళ్వార్ వైభవత్తై ప్పెరుక్క ప్పేశి, అవరై ప్రణిపాత నమస్కారమ్ పణ్ణుమ్బడి శొల్లుకిఱతు.

---

శ్రీపిళ్ళైలోకమ్ జీయర్ అనుగ్రహించిన వ్యాఖ్యానం - అవతారిక
ఆంధ్రానువాదం

ఈ శ్లోకం తిరుప్పల్లాణ్డు దివ్యప్రబంధానికి తనియన్ పాశురం. తిరుప్పల్లాణ్డు పాడడానికి (అనుగ్రహించడానికి) మూలమైన పెరియాళ్వార్ల వైభవాన్నిగూర్చి వివరంగా పల్కి, వారికి నమస్కరిస్తున్నట్లు ఇందులో తెలుపబడుతున్నది.

Scanned by CamScanner

వ్యాఖ్యానమ్ - (గురుముఖమనధీత్య) స్వతస్సర్వజ్ఞనాన సర్వేశ్వరనుమ్, "సాన్దీపనేః సకృత్ప్రోక్తాం బ్రహ్మవిద్యాం సవిస్తరామ్" ఎన్నుమ్బడి సాన్దీపనియిడత్తి లేయాయ్ త్తు సకలవేదఙ్గళైయుమ్ అధికరిత్తతు. ఇవర్, అజ్ఞన్ ఒరు గురుకులవాసమ్ పణ్ణి తమ్మఖేన. "నలఙ్గళాయ నఱ్కలైకళ్" నాలైయుమ్ అధికరియాతే, పుణ్డరీకరై ప్పోలే తుళవత్తొణ్డిలే మణ్డి, శ్రీమాలాకారరైప్పోలే "శూట్టు నన్మాలైకళై" త్తొడుత్తు, వడపెరుఙ్గో యిలుడైయానుక్కు చ్చాట్టి అడిమై శెయ్ తు పోన్దార్. ఏవం విధదాస్యరసజ్ఞరాన ఇవర్,

(నరపతిపరిక్లుప్తం శుల్కమాదాతుకామః) ఎన్ను- శ్రీవల్లభదేవనెన్గిఅ రాజావాలే పరతత్త్వనిర్ణయపూర్వకమాక ప్పురుషార్థలాభత్తై లభిక్కైక్కాక అనేకమాన అర్థత్తై విద్యాశుల్కమాక క్కల్పిత్తు కల్ తోరణత్తిలే కట్టివైక్క; ఇప్పడి నిర్మితమాన అన్ద ధనత్తై వడపెరుఙ్గోయిలుడైయానుడైయ ఆజ్ఞైయాలే అపహరిత్తుక్కొణ్డువరవేణు మెన్గిఅ అపేక్షైయై యుడైయరాయ్, విద్వద్గోష్ఠియిలే శెన్ఱు;

---

వ్యాఖ్యానమ్ - (గురుముఖమ్ అనధీత్య) - సహజంగానే అన్నిటిని తెలిసిన వాడైన (సర్వజ్ఞుడైన) భగవానుడుకూడా "సాందీపనేః సకృత్ ప్రోక్తాం బ్రహ్మవిద్యాం సవిస్తరామ్" (సాందీపనిమునిచేత ఒక్క పర్యాయం చెప్పబడ్డ విస్తృతమైన బ్రహ్మ విద్యను శ్రీకృష్ణుడు అభ్యసించాడు)- అని పల్కిన రీతిలో సాందీపనిమునివద్ద అన్ని వేదాలను అభ్యసించాడు. పెరియాళ్వార్లు ఆ విధంగా గురుకులవాసం చేసి, ఆ గురువుద్వారా "నలఙ్గళాయ నఱ్కలైకళ్" (తిరుచ్చందవిరుత్తమ్-90) అని చెప్పబడే వేదాలను నాల్గింటిని అభ్యసించకుండానే, పుండరీకమునివలె "తుళవతొణ్డు"లో (తిరుమాలై-45) (తులసీమాలాసమర్పణ కైంకర్యంలో) అభినివేశాన్ని పొంది, శ్రీమాలాకారునివలె "శూట్టు నన్మాలైకళ్" (అలంకరించుకొనే పరిశుద్ధమైన మాలికలను) (తిరువిరుత్తం-21) కూర్చి శ్రీవిల్లిపుత్తూర్ లోని వటపత్రశాయి స్వామికి కైంకర్యాన్ని చేస్తూ వచ్చారు. ఈ విధంగా కైంకర్యం చేయడంలోని రసాన్ని (ఆనందాన్ని) తెలిసినవారైన ఈ ఆళ్వార్లు-

(నరపతిపరిక్లుప్తం శుల్కమాదాతుకామః) - వల్లభదేవుడనే ప్రభువు, పరతత్త్వ నిర్ణయపూర్వకంగా (నిజమైన పరతత్త్వం ఎవరు? అని తెలిసికోవడంద్వారా) పురుషార్థలాభాన్ని పొందడంకోసం గొప్ప ధనాన్ని విద్యాశుల్కంగా ఏర్పాటు చేసి, దానిని రాతితోరణానికి కట్టించాడు. ఈ విధంగా నిర్మితమైన విద్యాశుల్కధనాన్ని వటపత్రశాయిస్వామి ఆజ్ఞవల్ల సంపాదించి తీసికొనిరావాలనే అపేక్షను (కోరికను) కలవారై, పెరియాళ్వార్లు విద్వాంసులు చేరి ఉండే గోష్ఠికి వేంచేశారు.

Scanned by CamScanner

(అశేషాన్ వేదాన్ ప్రాహ) "వేణ్డియ వేతఙ్గళ్ ఓతి విరైన్దు కిழி యఱుత్తాన్" ఎన్గిఱతై చొల్లుకిఱతు. ఇవర్క్కు అప్పోతు, "వేతప్పిరానారాన" "పీతకవాడైప్పిరానార్ తామే పిరమకురువాయ్", "పోతిల్ కమల వన్నెఞ్జమ్ పుకున్దు", "నావినుళానాయ్", "నానినుళ్ నిన్దు మలరుమ్ ఞానక్కలైకళై" ఇవర్ ముఖేన పేశువిత్తానితే. "ఎయిற్றிల్ మణ్ కొణ్డ ఎన్దైయాన" ఞానప్పిరానాయ్త్తు ఇవరై, ఞానక్కలైకళై యోతువిత్తతు. ఆకైయాలే నాట్టార్క్కు ఓతిన విడ మొழிన్దు ఓతాత విడమ్ తెరియాదిరుక్కుమ్. ఇవర్క్కు "మయర్వఱ మతినల మరు"ళుకైయాలే అశేషవేదఙ్గళుమ్ అరుళిచ్చెయ్యు మ్పడి విశదమాయ్త్తు. అత్తాలే "వేదాన్తవిழுప్పొరుళిన్ మేలిరున్ద విళక్కై విట్టుశిత్తన్

---

(అశేషాన్ వేదాన్ ప్రాహ) -'వేణ్డియ వేదఙ్గళోది విరైన్దు కిழி యఱుత్తాన్" (తిరుప్పల్లాణ్డు తనియన్) (ఆవశ్యకమైన వేదాలను అనుసంధించి, వేగంగా ఆ బంగారుమయమైన విద్యాశుల్కాన్ని ఖండించి పొందారు)- అనే సూక్తియొక్క అర్థాన్ని ఇది తెల్పుతున్నది. అపుడు వీరికి "వేదప్పిరానార్" (వేదనాయకుడు) (పెరియాழ்వార్తిరు-తనియన్) "పీతకవాడై పిరానార్ పిరమకురువాకి వన్దు" (పీతాంబరధారి తానే పరమగురువై) (పెరియా-5-2-1) "పోదిల్కమల వన్నెఞ్జమ్ పుకున్దు", (జ్ఞానాశ్రయమైనది, అంతర్యామి తెలియనీయకుండా చేసే దార్ఢ్యాన్ని కల్గినది అయిన హృదయకమలంలో) (పెరియా-తిరు-5-2-8) ఆழ்వార్ల జిహ్వాగ్రవర్తియై (తిరువాయ్-1-9-7) "నావినుళ్నిన్దు మలరుమ్ ఞానక్కలైకళ్" (జిహ్వలో నిలచి వికసించే జ్ఞానాన్ని కల్గించే శాస్త్రాలు) (తిరువాయ్ 1-9-8) అయిన వేదాలను ఈ ఆழ்వార్లద్వారా పలికించాడు కదా. "ఎయిற்றిల్ మణ్కొణ్డ ఎన్దై" (దంతాగ్రంతో భూమిని ఉద్ధరించిన స్వామి) (పెరియా.తిరు.5-2-5) అయిన "ఞానప్పిరాన్" (తిరువిరు-99) వరాహస్వామికదా వీరికి "ఞానక్కలైకళ్" నేర్పించాడు. "ఎయిற்றிల్ మణ్కొణ్డ ఎన్దై ఇరాప్పకల్ ఓదువిత్తు ఎన్నై ప్పయిற்றி ప్పణిశెయ్య కొణ్డాన్" (దంతంతో భూమిని ఉద్ధరించిన తండ్రి నాకు రాత్రి పగలు బోధించి, నాకే నేర్పించి, నన్ను సేవకునిగా చేసికొన్నాడు) (పెరి.తిరు.5-2-3) అని పెరియాழ்వార్లు (5-2-5) స్వయంగా పలికారుకదా) అందువల్ల లోకంలోనివారికి తాము అభ్యసించిన భాగంమాత్రం తెలిసి, అభ్యసించని భాగం తెలియకుండా ఉంటుంది. వీరికి భగవానుడు "మయర్వఱ మదినలమ్" (తిరువాయ్ 1-1-1) (భ్రమవిప్రలంభాది దోషరహితమైన భక్తి రూపాపన్నజ్ఞానాన్ని) అనుగ్రహించి నందువల్ల సకలవేదాలనుగూర్చి పలికేటట్లుగా అన్నీ చక్కగా తెలిసి ఉంటాయి. అందువల్ల- "వేదాన్తవిழுప్పొరుళిన్ మేలిరున్ద విళక్కై విట్టుశిత్తన్ విరిత్తవన్"

Scanned by CamScanner

విరిత్తనన్" ఎన్నుమ్పడి పరతత్త్వస్థాపనమ్ పణ్ణి, అన్ద వేదతాత్పర్యమాన తిరుప్పల్లాణ్డై అన్ఱైమేల్ మఙ్గలవీతి వరుకైయిలే మఙ్గళాశాసనమాక అరుళిచ్చెయ్‌తార్. "వేదానశేషాన్" ఎన్గిఱతుక్కుళ్ళే ఇతువుమ్ అన్తర్భూతమ్. "వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః" ఎన్నక్కడవతిఱే.

(శ్వశురమ్) అనన్తరమ్, విద్వాన్‌కళై వెన్ఱు కిఴి యఱుత్తు, అన్ద ధనత్తై స్వామి సన్నిధియిలే సమర్పిత్తు, మీళవుమ్ తమ్ తుఱైయాన "తుళవత్తొణ్డిలే" మూణ్డు నడత్తిక్కొణ్డుపోర; అక్కాలత్తిలే ఆణ్డాళ్ ఇవర్‌క్కు త్తిరుమకళాక త్తిరుత్తుఴా యడియిలే అవతరిక్క; ఇవరుమ్ "తిరుమకళ్‌పోల" వళర్‌త్తు ప్పోర; అఞ్జుపిరాయత్తిలే తిరువాయ్‌ప్పాడియిల్ పఞ్చలక్షమ్ కుడియిల్ పెణ్గళై అనుకరిత్తు త్తిరుప్పావై పాడి, అతుక్కు మేలే, అవర్ "తొడుత్త తుఴాయ్" మలరై "వియన్ తుఴాయ్ క్కట్టెన్ఱు

(వేదాంతాలలో ప్రతిపాదింపబడిన మహనీయాలైన అర్థాలలో గొప్ప అర్థమైన, స్వయంప్రకాశకమైన దీపంవంటివాడైన పరమాత్మను విష్ణుచిత్తులు వివరించారు.) (పెరియాఴ్వార్- తిరు- 4-3-11) అని వారే పల్కిన రీతిలో పరతత్త్వాన్ని సుస్థాపించి, ఆ వేదతాత్పర్యమైన తిరుప్పల్లాణ్డును ఆ సందర్భంలో భద్రగజంపై "మఙ్గలవీతి వలమ్" (మంగళకరంగా వీధిలో ఊరేగింపుగా) (నాచ్చి.తిరు-) వచ్చేటపుడు మంగళాశాసనంగా అనుగ్రహించారు. "వేదాన్ అశేషాన్" (అన్ని వేదాలను) పెరియాఴ్వార్లు అభ్యసించారనే విషయంలో ఈ తిరుప్పల్లాణ్డు ప్రబంధంకూడా అంతర్భూతం (తిరుప్పల్లాణ్డు ప్రబంధాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని చెప్పిన మాట ఇది). "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" (భగవద్గీత -15-15) (వేదాలన్నిటి ద్వారా నేనే పరతత్త్వంగా తెలియదగినవాడను) అని భగవానుడే అన్నాడు కదా !

(శ్వశురమ్) - తరువాత, విద్వాంసులను జయించి, బంగారుమయమైన శుల్కద్రవ్యం ఉండే మూటను ("కిఴి" అంటే పందెంలో గెలిచినవానికి బహూకరించే డబ్బు మూట) ఖండించి, ఆ సంపదను వటపత్రశాయిస్వామి కోవెలలో సమర్పించి, తరువాత స్వామికి అభీష్టకైంకర్యమైన తులసీమాలను కట్టి సమర్పించడమనే కైంకర్యంలో నిమగ్నులై కాలాన్ని గడుపుతూ ఉన్నారు. ఆ కాలంలో వీరికి కుమార్తెగా తులసీవృక్షమూలంలో గోదాదేవి (ఆణ్డాళ్) అవతరించింది. పెరియాఴ్వార్లు ఆమెను లక్ష్మీదేవినివలె పెంచారు. అయిదు ఏండ్ల వయస్సులో రేపల్లెలోని అయిదు లక్షలమంది గోపకన్యలను అనుకరించి, ఆమె తిరుప్పావై ప్రబంధాన్ని పాడింది. ఆ తరువాత, పెరియాఴ్వార్లు కూర్చిపెట్టిన మాలికను "వియన్ తుఴాయ్ కట్టెన్ఱు శూడుమ్ కరుమ్ కుఴల్ మేల్" (గొప్పదైన తులసియే

శూడుమ్ కరుఞ్గుழల్‌మేల్" ఎన్గిఅపడియే శూడిక్కొడుత్తవళాయ్, పిన్పు ప్రాప్తయౌవనైయాయ్, "మానిడవర్‌క్కెన్ఱు పేచ్చు ప్పడిల్ వాழ్గిలేన్ తన్నై" యళాయ్, "తిరుముకత్తు నాకణైమేల్ శేరుమ్ తిరువరఙ్గర్" ఎన్ఱుమ్, "పణామాడరవణై ప్పల్బల కాలముమ్ పళ్ళికొళ్ మణవాళర్" ఎన్ఱుమ్ శొల్లప్పడుకిఱ అழకియమణవాళ ప్పెరుమాళై ప్రార్థిత్తు త్తిరుమణమ్ పుణరుకైయాలే అవర్ మణవాళప్పిళ్ళైయానార్. "మఱై నాన్గు మున్ ఓతియ పట్ట"నుక్కితే పట్టర్ పిరాన్ కోతైయై క్కొడుత్తతు. ఆకైయాలే, ఔపచారికమాకవన్ఱిక్కే, యథావాక రఙ్గనాథనుక్కు భట్టనాథర్ మామనారానార్. అత్తాలే (అమరవన్ద్యమ్) ఎన్గిఱతు. అతావతు- "వడివుడై వానోర్ తలైవ"నాన తన్నై, అవర్‌కళ్ అడి వణఙ్గి యేత్తుమాపోలే, ఇవర్‌తమ్మైయుమ్ అమరర్

---

పాతివ్రత్యానికి తగినది అని నల్లని కురులలో అలంకరించుకుంటుంది) (మూన్ఱామ్ తిరు - 69) అనే రీతిలో తాను అలంకరించుకొని, పిమ్మట తీసి ఇచ్చింది. తరువాత యౌవనప్రాయాన్ని పొంది, "మానిడవర్‌క్కెన్ఱు ప్పేచ్చు ప్పడిల్" (మానవులకోసం అనేమాట వినబడితే) (నాచ్చి.తి.1-5) జీవించలేని స్వభావాన్ని కల్గినదై, "తీముకత్తు నాకణైమేల్ శేరుమ్ తిరువరఙ్గర్ ఆముకత్తై నోక్కాలేల్" (అగ్నిని నోటిలో కల ఆదిశేషునిపై శయనించే శ్రీరంగనాథుడు నాముఖాన్ని చూడకపోతే) (11-1) అని, "పణామాడరవణై ప్పల్బల కాలముమ్ పళ్ళికొళ్ మణవాళర్" (ఆడే పడగలనుకల ఆదిశేషునిపై కాలం ఉన్నంతవరకు శయనించే పెండ్లికుమారుడు) (10-6) అని పలు పాశురాలలో శ్రీరంగం పెరియ కోయిల్‌లో వేంచేసి ఉండే శ్రీరంగనాథునే కోరి ప్రార్థించి, పరిణయమాడినందువల్ల, ఆ శ్రీరంగనాథుడే పెళ్ళికుమారుడయ్యాడు. "మఱై నాన్గు మున్నోదియ" (పెరి.తిరు.7-3-7) (పూర్వం నాల్గు వేదాలను పల్కిన) భట్టశబ్దంతో వ్యవహరింపదగినవానికి కదా భట్టనాథులైన పెరియాళ్వార్లు తను కూతురును ఇచ్చారు. అందువల్ల కేవలం ఔపచారికంగా పల్కడం కాకుండా వాస్తవంగానే పెరియాళ్వార్లు శ్రీరంగనాథునకు మామగారు అయ్యారు. కనుక "అమరవంద్యమ్" (అమరులకు కూడా నమస్కరించదగినవాడు) అని చెప్పబడింది. అంటే- "వడివుడై వానోర్‌తలైవన్" (గొప్ప రూపాన్ని కల దేవతలకు ప్రభువు) (తిరువాయ్ 7-2-10) అని చెప్పబడే రీతిలోని అమరులు భగవానుని పాదసమాశ్రయణాన్ని చేసి, కీర్తించేటట్లే, వీరినికూడా అమరులు నమస్కరించే రీతిలోని గొప్పతనాన్ని వీరికి స్వామి అనుగ్రహించిన క్రమం (-శబ్దప్రయోగంద్వారా) తెలుపబడింది. "తమ్మైయే నాళుమ్ వణఙ్గి త్తొழువార్‌క్కు తమ్మైయేయొక్క అరుళ్‌శెయ్‌వర్" (తమనే నిత్యం నమస్కరించి

వన్దిక్కుమ్బడి యాన వరిశై కొడుత్తపడి. తమ్మైయేయొక్క అరుళ్శెయ్‌వరితే. భట్టనాథరాన మాత్రమన్ఱిక్కే, దేవర్‌కళాలుమ్ స్తుత్యరాయిరుక్కు మవరెన్గిఱతు. "విరుమ్బువర్ అమరర్ మొయ్‌త్తు" ఎన్నక్కడవతితే. అస్థానే భయశఙ్కికళా నవర్‌కళైయుమ్ ఇవర్ మఙ్గళాశాసనమ్ పణ్ణుమవరాకైయాలే, అవర్‌కళుమ్ ఇవర్‌క్కు స్తుత్యభివాదనఙ్గళై ప్పణ్ణువర్‌కళ్. "పరస్పరనీచభావై:" ఎన్నక్కడవతితే.

ఇని, రఙ్గనాథనోడే సమ్బన్దిక్కైక్కు ఈడాన భట్టనాథకులత్తై చ్చొల్లుకిఱతు (ద్విజకులతిలకమ్)ఎన్ఱు. "వేయర్‌తఙ్గళ్ కులత్తుతిత్త విట్టుశిత్త"రాకైయాలే, "అన్దణనైయాన్ కణ్డతు అణినీర్ త్తెన్నరఙ్గత్తే" ఎన్నుమ్బడి కణ్డు కొడుత్తార్. ద్విజకుల తిలకరాకైయావతు- బ్రాహ్మణకులత్తుక్కెల్లామ్ ముఖ్యరాయ్, శిరసా వాహ్యరాయ్, శ్రేష్ఠరాయిరుక్కై - ఎన్ఱపడి.

---

కొలిచేవారికి తమతో సామ్యాన్ని అనుగ్రహిస్తారు) (పెరి.తిరు.11-3-5) కదా భగవానుడు. భట్టనాథులు కానడం మాత్రమే కాకుండా, అమరులచేతకూడా నమస్కరింపబడేవారు - అనే విషయం ఇక్కడ తెలుపబడింది. భగవానుని దాసుల గొప్పతనాన్ని గూర్చి "విరుమ్బువర్ అమరర్ మొయ్‌త్తు" (తిరువాయ్ 3-4-11) (నిత్యసూరులు గుంపులుగా చేరి అభిలషిస్తారు) అని అంటూ చెప్పబడింది కదా (భగవానునకు ఏమి ఆపద కల్గుతుందో ! ఏమో! అనే అస్థానే భయశంక కలిగే ఆవశ్యకత లేని) పరమపదంలోకూడా అస్థానే భయశంకను పొందే నిత్యసూరులను వీరు (భట్టనాథులు) మంగళాశాసనం చేస్తారు కనుక, వారు కూడా (నిత్యసూరులు కూడా) వీరికి (భట్టనాథులకు) స్తుతి - అభివాదనలను చేస్తారు. "నిత్యాభివాంఛిత పరస్పరనీచభావై:" (నిత్యసూరులు పరస్పరం తమను ఇతరులకంటే తక్కువవారినిగా భావిస్తారు) (శ్రీవైకుంఠస్తవం-77) అని చెప్పబడుతున్నది కదా!

ఇక, శ్రీరంగనాథునకు తన కుమార్తెను ఇచ్చి సంబంధాన్ని పొందడానికి అనుగుణమైన పెరియాళ్వార్లకు కల ఆభిజాత్యాన్నిగూర్చి తెలుపబడుతున్నది. (ద్విజకులతిలకమ్) అని అంటూ. "వేయర్‌తఙ్గళ్ కులత్తుదిత్త విట్టుశిత్తన్" (వేయర్‌కులంలో అవతరించిన విష్ణుచిత్తులు) (5-4-11) అని తామే తెల్పిన రీతిలో బ్రాహ్మణోత్తములైన పెరియాళ్వార్లు "అన్దణనై యాన్ కణ్డతు తెన్నరఙ్గత్తే" (బ్రాహ్మణోత్తముని నేను దర్శించినది శ్రీరంగంలో) (పెరి. తిరు- 5-6-7) అని పల్కిన రీతిలో బ్రాహ్మణుడైన శ్రీరంగనాథుని వెదకి కనుగొని తమ కుమార్తెను ఇచ్చారు. బ్రాహ్మణకులతిలకులుగా ఉండడం అంటే- బ్రాహ్మణకులానికి అంతటికి ముఖ్యులై, వారికి శిరోధార్యులై, శ్రేష్ఠులై ఉండడం - అని భావం.

Scanned by CamScanner

(తం విష్ణుచిత్తమ్) అప్పడి శ్రేష్ఠరాయ్, విష్ణువై ఎప్పోతుమ్ చిత్తత్తిలే యుడైయరానవరై -ఎన్గిఱతు. "విల్లాణ్డాన్‌తన్నై విల్లిపుత్తూర్ విట్టుశిత్తన్ విరుమ్బియ శొల్" ఎన్ఱు అడియిలే తమక్కు నిరూపకమాక ఆఴ్వార్‌తామే అరుళిచ్చెయ్‌తారిఱే. "విష్ణుచిత్తమ్" ఎన్‌ఱైయాలే, "మిన్నునూల్ విట్టుశిత్తన్ విరిత్త" ఎన్ఱు పెరియాఴ్వార్ తిరుమొఴియడియిలుమ్, "విట్టుశిత్తన్‌మనత్తే కోయిల్ కొణ్డ కోవలనై" ఎన్ఱు ముడివిలుమ్ అరుళిచ్చెయ్‌కైయాల్, ఇన్ద త్తిరునామత్తాలే అన్ద ప్రబన్ధప్రవక్తా ఎన్నుమతువుమ్ సూచితమ్. అతుక్కుమ్ తనియన్ ఇతువేయిఱే. "అనన్తన్పాలుమ్ కరుడన్పాలుమ్ ఐతు నొయ్‌తాక వైత్తు ఎన్ మనన్తనుళ్ళే వన్దు వైకి వాఴ్‌చ్చెయ్ తాయ్ ఎమ్బిరాన్" ఎన్నుమ్పడి ఇవర్ తిరువుళ్ళత్తిలే అత్యభినివిష్టనాయిరుక్కు మాయ్‌త్తు.

(విష్ణుచిత్తమ్) "విష్ణునా వ్యపదేష్టవ్య" రాయిరుక్కుమపడి. "ఎన్ కోయిలిల్ వాఴుమ్ వైట్టణవన్" ఎన్నారిఱే. అవనుమ్ వైష్ణవసమ్బన్తత్తై అపేక్షిత్తు త్తైప్పత్తినాన్

---

(తం విష్ణుచిత్తమ్) -ఆ విధంగా గొప్పవారై, విష్ణువును ఎల్లప్పుడు తమ చిత్తంలో కలవారై- అని అర్థం. "విల్లాణ్డాన్‌తన్నై విల్లిపుత్తూర్ విట్టుశిత్తన్ విరుమ్బియ శొల్" (వింటిని ఏలిన భగవానుని గూర్చి విల్లిపుత్తూర్‌లోని విష్ణుచిత్తులు ఆశపడి పల్కిన సూక్తి) (తిరుప్పల్లాణ్డు-12) అని ప్రారంభంలోనే ఆఴ్వార్లే స్వయంగా తమకు నిరూపకంగా "విష్ణుచిత్తులు" అనే పేరును నిర్దేశించుకొన్నారు కదా ! "విష్ణుచిత్తమ్" అని అన్నందువల్ల "మిన్నునూల్ విట్టుశిత్తన్ విరిత్త" (విష్ణుచిత్తులు వివరించిన ప్రకాశించే శాస్త్రం) (1-1-10) అని చివరలో "విట్టుశిత్తన్‌మనత్తే కోయిల్ కొణ్డ" (విష్ణుచిత్తుల మనస్సునే నివాసంగా చేసికొన్న) (5-4-11) అని అనుగ్రహించిన రీతిలో ఈ తిరునామంతోనే ఆ ప్రబంధాన్ని (పెరియాఴ్వార్ తిరుమొఴిని) అనుగ్రహించారు. అనే విషయం సూచింపబడింది. పెరియాఴ్వార్ తిరుమొఴికి కూడా ఇదే కదా తనియన్. "అనన్తన్ పాలుమ్ కరుడన్ పాలుమ్ ఐదునొయ్‌తాక వైత్తు ఎన్ మనన్తన్నుళ్ళే వన్దు వైకి వాఴ్‌చ్చెయ్‌దాయ్ ఎమ్బిరాన్" (అనంతునిపట్ల, గరుడునిపట్ల అత్యల్పమైన ఆదరాన్ని కల్గి నామనస్సులోకి వచ్చి నిలచి నన్ను ఉజ్జీవింపజేశావు) (5-4-8) అని పల్కిన రీతిలో వీరి మనస్సులో చాలా ఆదరంతో భగవానుడు వేంచేసి ఉంటాడు. కదా !

(విష్ణుచిత్తమ్) - "విష్ణునా వ్యపదేష్టవ్యః" (విష్వక్సేనసంహిత) - (ఏకాంతి గ్రామకులాదులతో వ్యవహరింపబడకూడదు. విష్ణువు పురస్కరించుకొనే వ్యవహరింపబడాలి) అనే సూక్తికి తగినట్లు వీరి నామం వ్యవహరింపబడుతున్నది.

భట్టరర్ అరుళిచ్చెయ్‌తతు

మిన్నార్ తడమతిళ్ శూళ్ విల్లిపుత్తూరెన్ఱు ఒరుకాల్
శొన్నార్‌కళ్ళక్కమలమ్ శూడినోమ్-మున్నాళ్
కిళి యఱుత్తాన్ ఎన్ఱురైత్తోమ్ కీళ్‌మైయినిల్ శేరుమ్
వళియఱుత్తోమ్ నెఞ్జమే! వన్దు.

మిన్ ఆర్ = ప్రకాశం నిండిన, తడ మదిళ్ శూళ్ = గొప్ప కోటలు చుట్టి ఉండే, విల్లిపుత్తూర్ = శ్రీవిల్లిపుత్తూర్ అని, ఒరు కాల్ = ఒక మారు, శొన్నార్ = పల్కినవారి,

---

(తం విష్ణుచిత్తం నమామి) అన్ద విష్ణుచిత్తరై "కిళి యఱుత్తాన్ పాతఙ్గళ్ యాముడైయ పత్రు" ఎన్నుమ్పడి సేవిక్కిఱేనెన్గిఱతు. నమస్కారముమ్, సేవైయుమ్ పర్యాయమ్. "ఓం నమో విష్ణవే" ఎన్నుమతు విష్ణుచిత్తవిషయత్తిలే యాయ్‌త్తు. విశేషజ్ఞర్‌క్కు భగవద్విషయత్తిలే అరై వయిఱాయ్, ఇఙ్గేయితే ఎల్లామ్ పూర్ణమావతు. "నమ్బి విట్టుశిత్త"రితే. ఇత్తాల్- ప్రథమప్రబన్ధానుసన్ధానదశైయిల్ తద్వక్తావాన ఆళ్వారై "తం పూర్వమభి వాదయేత్" ఎన్ఱు ప్రథమమ్. తిరువడి తొళుమ్పడియై చ్చొల్లిత్తాయ్‌త్తు.

---

ఈ ఆళ్వార్లు కూడా "నిన్ కోయిలిల్ వాళుమ్ వైట్టణవన్" (నీ కోవెలలో నివసించే వైష్ణవుడు) (5-1-3) అని తమను నిర్దేశించుకొన్నారు. భగవానుడు కూడా వీరికి తనతో గల సంబంధం కారణంగానే వీరిని అనుగ్రహించాడు.

(తమ్ విష్ణుచిత్తం నమామి) - ఆ విష్ణుచిత్తులను -అని అర్థం. "కిళి యఱుత్తాన్ పాదఙ్గళ్ యాముడైయ పత్రు" (తిరుప్పల్లాణ్డు తనియన్) అనే రీతిలో ఆ విష్ణుచిత్తులను సేవిస్తున్నాను- అని అంటున్నారు. నమస్కారం, సేవ- అనే ఈ రెండు ఒకే అర్థాన్ని కల్గిన పదాలు. "ఓమ్ నమో విష్ణవే" అనే షడక్షరి ఇపుడు విష్ణుచిత్తుల విషయంలో అనుసంధింపబడింది. విశేషమైన జ్ఞానాన్ని కలవారికి భగవానుని సేవించేటపుడు సగం కడుపే నిండుతుంది. భాగవతులను సేవించేటపుడే వారి కడుపు పూర్తిగా నిండుతుంది. ఎందుకు? అంటే, "నమ్బి విట్టుశిత్తర్" (పూర్ణులైన విష్ణుచిత్తులు) అని (నాచ్చియార్ తిరు-13-10) అని పల్కిన రీతిలో వీరుకూడా ఒక నంబి (పూర్ణులు). ఈ శ్లోకంలో ప్రథమ ప్రబంధమైన తిరుప్పల్లాణ్డును అనుసంధించేటపుడు దానిని అనుగ్రహించిన ఆళ్వార్లను "తమ్ పూర్వమభివాదయేత్" (ప్రబంధాన్ని అనుగ్రహించినవారిని ముందుగా నమస్కరించాలి) అని పల్కినట్లుగా మొదట వారిని నమస్కరించే క్రమం తెలుపబడింది.

Scanned by CamScanner

కழల్ కమలమ్ = పాదపద్మాలను, శూడినోమ్ = అలంకరించు కొన్నాము (శిరసా వహించాము). మున్ నాళ్ = పూర్వం ఒక సమయంలో, కిழి అఱుత్తాన్ ఎన్ఱు = (పరతత్త్వనిర్ణయాన్ని చేసి) బంగారు విద్యాశుల్కం మూటను ఛేదించారు అని, ఉరైత్తోమ్ = పలికాము, నెఞ్జమే = ఓ మనసా !, వన్దు = నీవు అనుకూలమై వచ్చినందువల్ల, కీழ్మైయినిల్ శేరుమ్ = నరకంలో చేరే, వழి అఱుత్తోమ్ = దారిని ఖండించాము.

---

అవ : (మిన్నార్ తడమతిళ్ ఇత్యాది) ఇతిల్, శ్రీవిల్లిపుత్తూర్ పట్టర్‌పిరానాన పెరియాழ్వార్ అవతరణస్థలత్తై అనుసన్ధిప్పార్ తిరువడికళై త్తొழుకైయాల్ ఉణ్డాన ప్రీతియైయుమ్, అవర్ శెయలై చ్చొల్లుకైయాలుణ్డాన విరోధినివృత్త్యాదికళిలే తృప్తియైయుమ్ మనస్సోడే శొల్లి ఉలావుకిఱతాయిరుక్కిఱతు.

వ్యాఖ్యానమ్ : (మిన్నార్ తడమతిళ్ శూழ్) తేజఃప్రచురమాన పెరియ తిరుమతి కళాలే శూழప్పట్ట విల్లిపుత్తూర్. ఇత్తాల్ -"శెమ్ పొన్ ఏయ్‌న్ద మతిళాయిరుక్కై. ప్రతికూలర్‌క్కు క్కిట్టవొణ్ణాతపడియాయ్, అనుకూలర్‌క్కు క్కణ్డు వాழువప్పడి యాయిరుక్కై. కల్‌మతిళ్‌పోలే అత్తలైక్కు అరణాయ్, మఙ్గళాశాసనపరరాన పెరియాழ్వార్ ఇరుక్కుమూరిల్ మతిళితే. ఏవంవిధమాన మతిళాలే శూழప్పట్ట.

---

అవతారిక :- (మిన్నార్ తడ మదిళ్) ఇత్యాది. ఈ పాశురంలో- శ్రీవిల్లిపుత్తూర్‌లోని భట్టనాథులైన పెరియాழ్వార్లు అవతరించిన స్థలాన్ని అనుసంధించిన వారి శ్రీచరణాలను నమస్కరించడంవల్ల కలిగిన ఆనందాన్ని గూర్చి, వారు చేసే పనులను గూర్చి పల్కడంవల్ల కలిగే విరోధినివృత్తి మొదలైనవానిద్వారా తృప్తినిగూర్చి మనస్సును ఉద్దేశించి పల్కుతూ ఆనందంగా విహరించే రీతి తెలుపబడుతున్నది.

వ్యాఖ్యానం : (మిన్నార్ తడ మదిళ్ శూழ్) - మిక్కిలి కాంతిని కల గొప్ప కోటలతో చుట్టబడిన శ్రీవిల్లిపుత్తూర్- అని అర్థం. దీనివల్ల స్పృహణీయమైన బంగారంతో నిర్మింపబడిన కోటలని తెలుపబడింది. శత్రువులకు దరిచేరడానికి వీలుకాని రీతిలో, భక్తులు దర్శించి ఉజ్జీవించే రీతిలోని కోటలుండే తీరు చెప్పబడింది. రాతి కోటలను నిర్మించినట్లుగా భగవానునకు రక్షణగా ఎల్లప్పుడు మంగళాశాసనాన్ని చేయడమే స్వభావంగా కలవారైన పెరియాழ్వార్లు నివసించే ఊరిలో ఉండే కోట కదా. ఇటువంటి కోటలతో పరివేష్టింపబడిన-

Scanned by CamScanner

(విల్లిపుత్తూరెన్ఱు ఒరు కాల్ శొన్నార్కళ్ళుడ్కమలమ్ శూడినోమ్) ఒరు కాలాకిలుమ్ శ్రీవిల్లిపుత్తూరై ఉచ్చరిత్త శ్రీవైష్ణవర్కళుడైయ శ్రీపాదకమలఙ్గళై "పైఙ్గమలత్తణ్డెరియలాక" త్తలైయిలే శూడినోమ్. "కోవిన్దన్దన్ అడియార్కళాకి ఎణ్డిశైక్కుమ్ విళక్కాకి నిఱ్పారిణైయడి ఎన్ తలైమేలవే" ఎన్ఱిఱే ఆళ్వారుమ్ అరుళిచ్చెయ్తతు. శ్రీవిల్లిపుత్తూర్తాన్, వడపెరుఙ్గోయిలుడైయానుక్కుమ్, ఆళ్వారుక్కుమ్, ఆణ్డాళుక్కుమ్ నిరూపకమాన దేశమాయ్త్తు. "విల్లిపుత్తూరుఱైవాన్", "విల్లిపుత్తూర్ ప్పట్టర్ పిరాన్", "అన్నవయల్ పుతువై యాణ్డాళ్", "కోతై పిఱన్దవూర్ - విల్లిపుత్తూర్" ఎన్నక్కడవతిఱే. ప్రణవమ్పోలే మూవరుమ్ కూడలాయిరుక్కై. ఇప్పడి ఉద్దేశ్యమాన వూరై ఒరుకాల్ అనుసన్ధిప్పార్ ఎప్పోతుమ్ ఉద్దేశ్యరాకైయాలే, అవర్కళ్ శ్రీపాదఙ్గళ్ శిరోభూషణమాక ధార్యమెన్గిఱతు; "అరశమర్న్దాన్ అడిశూడు మరశు" ఎన్నుమాపోలే.

---

(విల్లిపుత్తూర్ ఎన్ఱు ఒరు కాల్ శొన్నార్ కళ్ళుడ్కమలమ్ శూడినోమ్) - ఒకే ఒక్క పర్యాయం అయినా "శ్రీవిల్లిపుత్తూర్" అని ఉచ్చరించిన శ్రీవైష్ణవుల శ్రీచరణపద్మాలను శిరసా వహించాము. ఇటువంటి భక్తుల శ్రీచరణాలను తలపై అలంకరించుకోవాలి- అనే దానిని - "కోవిన్దన్ తన్ అడియార్కళాకి ఎణ్తిశైక్కుమ్ విలక్కాకి నిఱ్పార్ ఇణైయడి ఎన్ తలైమేలవే" (గోవిందునకు దాసులై ఎనిమిది దిక్కులకు దీపంగా నిలచిఉండేవారి పాదద్వయి నా తలపై ఉంటుంది) (2-9-11) అని అంటూ ఈ పెరియాళ్వార్లే అన్నారు కదా ! శ్రీవిల్లిపుత్తూర్ - అనే ఊరు శ్రీవటపత్రశాయి, పెరియాళ్వార్, ఆణ్డాళ్ - అనే ముగ్గురికే నిరూపకమైన దేశమై ఉన్నది. శ్రీవటపత్రశాయి "విల్లిపుత్తూర్ ఉఱైవాన్" (శ్రీవిల్లిపుత్తూర్లో నివసించేవాడు) (నాచ్చియార్ తిరు- 5-5) అని, పెరియాళ్వార్ "విల్లిపుత్తూర్ పట్టర్ పిరాన్" (విల్లిపుత్తూర్లోని భట్టనాథులు) (పెరియాళ్వార్ తిరు-2-2-11) అని, ఆణ్డాళ్ "అన్నవయల్పుదువై ఆణ్డాళ్" (హంసలు సంచరించే క్షేత్రాలను కల విల్లిపుత్తూర్లోని గోదాదేవి) (తిరుప్పావై తనియన్) అని, "కోదై పిఱన్దవూర్.. విల్లిపుత్తూర్" అని చెప్పబడుతున్నాయికదా ! ప్రణవంవలె ముగ్గురు కలసి ఉన్న చోటు ఇది. అకారంచేత భగవానుడు, ఉకారంచేత పిరాట్టి, మకారం చేత జీవాత్మ చెప్పబడేటట్లే ఇక్కడకూడా వటపత్రశాయి, గోదాదేవి, పెరియాళ్వార్లు - అనే ముగ్గురు కూడి ఉన్నారు. ఇటువంటి ఊరినిగూర్చి ఒకసారి పలికేవారుకూడా ఎల్లప్పుడు ఉద్దేశ్యభూతులు (ఆదరణీయులు) కనుక, వారి శ్రీచరణాలను తలపై అలంకారంగా ధరించడం చాలా ఉచితం- అనే విషయం ఇక్కడ

ఓన్నై విరోధికళ్ శెయ్‌తతు ఎన్? ఎన్నిల్, (మున్నాళ్ కిఴ్ యఱుత్తా నెన్ఱు రైత్తోమ్ కీఴ్మైయినిల్ శేరుమ్ వఴి యఱుత్తోమ్) మున్నాళ్ కిఴ్ యఱుక్కై యావతు- ముఱ్కాలత్తిలే పాణ్డియన్ విద్యాశుల్కమాక క్కట్టిన ద్రవ్యక్కిఴియై, అఙ్గే శెన్ఱు, వేదాన్తార్థముఖేన "విష్ణువే పరతత్త్వమ్" ఎన్ఱు విష్ణుచిత్తరాన తామ్ విద్వజ్జనఙ్గళై వెన్ఱు, ద్రవ్యక్కిఴియై అఱుత్త అఴ్వారుడైయ ఇన్ద అత్యద్భుతకర్మత్తై అనుసన్ధిత్తోమ్; అత్తాలే కీఴ్మైయినిల్ శేరుమ్ వఴి యఱుత్తోమ్. "జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః; త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున !" ఎన్ఱు కృష్ణవిషయత్తిల్ జన్మకర్మఙ్గళ్ జన్మసంసారబన్ధత్తై యఱుక్కుమాపోలే యాయ్‌త్తు, విష్ణుచిత్తర్ జన్మకర్మఙ్గళుమ్. ఇఙ్గుమ్, శ్రీవిల్లిపుత్తూర్ జన్మముమ్, కిఴ్ యఱుక్కై కర్మముమాయిరుక్కుమ్. కీఴ్మైయినిల్ శేరుమ్ వఴి యఱుక్కై

---

తెలుపబడుతున్నది. "అరశమర్‌న్దాన్ అడిశూడుమ్ అరశు" (తన పరత్వం తెలిసేటట్లుగా వేంచేసి ఉండే శ్రీరాముని శ్రీచరణాలను తలపై భూషణంగా ధరించడం అనే ప్రభుత్వం -అధికారం) (పెరుమాళ్ తిరు- 10-7) అని (ఈ విషయం) చెప్పబడింది కదా !

అయితే మఱి, దీనికి కల్గిన ఆటంకాలు ఏమి అయినవి ? అని అంటే, (మున్నాళ్ కిఴ్ యఱుత్తాన్ ఎన్ఱురైత్తోమ్ కీఴ్మైయినిచ్చేరుమ్ వఴి యఱుత్తోమ్) పూర్వకాలంలో పాండ్యప్రభువు పరతత్త్వాన్ని నిర్ణయించి సుస్థాపించే విద్వాంసునకు బహుమానంగా సమర్పించడంకోసం కట్టిపెట్టిన బంగారు మూటను, రాజసభకు వేంచేసి, వేదాంతాల మూలంగా "విష్ణువే పరతత్త్వం" అని స్థాపించి, మిగిలిన విద్వాంసులను జయించి, బంగారు విద్యాశుల్కమయమైన మూటను ఖండించిన ఆఴ్వార్ల ఈ అద్భుతమైన కృత్యాన్నిగూర్చి పలికాము. అందువల్ల అధోగతికి చేరే దారిని ఖండించాము. "జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవం యో వేత్తి తత్త్వతః, త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున !" (భగవద్గీత -4-98) (ఓ అర్జునా ! నా దివ్యమైన జన్మలు, లీలలు అనే వీటిని యథాతథంగా ఎవడు తెలిసికొంటున్నాడో, అతడు తిరిగి జన్మను పొందడంలేదు. నన్నే పొందుతున్నాడు) అని అతడే పల్కినట్లుగా శ్రీకృష్ణుని జన్మనుగూర్చి, అవతారాలనుగూర్చి యథాతథంగా తెలిసినవాడు జన్మల పరంపరను ఛేదించుకొనేటట్లే, పెరియాఴ్వార్ల శ్రీవిల్లిపుత్తూర్‌లోని అవతారాన్ని వారు విద్యాశుల్కరూపమైన మూటను ఖండించిన కృత్యాన్నిగూర్చి పలికేవారు అధమమైన చోట్లకు చేర్చే దారిని ఖండించినవారు కాగలరు. అధమమైన చోట్లకు చేర్చే మార్గాన్ని ఖండించడం అంటే- "పుఱనెఱికళై

యావతు - నిహీనకృత్యత్తాలే ప్రాపిక్కుమ్ ప్రతిబన్ధకమాన మార్గత్తై ఛేదిత్తోమ్. "పుఱనెఱికళై కట్టు" అవైదికమార్గత్తై యఱ్ఱైక్కై పాపఫలమితే. "మెయ్మ్మై ప్పెరు వార్త్తై విట్టుశిత్తర్ కేట్టిరుప్పర్" ఎన్ఱు ఇవర్తామ్ సన్మార్గవర్తికళితే. అన్ఱిక్కే, "కీఴ్మైయినిల్ శేరుమ్ వఴి" ఎన్ఱు అధఃపతనత్తిలే ప్రాప్తమాన మార్గమెన్ఱు-అర్చిరాదిమార్గత్తుక్కు కీఴాయ్, పునరావృత్తిలక్షణహేతువాన ధూమాదిమార్గత్రయత్తై యుమ్ నిరోధిత్తోమ్.

(నెఞ్జమే వన్దు) "నెఱి నిన్ఱ నెఞ్జాయ్" నీ అనుకూలిక్కైయాలే ఇన్ద లాభత్తై లభిత్తోమ్.

(వన్దు) ఇవ్వళవుమ్ వన్దు, ఆఴ్వారళవుమ్ వన్దు. విల్లిపుత్తూర్- ఎన్ఱు ఒరుకాల్ శొన్నార్కఴల్కమలమ్ శూడినోమ్. కీఴ్మైయినిల్ శేరుమ్ వఴి యఱుత్తోమ్. ఇతువన్ఱో నీ యనుకూలిత్తత్తాల్ పెఱ్ఱ పేఱు. నీ ఎన్ వఴి వరుకైయాలే ఇవై ఎల్లామ్ పెఱ్ఱోమ్. ఇష్టప్రాప్తియోపాతి అనిష్టనివారణముమ్ ఫలమితే.

---

కట్టి" (బాహ్యమతాలను నిరసించి) (తిరువాయ్ 1-3-5) అని పల్కినట్లుగా వేదాలకు బాహ్యమైన మార్గాలలోకి పోవడం పాపఫలమే కదా ! "మెయ్మ్మై ప్పెరువార్త్తై విట్టుశిత్తర్ కేట్టిరుప్పర్" (వాస్తవమైన గొప్ప సూక్తిని విష్ణుచిత్తులు విని మనస్సులో ధరించారు) (నాచ్చియార్ తిరు-11-10) అని గోదాదేవి అనుగ్రహించిన రీతిలో ఉన్నత మార్గంలో పయనించేవారు పెరియాఴ్వార్లు. (అందువల్ల వారి కృత్యాన్ని అనుసంధించిన మనంకూడా అధమమార్గాన్ని ఛేదించి, గొప్ప మార్గంలోకి వచ్చాము) లేక- "కీఴ్మైయినిల్చేరుమ్" అనే ప్రయోగం కిందకుపడే దారిని తెల్పుతున్నదనికూడా చెప్పవచ్చు. పరమపదాన్ని పొందించే అర్చిరాదిగతిని తెల్పుతున్నదని కూడా చెప్పవచ్చు. పరమపదాన్ని పొందించే అర్చిరాది గతికి కింద ఉన్నది, మళ్ళీ ఈ లోకానికి తిరిగి చేర్చే లక్షణాన్ని కల్గినది అయిన ధూమాదిమార్గాన్ని చేరకుండా తప్పుకున్నాము- అని భావం.

(నెఞ్జమే! వన్దు) - "నెఱినిన్ఱ నెఞ్జాయ్" (ముదల్తిరు-85) "సన్మార్గంలో నిలచిన మనసా! నీవు సహకరించి నందు వల్లనేకదా ఈ లాభాన్ని పొందాము" అని అంటూ తమ మనస్సును ఆఴ్వార్లు కొనియాడు తున్నారు.

(వన్దు) - ఇంతదూరం వచ్చి- అని అర్థం. అంటే- భగవద్భక్తులైన పెరియాఴ్వార్ల కృత్యాన్ని పొగడే పర్యంతం వచ్చి -అని భావం. వారి ఊరు అయిన శ్రీవిల్లిపుత్తూర్నుగూర్చి ఒకమూరు పల్కుతున్న భక్తుల పాదాలను తలపై అలంకరించుకొనే పర్యంతం వచ్చి, అధోగతిని చేర్చే దారిని ఛేదించాము. ఓ

Scanned by CamScanner

పాణ్డియన్ కొణ్డాడ ప్పట్టర్ పిరాన్ వన్దానెన్ఱు
ఈణ్డియ శజ్గమెడుత్తూత- వేణ్డియ
వేతజ్గళోతి విరైన్దు కిఴి యఱుత్తాన్
పాతజ్గళ్ యాముడైయ పఱ్ఱు.

పాణ్డియన్ కొణ్డాడ = పాండ్యరాజు ప్రశంసించే రీతిలో, పట్టర్ పిరాన్ = భట్టనాథులు, (బ్రాహ్మణులకు) ఉపకారకులైన పెరియాళ్వార్లు, వన్దాన్ ఎన్ఱు = వచ్చారు అని, ఈణ్డియ శజ్గమ్ = గుంపులు గుంపులుగా శంఖాలను, ఎడుత్తు

---

(నెఞ్జమే వన్దు) "నెఞ్జమే నల్లై నల్లై ఉన్నై ప్పెఱ్ఱాల్ ఎన్ శెయ్యోమ్ ఇని యెన్న కుఱైవినమ్" ఎన్నాప్పోలే పెఱ్ఱ పేఱ్ఱై ప్పేశి నెఞ్జోడే హర్షిక్కుమ్పడియై చ్చొల్లుకిఱతు. "విల్లిపుత్తూరెన్ఱు ఒరు కాల్ శొన్నార్" ఎన్గతు- "ఇన్నిశైక్కుమ్ విల్లిపుత్తూర్" ఎన్ఱుమ్, "మెన్నడై యన్నమ్ పరన్దు విళైయాడుమ్ విల్లిపుత్తూర్" ఎన్ఱుమ్ భగవద్విషయత్తిలే తమప్పనారుమ్, మకళారుమ్ ఒరు కాల్ శొన్నాప్పోలే, భాగవత విషయమాక ఒరు కాల్ శొన్నార్ - ఎన్గపడి. సమ్బన్దానుసన్దానమ్ సకృత్తు -ఎన్గపడి.

---

మనసా! ఇదికదా నీవు సహకరించినందువల్ల లభించిన ఫలం ! నీవు నా దారికి వచ్చినందువల్ల దీనిని అంతటిని పొందాము- అని అంటూ ఆళ్వార్లు మనస్సును పొగడుతున్నారు. అభీష్టాన్ని పొందడంవలె (ఇష్టప్రాప్తివలె) ఇష్టం లేనివానినుండి (అధోగతిని చేర్చే దారులనుండి) నివృత్తిని పొందడంకూడా ఫలమే కదా !

(నెఞ్జమే వన్దు) - "నెఞ్జమే ! నల్ల నల్లై ఉన్నై ప్పెఱ్ఱాల్ ఎన్ శెయ్యోమ్ ! ఇని యెన్న కుఱైవినమ్ ?" (ఓ మనసా ! మంచిది ! మంచిది ! నిన్ను పొందితే ఇక ఏమి చేయలేము ? ఇక ఏమి కొఱత ?) (తిరువాయ్ -1-10-4) అని అంటూ నమ్మాళ్వార్లు తమ మనస్సును ప్రశంసించినట్లే, ఇక్కడ కూడా పొందిన ఫలాన్నిగూర్చి పల్కి, మనస్సుతో కలసి ఆనందించే రీతి తెలుపబడుతున్నది. "విల్లిపుత్తూర్ ఎన్ఱు ఒరు కాల్ శొన్నార్" అనే ప్రయోగం "వణ్డు ఇన్నిశైక్కుమ్ విల్లిపుత్తూర్" (తుమ్మెదలు మధురంగా ధ్వనించే విల్లిపుత్తూర్) (పెరియా. తిరు- 2-2-8) అని పెరియాళ్వార్లు ఒకమాటు, "మెన్నడై యన్నమ్ పరన్దు విళైయాడుమ్ విల్లిపుత్తూర్" (మందగమనాలను కల హంసలు మెండుగా సంచరించే విల్లిపుత్తూర్) (నాచ్చి. తిరు-5-5) అని గోదాదేవి ఒకమాటు భగవానునిగూర్చి పలికేటట్లే, భాగవతులైన పెరియాళ్వార్ల విషయంగా శ్రీవిల్లిపుత్తూర్- అని ఒకమాటు పలికేవారినిగూర్చి తెల్పుతున్నది. భాగవతులతో గల సంబంధాన్నిగూర్చి ఒక మాటు పల్కినా చాలు- అని ఇక్కడ సూచింపబడింది.

Scanned by CamScanner

ఊద = చేతిలో పట్టుకొని ఊదగా, వేణ్డియ వేదజ్గళ్ = ఆవశ్యకాలైన వేదాలను, ఓది = పల్కి, విరైన్దు = వేగంగా, కిఙ్ఙి అఱుత్తాన్ = బంగారు పందెపు సొమ్ము మూటను ఛేదించినవారి (పెరియాళ్వార్ల), పాదజ్గళ్ = శ్రీచరణాలు, యాముడైయ పఱ్ఱు = మనకు శరణం. (ఆశ్రయం).

---

అవ :- (పాణ్డియన్ కొణ్డాడ) ఇతిల్, ప్రబన్ధవక్తావాన పెరియాళ్వార్ తిరువడి కళిల్ ఉపాయస్వీకారత్తై చ్చొల్లుకిఱతు.

వ్యా :- (పాణ్డియన్ కొణ్డాడ) "తెన్నన్ కొణ్డాడుమ్" ఎన్నుమాపోలే నమక్కు పరతత్త్వనిర్ణయమ్ పణ్ణి త్తరుమ్బడి పట్టర్ పిరాన్ వన్దానెన్ఱు పాణ్డియనాన శ్రీవల్లభదేవన్ శొల్లి క్కొణ్డాడ. అర్థమైయిలే.

(ఈణ్డియ శజ్ఞమెడుత్తోత) తిరణ్డిరుక్కిఱ విద్వత్సజ్ఘమానతు, ఓరో ప్రదేశ జ్గళిలే ఓతిక్కిడక్కిఱ ప్రశంసాపరవాక్యజ్గళై ఎడుత్తు బ్రహ్మరుద్రాదికళై ప్పొరప్పొలియ చ్చొల్లి ఉపన్యసిక్క - ఎన్నుతల్;

(ఈణ్డియ శజ్ఞమ్ మడుత్తూత) ఎన్ఱు- జయశజ్ఞజ్గళ్ పలవఱ్ఱైయుమ్ వాయిలే మడుత్తు ఊత- ఎన్నుతల్. "పూజ్గాళ్ తిరుముకత్తు మడుత్తూతియ శజ్గొలి" ఎన్నక్కడవతిఱే.

---

అవతారిక :- (పాణ్డియన్ కొణ్డాడ) - ఈ పాశురంలో, తిరుప్పల్లాణ్డును అనుగ్రహించిన పెరియాళ్వార్ల శ్రీచరణాలను శరణంగా ఆశ్రయించడాన్నిగూర్చి చెప్పబడుతున్నది.

"తెన్నన్ కొణ్డాడుమ్" (పెరియాళ్వార్ తిరు 4-2-7) (పాండ్యరాజు కీర్తించే) అనే రీతిలో మనకు పరతత్త్వాన్ని సుస్థాపించి అనుగ్రహించే రీతిలోని గొప్పతనాన్ని పొందిన భట్టనాథులు వేంచేశారు- అని పాండ్యప్రభువైన శ్రీవల్లభదేవుడు పల్కి పొగడగా- అని అర్థం. అపుడు-

(ఈణ్డియ శజ్ఞమ్ ఎడుత్తూద) - అక్కడ గుమిగూడి ఉండే విద్వాంసుల సమూహం, వేదాలలో కొన్నిచోట్ల పొగడ్తకోసం చెప్పబడ్డ వాక్యాలను ప్రస్తావించి, బ్రహ్మ - రుద్రుడు మొదలైనవారిని పరతత్త్వంగా పల్కగా - అని అర్థం. లేక,

(ఈణ్డియ శజ్ఞమ్ మడుత్తూద) - అని విజయశంఖాలను నోటిలో పెట్టుకొని ఊదగా- అని దీని అర్థం. "పూజ్గాళ్ తిరుముకత్తు మడుత్తు ఊదియ శజ్గొలి" (పూవువంటి ముఖంలో పెట్టుకొని ఊదిన శంఖంయొక్క ధ్వని) (నాచ్చి తిరు 9-9) అని చెప్పబడిందికదా!

(ఎడుత్తూత) ఎన్నపోతు- శఙ్ఖత్తై ఎడుత్తు వాయాలే ఊత -ఎన్నపడి. (అడుత్తూత) ఎన్నపోతు - కిట్టి ఊత -ఎన్నపడి. అధిక్షేపిత్త విద్వాన్గళ్ వాయడైక్కుమ్పడి.

(వేణ్డియ వేతజ్గళోతి) "సర్వే వేదా యత్పద మామనన్తి", "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" ఎన్గిఅపడియే వేదజ్గళ్ ఎల్లావఱ్ఱాలుమ్ ఆరాధనప్రకారత్తైయుమ్ ఆరాధ్యవస్తువైయుమ్ శొల్లుకిఱతెన్ఱు అఱుతియిట్టు, భగవత్పరత్వత్తై సాధిత్తు, ఇని త్తామ్బుక్కైక్కు హేతువెన్? ఎన్ఱు తిరువడి కళిలే తాళ్న్ద కిழியై త్వరిత్తు అఱుత్తవరుడైయ - ద్రవ్యగ్రన్థియై యఱుత్తవరుడైయ.

(పాతజ్గళ్) కిழி యఱుత్త పట్టర్‌పిరాన్ పాతజ్గళ్.

(యాముడైయ పఱ్ఱు) "పట్టర్ పిరానడియేన్" ఎన్నుమ్పడి అవర్క్కు శేషభూతరాయిరుక్కిఱ నమ్ముడైయ రక్షై, "తకైయాన్ శరణమ్ తమర్కట్కోర్

---

(ఎడుత్తు ఊద) - అంటే- శంఖాలను పైకెత్తి ఊదగా అని అర్థం. (అడుత్తూద) - అంటే సమీపించి ఊదగా -అని అర్థం. ఎదిరించి వాదించిన విద్వాంసులు నోరు మూసికొనేటట్లు -అని తాత్పర్యం.

(వేణ్డియ వేదజ్గళోతి) - "సర్వే వేదా యత్పద మామనంతి" (కఠవల్లి- 2-15) (వేదాలన్నీ ఎవని స్థానాన్ని గూర్చి పల్కుతున్నాయో) అని, "వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః" (భగవద్గీత -15-15) (వేదాలు అన్నిటిచేత నేనే తెలియదగినవాడను) అని చెప్పబడ్డ రీతిలో అన్ని వేదాలు పరతత్త్వం అయిన నారాయణుని గూర్చి, అతనిని ఆశ్రయించే మార్గాన్నిగూర్చి తెలుపుతున్నవని నిశ్చయించి వేదాల భగవత్పరత్వాన్ని నిరూపించారు. ఇక కిందకు వాలడంలో ఆలస్యం చేయడం ఎందుకోసం? అని తమ శ్రీచరణాలలో వాలిన వాదశుల్కగ్రంథిని వేగంగా ఛేదించినవారియొక్క-

(పాదజ్గళ్) -వాదశుల్కపు మూటను ఛేదించిన భట్టనాథుని శ్రీచరణాలు-

(యాముడైయ పఱ్ఱు) - "పట్టర్‌పిరానడియేన్" అని పలికేటట్లు వారికి దాసుడనై ఉండే మనకు రక్షకం- "తకైయాన్ శరణమ్ తమర్కట్కోర్ పఱ్ఱు" (సర్వసమానుడైన భగవానుని శ్రీచరణాలు భక్తులకు అద్వితీయమైన ఆశ్రయం) (తిరువాయ్- 10-4-10) అని నమ్మాళ్వార్లు అనుగ్రహించిన రీతిలో అందరికి సమానుడైన భగవానుని శ్రీచరణాలు కావు; "అవనై ప్పల్లాణ్డు పాడుమ్ పాన్మైయన్ తాళ్" (అతనికి పల్లాండు పాడే స్వభావాన్ని కల పెరియాళ్వార్ల శ్రీచరణాలు)

పఱ్ఱు" ఎన్గిఱ పొతువానవనుడైయ తిరువడికళన్ఱు; అవనై ప్పల్లాణ్డెన్ఱు కాప్పిడుమ్ పొన్మైయన్హాళ్.

(యాముడైయ పఱ్ఱు) నమ్ముడైయ అరణ్-పుకల్, ఉపాయమ్; శరణ్యమెన్ఱపడి.

(యాముడైయ పఱ్ఱు) పఱ్ఱఱ్ఱ నమ్ముక్కై పఱ్ఱు. "పఱ్ఱిలార్ పఱ్ఱ నిన్హాన్" ఎన్నక్కడవతిఱే.

తనియన్‌కళ్ వ్యాఖ్యానమ్ ముఱ్ఱిఱ్ఱు

శ్రీ పిళ్ళైలోకమ్ జీయర్ తిరువడికళే శరణమ్

---

(ఇరామానుశ. నూఱ్ఱన్దాది -15) అని అముదనార్ అనుగ్రహించిన రీతిలో భగవానునకు మంగళాశాసనం చేసేవారైన పెరియాళ్వార్ల శ్రీచరణాలు.

(యాముడైయ పఱ్ఱు) - మన ఆశ్రయం, ఉపాయం, శరణ్యం- అని భావం.

(యాముడైయ పఱ్ఱు) -వేఱు ఆశ్రయం లేని మనకు ఆశ్రయం. 'పఱ్ఱిలార్ పఱ్ఱి నిన్హాన్" ఏ ఆశ్రయం లేని వారికి ఆశ్రయంగా నిలచి ఉన్నాడు) (తిరువాయ్ -7-2-7) అని నమ్మాళ్వార్ భగవానుని గూర్చి పల్కినట్లే పెరియాళ్వార్లుకూడా "నిరాశ్రయులమైన మనకు ఆశ్రయం'' అని అంటున్నారు.

తనియన్ వ్యాఖ్యానం ఆంధ్రానువాదం ముగిసింది

శ్రీ పిళ్ళైలోకమ్ జీయర్ తిరువడికళే శరణమ్

Scanned by CamScanner

శ్రీమతే రామానుజాయ నమః

పెరియవాచ్చాన్ పిళ్ళై అరుళిచ్చెయ్‌త

## తిరుప్పల్లాణ్డు వ్యాఖ్యానావతారికై

"పతిం విశ్వస్యాత్మేశ్వరమ్" ఎన్నుమ్, "తమీశ్వరాణాం పరమం మహేశ్వరమ్" ఎన్నుమ్ సర్వస్వామియాకవుమ్, సర్వనియన్తావాకవుమ్ సర్వేశ్వరన్ స్వరూపత్తై

---

పెరియవాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన తిరుప్పల్లాణ్డు వ్యాఖ్యానమ్ - ఆంధ్రానువాదం.

### అవతారిక

"పతిం విశ్వస్యాత్మేశ్వరమ్" (తైత్తి-నారా) (లోకానికి పతి, తనకు తానే ఈశ్వరుడు అయినవానిని) అని, "తమీశ్వరాణాం పరమం మహేశ్వరమ్, తం దేవతానాం పరమం చ దైవతమ్" (శ్వేత -6-7) (ఈశ్వరులకు అందరికి గొప్ప మహేశ్వరుడు అయిన అతనిని, దైవంలో గొప్ప దైవం అయిన అతనిని) అని చెప్పబడిన ప్రమాణాలనుబట్టి సర్వస్వామిగా (అందరిని సొత్తుగా కల్గినవాడుగా),

---

### అరుమ్బదమ్

అరు : పరమకారుణికరాన పెరియవాచ్చాన్ పిళ్ళై, స్వాచార్యనియమనత్తాలే తిరువాయ్‌మొழிక్కు ఇరుపత్తునాలాయిరమాక ఒరు వ్యాఖ్యానమ్ శెయ్‌తరుళి, పిన్బుళ్ళవైయాన ఇరుపత్తు మూన్ఱు దివ్యప్రబన్దజ్గళుక్కుమ్ తెరియ వ్యాఖ్యైకళ్ (ఉపదేశ-46) శెయ్‌వతాక త్తిరువుళ్ళమ్ పఱ్ఱి, వేతత్తుక్కు ఓమెన్నుమతుపోల్ ఉళ్ళతుక్కెల్లామ్ శురుక్కాన (ఉపదేశ-19) తిరుప్పల్లాణ్డుక్కు వ్యాఖ్యానమ్ శెయ్‌తరుళక్కోలి, వక్తృవైలక్షణ్య పూర్వకమాక ఇప్రబన్దవైభవత్తై ప్పలపడియాలు ముపపాదిత్తుక్కొణ్డు, ప్రతిపాద్య వైలక్షణ్యత్తైయుమ్ శురుజ్గ అరుళిచ్చెయ్‌కిఱార్ (పతిం విశ్వస్య ఇత్యాది, మేలి ల్పాట్టు ఫలశ్రుతి) ఎన్నుమళవుమ్.

అతిల్, చేతనోజ్జీవనార్థమాక ప్పెరియాழ்వారై సర్వేశ్వరన్ అవతరిప్పిత్తరుళి నాన్-ఎన్టరుళిచ్చెయ్య త్తిరువుళ్ళమ్బఱ్ఱి అధిష్ఠికై యిడుకిఱార్ (పతిం విశ్వస్యేత్యాది). ఎడుత్త శ్రుతిక్కు అర్థమ్ - (సర్వస్వామియాకవుమ్, సర్వనియన్తానాకవుమ్) ఎన్టతు. (స్వరూపానురూపమాన జ్ఞానమావతు- శేషభూతనుక్కు శేషిపక్కల్

నిర్ణయిత్తు, చేతనస్వరూపత్తై "యస్యాస్మి" ఎన్నుమ్, "పరవానస్మి" ఎన్నుమ్, "దాసోఽహం వాసుదేవస్య" ఎన్నుమ్, "దాసభూతా స్స్వతస్సర్వే" ఎన్నుమ్ నిరూపిత్తు, ఇన్ద స్వరూపానురూపమాన జ్ఞానముమ్, జ్ఞానానురూపమాన వృత్తముమ్ ప్రాప్తమాయిరుక్క, అయఃపిణ్డత్తుక్కు అగ్నిసంసర్గత్తాల్ వన్ద తాదాత్మ్యమ్బోలే, చేతనర్ అచిత్సంబంధత్తాలే "దేవోఽహమ్", "మనుష్యోఽహమ్" ఎన్ను అహఙ్కరిత్తు, పుత్రమిత్రాదికళ్ పక్కలిలే మమతాబుద్ధియై పణ్ణి- ఇప్పడి ప్రవాహరూపేణ

---

అందరిని నియమించేవానినిగా సర్వేశ్వరుని స్వరూపాన్ని నిర్ణయించాలి. చేతనస్వరూపాన్ని, "యస్యాస్మి న తమంతరేమి" (నేను ఎవనికి శేషభూతుడనై ఉన్నానో ఆ భగవానుని విడచి ఉండను) అని, "పరవానస్మి కాకుత్స్థ! త్వయి వర్షశతం స్థితే, స్వయంతు రుచిరే దేశే క్రియతామితి మాం వద" (రామా.అర-15-7) (ఓ కాకుత్స్థా! ఎల్లప్పుడు నీకు నేను పరతంత్రునిగానే- దాసునిగానే- ఉంటాను. నీవే నీకు ఇష్టమైన చోట పర్ణశాలను నిర్మించమని నన్ను ఆజ్ఞాపించు) అని, "దాసోఽహం వాసుదేవస్య దేవదేవస్య శార్ఙ్గిణః, శంఖచక్రగదాపాణేః త్రైలోక్యస్యైకచక్షుషః" (పుండరీకసంవాదం - నారదవచనం). (దేవదేవుడు, శార్ఙ్గమనే వింటిని కలవాడు, శంఖం, చక్రం, గద- అనే వీటిని శ్రీహస్తంలో కల వాడు, ముల్లోకాలకు అద్వితీయ నేత్రం అయిన వాసుదేవునకు నేను శేషభూతు డను.) "దాసభూతాః స్వత స్సర్వే హ్యాత్మానః పరమాత్మనః", (హారీతస్మృతి- ఈశ్వర సంహిత - శివవచనమ్) అని చెప్పబడిన ప్రమాణాలవల్ల జీవాత్మ సర్వేశ్వరునకు శేషభూతుడు- అని తెలిసికోవాలి. ఈ విధంగా పరమాత్మ అయిన భగవానుడే అందరికీ నాథుడు; అతనికి కైంకర్యం చేయడమే జీవాత్మకు తగినది- అనే జ్ఞానం, ఆ జ్ఞానానికి తగిన అనుష్ఠానం అందరికీ కలగాలి. అయితే, చిరకాలం నిప్పులో వేయబడిన ఇనుపముక్క, నిప్పుతో అది కలిగి ఉండే చిరకాల సంబంధంవల్ల, నిప్పువలె మారిపోయే రీతిలో, జీవులు, అనాది అయిన అచిత్తుతో చిరకాలంగా కల్గిఉండే సంబంధం కారణంగా "దేహమే ఆత్మ" అని భావిస్తున్నారు. అందువల్ల తాము నిత్యం చేరి ఉండే శరీరాన్నే మనస్సులో భావించి, 'నేను దేవుడను, నేను మానవుడను" అనే అహంకారాన్ని, పుత్రమిత్రాదులపట్ల "వీరు నావారు" అనే మమకారాన్ని కల్గినవారవుతున్నారు. ఈ విధంగా ప్రవాహరూపమై

---

కైఙ్కర్యమే కర్తవ్యమెన్గిఱ జ్ఞాన మెన్గై. (వృత్తముమ్) ఎన్ఱ అనన్తరమ్ "తజ్గళుక్కుణ్డాక్కుడి అర్థిక్క" ఎన్ను శేషమ్. (తాదాత్మ్యమావతు) - అభేదబుద్ధి. (చేతనర్) ఎన్ఱతు- క్షేత్రజ్ఞమ్ మేలుమస్వయిక్కిఱతు. (అహఙ్కారమమకారఙ్గళాలే) ఎన్ఱతు- అహఙ్కార

Scanned by CamScanner

నిత్యమాన అహజ్కార-మమకారజ్గళాలే సర్వేశ్వరగతమాన స్వామిత్వనియన్తృత్వజ్గళై త్తజ్గళ్ పక్కలిలే అధ్యవసిత్తు, స్వతఃప్రాప్తమాన పారతన్త్ర్యత్తిల్ విముఖరాయ్, అత ఏవ శబ్దాదివిషయప్రవణరాయ్, అత్తాల్ వన్ద రాగద్వేషాదికళాలే అభిభూతరాయ్ పడుకిఱ దుఃఖపరమ్పరైకళై అనుసన్ధిత్తు, నిరుపాధికశేషియాన సర్వేశ్వరన్, "శాసనా చ్ఛాస్త్రమ్" ఎన్గిఱపడియే తత్త్వహితజ్గళై యఱిన్దు నల్వழి పోకైక్కుడలాక శాస్త్రత్తై ప్రకాశిప్పిత్తరుళినాన్. "హర్తుం తమ స్సదసతీ చ వివేక్తుమీశో మానం ప్రదీపమివ కారుణికో దదాతి" ఎన్నక్కడవతిఱే.

ఇన్ద శాస్త్రప్రదానముమ్ వాసనాదూషితమాకైయాలే అకిఞ్చిత్కరమాక, ఒరై పుఱత్తిల్ శెల్లాత దేశత్తిలే ఎడుత్తువిడుమ్ రాజాక్కళైప్పోలే, రామకృష్ణాదిరూపేణ

---

కొనసాగే అహంకారమమకారాలచేత భగవానుని స్వరూపమైన (సర్వేశ్వరునకు చెందిన) స్వామిత్వ- నియంతృత్వాలను తమలో ఉన్నవి -అని ఆరోపించుకొని బావించి, సహజంగా ప్రాప్తమైన పారతంత్ర్యంలో విముఖులై, అందువల్లనే శబ్దాది లౌకికవిషయాలలో ఆసక్తిని కలవారై, అందువల్ల కల్గిన రాగద్వేషాదులచేత అభిభూతులై, వారు నిరంతరంగా అనుభవిస్తున్న దుఃఖపరంపరలను తలచి, నిరుపాధిక శేషి అయిన (సహజంగా శేషి అయిన) సర్వేశ్వరుడు "శాసనాత్ శాస్త్రమ్" (శాసిస్తున్నందున శాస్త్రమనబడుతున్నది) అనే రీతిలో జీవులు తత్త్వ-హితాలనుగూర్చి తెలిసి సన్మార్గంలో ప్రవర్తించడానికి వీలుగా శాస్త్రాన్ని ప్రకాశింపజేశాడు. "హర్తుం తమః సదసతీ చ వివేక్తుమీశో మానం ప్రదీపమివ కారుణికో దదాతి, తేనావలోక్య కృతినః పరిభుంజతే తం తత్రైవ కేఽపి చపలా శ్శలభీభవంతి" (శ్రీరంగరాజస్తవం- ఉత్తరశతకం-2) (సహజంగానే కరుణను కలవాడైన భగవానుడు అజ్ఞానమనే చీకటిని పోగొట్టడంకోసం, మంచి చెడ్డలను విభాగించి తెలిసికోవడంకోసం గొప్ప దీపంవంటి వేదశాస్త్రాన్ని ఇచ్చాడు. అదృష్టవంతులు ఆ దీపంతో ఆ స్వామిని దర్శించి అనుభవిస్తున్నారు. కొందఱు చపలులు మాత్రం ఆ దీపంలోనే మిడతలవలెపడి (అపార్థాలను పల్కి నశించిపోతున్నారు). అని ఈ విషయం గూర్చి పరాశరభట్టర్ కూడా అనుగ్రహించారు.

---

మమకారహేతువాన అచిత్సంబంధత్తాలే - ఎన్నపడి. ఉక్తార్థత్తుక్కు ప్రమాణమ్ (హర్తు మిత్యాది) (సదసతీ) - నల్లతుమ్, తీయతుమ్.

"జన్మాన్తరసహస్రేషు యా బుద్ధిర్భావితా నృణామ్, తామేవ భజతే జన్తురుప దేశో నిరర్థకః" ఎన్గిఱ వచనత్తై యుట్కొణ్డు అరుళిచ్చెయ్కిఱార్ (ఇన్ద శాస్త్ర

వన్దవతరిత్తు, "పితుర్వచననిర్దేశాత్", "భరద్వాజస్య శాసనాత్" ఎన్ను పితృవచన పరిపాలనాదికళై ఆచరిత్తరుళియుమ్, ఇళైయపెరుమాళై యిడువిత్తు "వకుత్త విషయత్తిల్ శేషవృత్తియే ఇవ్వాత్మావుక్కు స్వరూపమ్" ఎన్నుమిదత్తై ప్రకాశిప్పిత్తరుళియుమ్, "రాజ్యఞ్చాహఞ్చ రామస్య" ఎన్నుకొణ్డు ఇన్ద వృత్తిక్కడియాన పారతన్త్ర్యత్తై శ్రీభరతాఴ్వానై యిట్టు ప్రకాశిప్పిత్తరుళియుమ్, ఇప్పారతన్త్ర్యకాష్ఠైయై, "గచ్ఛతా మాతులకులం భరతేన... నీతః" ఎన్నుకొణ్డు శ్రీశత్రుఘ్నాఴ్వానైయిట్టు ప్రకాశిప్పిత్తరు

---

ఈ శాస్త్రప్రదానంకూడా. చిరకాలం అచిత్తుతో చేతనులు కల్గి ఉన్న నిరంతర సంబంధంచేత వారికి ఉపయోగపడకుండానే పోయింది. తన ఆజ్ఞాపత్రంలో వ్రాయబడిన శాసనం చెల్లని దేశంపైకి స్వయంగా బలాన్ని తీసికొని దండయాత్రను చేసి తన ఆజ్ఞను సుస్థిరం చేసికొనే ప్రభువువలె, భగవానుడుకూడా తానే స్వయంగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడువంటి అవతారాలను ఎత్తి, శాస్త్రాలలో చెప్పినవానిని తానే ఆచరించి చూపించాడు. "స జగామ వనం వీరః ప్రతిజ్ఞా మనుపాలయన్, పితుర్వచననిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్" (రామా-బాల-1-24) (వీరుడైన ఆ రాముడు తన ప్రతిజ్ఞావచనాన్ని కాపాడుతూ, తండ్రి ఆజ్ఞవల్ల, కైకేయికు ఇష్టమైనందువల్ల వనానికి వెళ్ళాడు) అని, "చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్, రమ్యమావసథం కృత్వా రమమాణా వనే త్రయః" (భరద్వాజుని శాసనం వల్ల చిత్రకూటాన్ని చేరి, అక్కడ అందమైన పర్ణశాలను నిర్మించుకొని, ఆ ముగ్గురు వనంలో ఆనందించారు.) అని పల్కిన రీతిలో తండ్రి మొదలైన పెద్దల ఆజ్ఞకు లోబడడం- అనే సాధారణధర్మాన్ని ఆచరించి చూపించాడు. లక్ష్మణునిద్వారా ప్రాప్తశేషి అయిన భగవానునకు కైంకర్యం చేయడమే జీవాత్మకు తగినది- అని వ్యక్తం చేశాడు. "కథం దశరథాజ్జాతో భవేద్రాజ్యాపహారకః, రాజ్యం చాహం చ రామస్య ధర్మం వక్తుమిహార్హసి" (రామా- అయో-82-12) (దశరథునకు పుట్టిన నేను ఏవిధంగా రాజ్యాన్ని అపహరిస్తాను? రాజ్యం, నేను అనే ఈ రెండూ శ్రీరామునకు శేషమైనవే. మీరు ఈ విషయంలో ధర్మాన్ని చెప్పాలి) అని

---

ప్రదానమమిత్యాది) (అకిఞ్చిత్కరమ్) ఎన్దతు - అనేకవిషయఙ్గళిల్ అకార్యకర మెన్దపడి. (ఎడుత్తు విడుకైయావతు) - సేనైయై త్తిరట్టిక్కొణ్డుపోకై. పెరుమాళ్ సామాన్యధర్మనిష్ఠరెన్ను తోన్ఱుకైక్కాక (వకుత్త విషయత్తిల్) ఎన్దతు. (ఎన్నుకొణ్డు) ఎన్దతు- ఎన్ను శొల్లప్పట్టుక్కొణ్డిరుక్కుఅ-ఎన్దపడి. ఇళైయపెరుమాళై వ్యావర్త్తిక్కైక్కాక (ఇన్ద వృత్తిక్కడియాన పారతన్త్ర్యమ్) ఎన్దతు. (ఇన్ద వృత్తి) అచిత్తైప్పోలేయిరుక్కై. శ్రీభరతాఴ్వానిలుమ్ ఆధిక్యమ్ తోన్ఱ (పారతన్త్ర్యకాష్ఠై) ఎన్గిఅతు. (అవజానన్ని)

Scanned by CamScanner

ళియుమ్, కృష్ణనాయ్ వన్దవతరిత్తు దూత్యసారథ్యజ్గళై ఆచరిత్తరుళియుమ్, "యద్యదాచరతి శ్రేష్ఠః" ఎన్ఱు శ్రేష్ఠసమాచారమ్ కర్తవ్యమ్ ఎన్ఱు ఉపదేశిత్తరుళియుమ్- ఇప్పడి బహుప్రకారత్తాలే ఆత్మాక్కళుడైయ పారతంత్ర్యత్తై ప్రకాశిప్పిత్తరుళిన విడత్తిలుమ్, పెరియవన్ తాళ్ఱనిన్ఱు ఆచరిత్త ఇమ్మహాగుణత్తిలే "అవజానన్తి మాం మూఢాః" ఎన్గిఱపడియే అనీశ్వరత్వమాకిఱ దోషత్తై ఆవిష్కరిత్తు క్కాళ్కడై క్కొళ్ళు

---

పల్కినట్లుగా ఈ శేషవృత్తికి అనురూపమైన పారతంత్ర్యాన్ని భరతునిద్వారా ప్రకాశింపజేశాడు. "గచ్ఛతా మాతులకులం భరతేన తదాஉనఘః, శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నో నీతః ప్రీతిపురస్కృతః" (రామా-అయో-1-1) (పాపం లేనివాడు, నిత్యశత్రువైన ఇంద్రియాలను జయించినవాడు, ప్రీతితో వెంటబెట్టుకొనబడినవాడు అయిన శత్రుఘ్నుడు మేనమామ ఇంటికి పోయే భరతునిచేత వెంట తీసికొని పోబడ్డాడు) అని పల్కినట్లుగా పారతంత్ర్యంయొక్క పరమావధిని శత్రుఘ్నునిద్వారా ప్రకాశింపజేశాడు. శ్రీకృష్ణుడై అవతరించి దూతగా పోవడం, సారథ్యం చేయడం వంటి నీచమైన కృత్యాలను చేసి తన సౌలభ్యాన్ని ప్రదర్శించాడు. "యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః, స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే" (గీత-3-21) (జ్ఞాని అయినవాడు ఏయే కార్యాలను చేస్తున్నాడో, సామాన్యుడైన ఇతరుడు కూడా ఆయా కార్యాలను చేస్తున్నాడు. ఆ జ్ఞాని కర్మలను ఎంతవరకు చేస్తున్నాడో, సామాన్యుడుకూడా దానినే అనుసరిస్తున్నాడు) అని మహనీయుని ఆచరణను అనుసరించాలి- అని ఉపదేశించాడు. ఈ విధంగా పలు రీతులలో ఆత్మల పారతంత్ర్యాన్ని ప్రకాశింపజేసినా గొప్పవాడైన సర్వేశ్వరుడు తాను మానవునిగా అవతరించి, పెద్దల మాటలను వినడం, దూత్యం చేయడంవంటి కార్యాలను తాను తక్కువవాడై ఉండి చేసినా, దానిని చేతనులు గ్రహించలేదు. "అవజానంతి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్, పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్" (గీ-9) (భూతాలకు-ప్రాణులకు - గొప్ప ఈశ్వరుడను, మానవరూపాన్ని పరిగ్రహించినవాడను అయిన నా పరత్వాన్ని తెలియని మూఢులు నన్ను అవమానిస్తున్నారు) అని అతడే పల్కిన రీతిలో అతని కార్యాలను యథాతథంగా తెలిసికోలేకుండా, ఈ విధంగా తక్కువ స్థితిలో ఉన్నవాడు ఈశ్వరుడై ఉండే

---

అవజ్ఞాం కుర్వన్తి. ఇత్తై ప్పత్ఱ (కాళ్కడైక్కొళ్ళుకైయాలే) ఎన్గతు. "మూఢా" ఎన్గత్తై ప్పత్ఱ (కార్యకరమాయ్త్తిల్లై) ఎన్గిఱతు. (పార్శ్వై) ఎన్గిఱతు - మృగమ్ పిడిక్క సాధనమాక వైత్త మృగమ్. (పార్శ్వై వైత్తు మృగమ్ పిడిప్పారైప్పోలే) ఎన్గిఱ దృష్టాన్త బలత్తాలే, ఆళ్వారుడైయ అవతారమకార్యకరమెన్ఱు తోన్ఱుకిఱతు. ఇత్తాల్-

